


# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com






హైదరాబాద్ | గురువారం 3-9-2020 | RNI No.52865/93·Postal No\.H/SD/258/2018-201 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి :27 | సంచిక:28 | పేజీలు: 8 | వెల: రూ.1/-


## ఈ ఏడాది చివరి నాటికి 75వేల డబుల్ ఇళ్లు

### పార్టీ ఎమ్మెల్యేలతో మంత్రి కెటిఆర్ సమీక్ష

హైదరాబాద్,సెప్టెంబర్2(ఆర్ఎన్ఎ): ఈ ఏడాది చివరి నాటికి సుమారు 75 వేల డబుల్ బెడ్‌రూం ఇండ్లు పంపిణీకి సిద్ధమవుతాయని ఎమ్మెల్యేలకు కేటీఆర్ తెలిపారు. అన్నింటికీ సానుకూలంగా నిర్ణయం తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు. మల్కాజ్‌గిరి పార్లమెంట్ పరిధి లోని ఎమ్మెల్యేలతో రాష్ట్ర ఐటీ, మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గాల వారీగా చేపట్టాల్సిన పనులను ఎమ్మెల్యేలు మంత్రికి వివరించారు. ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ.. ప్రతి నియోజకవర్గంలో వైకుంఠధామాల ఏర్పాటు, చెరువుల అభివృద్ధి, సుందరీకరణ పనులు వేగవంతం చేయాలన్నారు. లాక్‌డౌన్ సమయాన్ని చక్కగా వినియోగించుకుని జీహెచ్ఎంసీ రోడ్ల లేయింగ్, నిర్మాణ పనులను పూర్తి చేశామని కేటీఆర్ తెలిపారు. ఈ విషయంలో ప్రజల నుంచి మంచి స్పందన వచ్చిందని పేర్కొన్నారు. ఎస్ఆర్‌డీపీలో భాగంగా నిర్మించిన పలు పనుల ద్వారా చాలాచోట్ల ట్రాఫిక్ కష్టాలు తప్పాయన్నారు. ముఖ్యంగా ఎల్బీనగర్ చౌరస్తా వంటి పలు చోట్ల మొత్తం రూపురేఖలు మారిపోయాయి. అంత వేగంగా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ పనులు పూర్తయ్యాయి. ఫుట్‌పాత్‌లు, టాయిలెట్ల నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయని తెలిపారు. ప్రస్తుతం కొనసాగుతున్న శానిటేషన్ పనులు, జలమండలి సివరేజ్ నిర్వహణపై మంత్రి కేటీఆర్ సంతృప్తి వ్యక్తం చేశారు.

## అధికారిక లాంఛనాలతో మాతంగి అంత్యక్రియలు

### నివాళి అర్పించిన మంత్రి కొప్పుల ఈశ్వర్

హైదరాబాద్,సెప్టెంబర్2(ఆర్ఎన్ఎ): మాజీ మంత్రి మాతంగి నర్సయ్య అంత్యక్రియలను అధికారికంగా నిర్వహించాలని ముఖ్యమంత్రి కె. చంద్రశేఖరరావు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్‌కుమార్‌ను ఆదేశించారు. దీనికి సంబంధించిన ఏర్పాట్లు చేయాలని కోరారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా మేడారం నియోజకవర్గం మాజీ శాసనసభ్యుడు, మాజీ మంత్రి మాతంగి నర్సయ్య భౌతిక కాయాన్ని సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ సందర్శించారు. ఆయన భౌతిక కాయానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. మంత్రి వెంట రామగుండం శాసనసభ్యుడు కోరుకంటి చందర్, మేయర్ అనిల్ కుమార్ తదితరులు ఉన్నారు.

## సిరిసిల్లను ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దాలి : కేటీఆర్

హైదరాబాద్,సెప్టెంబర్2(ఆర్ఎన్ఎ): సిరిసిల్ల పట్టణాన్ని ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దాలని మంత్రి కేటీఆర్ సూచించారు. ఆ దిశగా అధికార యంత్రాంగం పని చేయాలని ఆదేశించారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో అభివృద్ధి పనులపై రాష్ట్ర ఐటీ, మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రజారోగ్యానికి ప్రాధాన్యం ఇచ్చేలా ప్రభుత్వ సేవలు ఉండాలన్నారు. ప్రజారోగ్య సేవలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని యంత్రాంగానికి కేటీఆర్ సూచించారు. సిరిసిల్లలో అభివృద్ధి పనులను పరుగులెత్తించాలి. సిరిసిల్లలో సాగునీటి ప్రాజెక్టులు, అభివృద్ధి పనుల పురోగతిని కేటీఆర్ తెలుసుకున్నారు. సిరిసిల్లలో చెరువులన్నీ నిండాయి.. మంచి పంటలు పండే అవకాశం ఉందన్నారు. కొవిడ్ బాధితులకు అందిస్తున్న చికిత్స గురించి ఆయన తెలుసుకున్నారు. సిరిసిల్లకు అవసరమైన కొవిడ్ మెడిసిన్స్‌ను అందిస్తామన్నారు.

క్లస్టర్ ఆస్పత్రులపై మరింత దృష్టి పెట్టాలని కేటీఆర్ సూచించారు.



ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి, బందలింగంపల్లి పీహెచ్‌సీలను వేగంగా నిర్మించాలని ఆదేశించారు. విలీన గ్రామాల్లోనూ అభివృద్ధి కార్యక్రమాలను వేగంగా కొనసాగించాలని చెప్పారు. సిరిసిల్ల జిల్లాలో రైతు వేదికల నిర్మాణ పనుల పురోగతిని మంత్రి అడిగి తెలుసుకున్నారు. 154 గ్రామాల్లో కొనసాగుతున్న ఫ్లలే ప్రకృతి వనాల పనుల తీరుపై కేటీఆర్ ఆరా తీశారు.

## మావోయిస్ట్ ప్రభావిత ప్రాంతాల్లో డిజిపి పర్యటన

### రెండోసారి పర్యటనతో సర్వత్రా ఉత్కంఠ

### గణపతి తదితరుల లొంగుబాటు ప్రకటనల నేపథ్యంలో ప్రాధాన్యత

కొమురంభీం,సెప్టెంబర్2(ఆర్ఎన్ఎ): ఉమ్మడి అదిలాబాద్ జిల్లాలో మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో తెలంగాణ డీజీపీ మహేందర్ రెడ్డి ఏరియల్ సర్వే నిర్వహించారు. తిర్యాణిలోని మంగి అటవీ ప్రాంతాలతో పాటు మహారాష్ట్ర సరిహద్దు ప్రాణహిత పరివాహక ప్రాంతాలతో పాటు ఏజెన్సీ ప్రాంతాలను పరిశీలించారు. పోలీసు అధికారులతో మావోయిస్టుల కదలికలపై ఆరాతీసారు. నెలరోజుల్లో రెండుసార్లు డీజీపీ ఆసిఫాబాద్ ఏజెన్సీలో పర్యటించడంతో స్థానికంగా ప్రాధాన్యత నెలకొంది. ఈ క్రమంలో మావోయిస్టు అగ్రనేత గణపతి లొంగుబాటు విషయమై కూడా చర్చ కొనసాగుతోంది. డీజీపీ మహేందర్ రెడ్డి బుధవారం ఆసిఫాబాద్‌లో పర్యటించారు. హెలికాప్టర్‌లో ఏఆర్ హెడ్ క్వార్టర్స్‌కు పోలీస్ బాస్ చేరుకున్నారు. 45 రోజుల వ్యవధిలో రెండో సారి ఆసిఫాబాద్‌లో డీజీపీ పర్యటన కొనసాగుతోంది. అగ్రనేతల లొంగుబాటు వార్తల నేపథ్యంలో డీజీపీ పర్యటనపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. మావోయిస్టుల కదలికల నేపథ్యంలో జూలై 17న డీజీపీ మహేందర్ రెడ్డి జిల్లాలో పర్యటించి వెళ్లిన విషయం తెలిసిందే. డీజీపీ మహేందర్‌రెడ్డివెంట జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్, రామగుండం సీపీ సత్యనారాయణ ఉన్నారు. హెలిప్యాడ్ వద్దే అధికారులతో మావోయిస్టు కదలికలపై సమీక్షించారు. అయితే మావోయిస్టుల సంచారం నేపథ్యంలో డీజీపీ ఏరియల్ సర్వే నిర్వహించారు. ఆదిలాబాద్, తిర్యాణి, నార్నూరు, దేవపూర్ ప్రాంతాల్లో ఆయన పర్యటించారు. అగ్రనేతల లొంగుబాటు వార్తల నేపథ్యంలో డీజీపీ పర్యటనపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. మావోయిస్టుల కదలికల నేపథ్యంలో జూలై 17న పర్యటించారు. గత నెలలో ఉమ్మడి ఆదిలాబాద్ అడవుల్లో మావోయిస్టుల కదలికలు తీవ్ర కలకలం రేపాయి. వారి కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టినా ఇప్పటి వరకు వారు చిక్కలేదు.గుర్తు తెలియని శవాన్ని 8 గంటల పాటు 25 కి.మీ దూరం మోసుకెళ్లిన జవాన్లు మరోవైపు మావోయిస్టు అగ్రనేత గణపతి అనారోగ్యం కారణంగా తన కుటుంబ సభ్యులతో పోలీసులకు లొంగిపోయేందుకు ప్రయత్నిస్తున్న తెలిసిందే. దీనిపై ఆయన అనుచరులు, కుటుంబ సభ్యులు, ప్రభుత్వానికి మధ్య చర్చలు జరుగుతున్నట్లు ఇంటెలిజెన్స్ వర్గాల ద్వారా సమాచారం. 74 ఏళ్ల గణపతి గత రెండు సంవత్సరాల నుంచి అనారోగ్యం కారణంగా పార్టీ ప్రధాన కార్యదర్శి పదవి నుంచి తప్పుచుకున్నారు. తీవ్ర అనారోగ్యం కారణంగా ఆయన లొంగిపోవాలని అనుకున్నట్లు తెలుస్తోంది. ఇక ఇటీవల ఆదిలాబాద్‌లో పోలీసులు కూంబింగ్ నిర్వహిస్తున్న సమయంలో మావోయిస్టు భాస్కర్‌రావు డైరీ దొరికింది. అందులో కొందరు ప్రముఖ మావోయిస్టుల పేర్లున్నట్లు సమాచారం. ఈ సందర్భంగా డీజీపీ పర్యటన చర్చనీయాంశమైంది.

## ఆన్‌లైన్ విద్యకు మంచి స్పందన

### ప్రకటన చేసిన ప్రభుత్వం

హైదరాబాద్,సెప్టెంబర్2(ఆర్ఎన్ఎ): తెలంగాణ ప్రభుత్వం ప్రారంభించిన ఆన్‌లైన్ విద్యకు భారీ స్పందన లభించింది. కోవిడ్ మహమ్మారి కారణంగా ఆన్‌లైన్ విద్యను టీ-సాట్ నెట్‌వర్క్ ఛానళ్ల ద్వారా ప్రారంభించిన విద్యాశాఖ మంచి ఫలితాలను రాబట్టింది. రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులు ఆన్‌లైన్ పాఠాలు చూసినట్టు టీ-సాట్ యాప్‌ద్వారా నిర్ధారణ అయ్యిందని అధికారులు తెలిపారు. ప్రభుత్వం నిర్ణయించిన తేదీ, సమయం ప్రకారం మూడో తరగతి నుంచి 10వ తరగతి వరకు ఆన్‌లైన్ విద్యాబోధన నిర్వహిస్తున్నారు. ప్రారంభమైన మొదటి రోజే 11,73,921 వ్యూస్ రాగా, 1,56,658 సబ్ స్క్రైబ్‌లు లభించాయి. ఒక్కరోజే భారీగా విద్యార్థుల నుంచి స్పందన లభించడం రాష్ట్రవ్యాప్తంగా ఉన్నఉపాధ్యాయులతో పాటు విద్యాశాఖ లోనూ ఉత్సాహం నింపింది. మరో వైపు రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో విద్యాశాఖ చేస్తున్న శ్రమకు మంచి ఆదరణ లభించడంతో ఐటీ, మున్సిపల్‌శాఖ మంత్రి కె. తారాక రామారావు సంతోషం వ్యక్తం చేశారు. విద్యాశాఖను, ప్రసారాలపై ప్రత్యేక శ్రద్ధ కనబర్చిన టీ-సాట్‌ను అభినందించారు.

## తెలంగాణలో అబ్కారీశాఖ పునర్ వ్యవస్థీకరణ

### సీఎం కెసిఆర్ చొరవతోనే సాధ్యమైంది: పర్యాటక ప్రాంతంగా వంగర అభివృద్ధి: శ్రీనివాస్ గౌడ్

హైదరాబాద్,సెప్టెంబర్2(ఆర్ఎన్ఎ): రాష్ట్రంలో పదిహేను సంవత్సరాల తర్వాత తెలంగాణ ఆవిర్భావం అనంతరం ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాల మేరకు ఇంత భారీస్థాయిలో అబ్కారీశాఖ పునర్వ్యవస్థీకరణ జరగడం చారిత్రాత్మకమని ఎక్సైజ్‌శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో సిబ్బంది ప్రమోషన్‌లలో జరిగిన అన్యాయాలను రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లడం వారి ఆదేశాల మేరకు కొత్త పోస్టులను సృష్టించడం జరిగిందన్నారు.

తెలంగాణ ప్రభుత్వం పునర్వ్యవస్థీకరించిన కొత్త జీవోలో సూక్ష్మస్థాయిలో అబ్కారీశాఖ అవసరాలను గుర్తించి వివిధ పోస్టులను సృష్టించడం జరిగింది. ఈపునర్వ్యవస్థీకరణలో ప్రభుత్వ ఆదాయాన్ని అబ్కారీ నేరాలను దృష్టిలో ఉంచుకుని వివిధ స్థాయిలలో పోస్టులను సృష్టించినట్టు మంత్రి తెలిపారు. తెలంగాణ ఏర్పాడిన తర్వాత పలుమార్లు జరిగిన సమీక్షా సమావేశంలో అబ్కారీశాఖ అవసరాలను సీఎం దృష్టికి తీసుకెళ్లినట్టు కూడా ఆయన చెప్పారు. రాష్ట్ర విభజనలో పోస్టుల విభాగ నిష్పత్తి 41.68శాతం కారణంగా తెలంగాణ రాష్ట్రానికి పోస్టులు తక్కువగా కేటాయించబడ్డాయన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో 2005లో అబ్కారీ శాఖ పునర్వ్యవస్థీకరణ జరిగింది. ఆ తర్వాత అవసరాన్నిబట్టి పోస్టులను సృష్టించడం జరిగింది. ఆ సమయంలో కూడా తెలంగాణ ప్రాంతంలో కొత్త పోస్టుల సృష్టికి పెద్దగా ప్రయత్నం జరగలేదని మంత్రి శ్రీనివాస్‌గౌడ్ స్పష్టం చేశారు.

### పర్యాటక ప్రాంతంగా వంగర అభివృద్ధి

మాజీ ప్రధాని పీవీ నరసింహారావు స్వగ్రామం వంగరను రాష్ట్ర ఎక్సైజ్, టూరిజం శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ బుధవారం సందర్శించారు. వంగరలో పీవీ నర్సింహారావు చిత్ర పటానికి మంత్రి పూలమాల వేసి నివాళులు అర్పించారు. పీవీ గృహంలో ఏర్పాటు చేసిన మ్యూజియాన్ని మంత్రి శ్రీనివాస్ గౌడ్ సందర్శించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. వంగరను పర్యాటకంగా అభివృద్ధి చేస్తామని ప్రకటించారు. పీవీ ఉపయోగించిన వస్తువులతో మ్యూజియం ఏర్పాటు చేస్తామన్నారు. మ్యూజియం అభివృద్ధిపై సీఎం కేసీఆర్‌కు నివేదిక అందజేస్తామని తెలిపారు. రాష్ట్రంలోని ప్రతి పౌరుడు మ్యూజియాన్ని సందర్శించేలా అభివృద్ధి చేస్తామన్నారు. పీవీ స్వగ్రామం వంగరను పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దుతామని ఇటీవల సీఎం కేసీఆర్ ప్రకటించిన విషయం తెలిసిందే. అదే విధంగా పీవీ వాడిన వస్తువుల్ని ఇటీవలే పీవీ తనయుడు ప్రభాకర్ రావు ఢిల్లీ నుంచి తెప్పించారు. మంత్రి ఆ వస్తువులని ఆసాంతం ఆసక్తిగా తిలకించారు. మంత్రి వెంట జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు రాష్ట్ర టూరిజం ఎండీ మనోహర్, పీవీ కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## రేషన్ డీలర్లకు కమిషన్ చెల్లింపు

### వాడిన బియ్యం సంచులకు 18 చెల్లింపు

### పౌరసరఫరాల సంస్థ ఛైర్మన్ మారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి

హైదరాబాద్,సెప్టెంబర్2(ఆర్ఎన్ఎ): కోవిడ్ నేపథ్యంలో రేషన్ లబ్దిదారులకు ఉచితంగా బియ్యం పంపిణీ చేసిన రేషన్ డీలర్లకు కమిషన్ చెల్లించామని పౌరసరఫరాల సంస్థ ఛైర్మన్ మారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి ప్రకటించారు.

ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాల మేరకు కిలో బియ్యానికి 70 పైసల చొప్పున కమిషన్ చెల్లిస్తున్నామని శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. జూన్, జూలై నెలల్లో సరఫరా చేసిన బియ్యానికి డీలర్లకు 54.78 కోట్ల కమిషన్‌ను రెండు విడతల్లో చెల్లిస్తున్నట్టు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మొదటి విడతలో జూన్ నెలలో ఉచితంగా పంపిణీ చేసిన 3.25 లక్షల మెట్రిక్‌న్ను బియ్యానికిగాను 22.76 కోట్లు, ఆర్ఓ రిఫండ్ రూ. 4.32 కోట్లు అలాగే ఏప్రిల్, మే నెలకు సంబంధించిన బకాయిలు 8.82 కోట్లు, మొత్తం 35.91 కోట్ల కమిషన్‌ను తక్షణం విడుదల చేస్తున్నట్టు ఆయన తెలిపారు. పారదర్శకత ఉండేలా ఈ కమిషన్‌ను ఆన్‌లైన్ ద్వారా డీలర్ల ఖాతాలో జమ చేస్తామని అన్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి ఏప్రిల్ నుంచి జూలై వరకు దాదాపు 22 కోట్ల కమిషన్ రావాల్సి ఉందన్నారు.

డీలర్ల కమిషన్‌ను వెంటనే విడుదల చేయాలని ఆయన కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశబారు. కేంద్రం నుంచి రావాల్సిన కమిషన్ రాకపోయినా కూడా ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాల మేరకు రేషన్‌డీలర్లకు పూర్తి స్థాయి కమిషన్ చెల్లిస్తున్నామని చెప్పారు. కాగా రాష్ట్రంలో పెద్దయెత్తున ధాన్యం దిగుబడి అవుతుందని, దీనికి అనుగుణంగా ధాన్యాన్ని కొనుగోలుచేయడానికి పౌరసరఫరాలసంస్థకు పెద్దయెత్తున గన్నీబ్యాగులు అవసరమవుతాయని శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. దీన్ని దృష్టిలో పెట్టుకునే బియ్యం పంపిణీచేసిన తర్వాత మిగిలిపోయిన గన్నీసంచులను రేషన్ డీలర్లు తప్పని సరిగా పౌరసరఫరాల సంస్థకే విక్రయించాలని ఆదేశించారు. ప్రతి నెలా దాదాపు 54 లక్షల గన్నీసంచులు డీలర్ల దగ్గర ఉంటాయని, ప్రభుత్వ అవసరాలను గుర్తించి ప్రతి గన్నీ సంచిని సంస్థకు అప్పగించాలన్నారు. లేని పక్షంలో కఠిన చర్యలు తీసుకోవడానికి వెనుకాడమోమని అన్నారు. ఒక గన్నీసంచీ ధర 16 రూపాయలు ఉండగా డీలర్ల విజ్ఞప్తి మేరకు దానిని 18 రూపాయలకు పెంచినట్టు తెలిపారు.

## పవన్ కళ్యాణ్ జన్మదినోత్సవాన మంచి కార్యక్రమం

### ఎర్రగడ్డ చెస్ట్ ఆస్పత్రికి ఆక్సిజన్ సిలిండర్ల వితరణ

హైదరాబాద్,సెప్టెంబర్2(ఆర్ఎన్ఎ): జనసేన అధినేత, హీరో పవన్‌కళ్యాణ్ జన్మదినం సందర్భంగా ఎర్రగడ్డ చెస్ట్ ఆస్పత్రికి గ్రేటర్ జనసేన నేతలు ఆక్సిజన్ సిలిండర్లు పంపిణీ చేశారు. ఆక్సిజన్ సిలిండర్ల పంపిణీ గొప్ప కార్యక్రమని ఆస్పత్రి సూపరింటెండెంట్ కొనియాడారు. ప్రస్తుత పరిస్థితిల్లో ఆస్పత్రికి ఆక్సిజన్ సిలిండర్లు అవసరముందని చెప్పారు. కోవిడ్ తర్వాత కూడా ఆక్సిజన్ సిలిండర్లు ఉపయోగపడతాయని చెప్పుకొచ్చారు. ఆస్తమా రోగులకు ఆక్సిజన్ సిలిండర్లు తరుచూ ఉపయోగపడతాయని తెలిపారు. దీర్ఘకాలం ఉపయోగపడే కార్యాక్రమం చేస్తోన్న గ్రేటర్ జనసేన నాయకులను ఆస్పత్రి సూపరింటెండెంట్ అభినందించారు. చెస్ట్ ఆస్పత్రి తరుపున జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌కు జన్మదిన శుభాకాంక్షలు చెప్పారు. సేవ కార్యక్రమాల్లో పవన్ కళ్యాణెళి తమకు ఆదర్శమని గ్రేటర్ జనసేన అధ్యక్షుడు రాజలింగం తెలిపారు. పేదలకు ఉపయోగపడాలన్న ఉద్దేశంతోనే చెస్ట్ ఆస్పత్రికి 35 ఆక్సిజన్ సిలిండర్లు అందజేసినట్లు పేర్కొన్నారు. గ్రేటర్ పరిధిలో వివిధ ప్రభుత్వాస్పత్రులకు మొత్తం 100 ఆక్సిజన్ సిలిండర్లు అందిస్తున్నామన్నారు. కరోనా సమయంలో హడావుడి లేకుండా జనసేన తరుపున సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఏబీఎన్‌తో జనసేన గ్రేటర్ అధ్యక్షుడు రాజలింగం వెల్లడించారు.

## కరోనా సోకిందని భయపడకండి

### అది మిమ్మల్ని ఏమీ చేయదు

### బాధితులకు మనోధైర్యం కల్పిస్తున్న మంత్రి ఎర్రబెల్లి

హైదరాబాద్,సెప్టెంబర్2(ఆర్ఎన్ఎ): కరోనా సోకిందని భయపడకండి....అది మిమ్మల్నిఏమీ చేయదు...మీకు అండగా నేనున్నా. ధైర్యంగా ఉండండి ...అంటూ పంచాయితీరాజ్‌శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు బాధితులకు మనోధైర్యం కల్పిస్తున్నారు. మీరెట్టి పరిస్థితుల్లో ఆందోళన పడకండి...మరీ సమస్యగా ఉంటే నాకు గానీ, నా సిబ్బందికి కానీ ఫోన్ చేయండి, 24గంటలూ అందుబాటులో ఉంటామని అన్నారు. ఒక వైపు కరోనా బాధితుల స్థితిగతులను తెలుసుకుంటూనే వారికి భరోసా కల్పిస్తున్నారు. అలాగే వారి కుటుంబ సభ్యులకు ధైర్యం చెబుతున్నారు. తన నియోజక వర్గం పాలకుర్తిలోని పాలకుర్తి, కొడకండ్ల, దేవరుప్పల, పెద్దవంగర, తొర్రూరు, రాయపర్తి మండలాల్లోని కరోనా బాధితులు, వారి కుటుంబ సభ్యులు, ప్రజా ప్రతినిధులు, అధికారులతో మంత్రి బుధవారం టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. నియోజ కవర్గం వ్యాప్తంగా ఎంపిపిలు, జెడ్పీటీసీలు, ఆర్డీవోలు, ఎమ్మార్వోలు, సీఐ, ఎస్సైలు, డీఎంహెచ్ఓ, డాక్టర్లను కాన్ఫరెన్స్‌లోకి తీసుకుని మంత్రి వారితో మాట్లాడారు. బాధితుల యోగ క్షేమాలు, తీసుకుంటున్నచర్యలను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా మంత్రి ఎర్రబెల్లి మాట్లాడుతూ కరోనా తీవ్రత తగ్గిందన్నారు. కేసీఆర్, మంత్రులు కేటీఆర్, ఈటల ఆధ్వర్యంలో ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల వల్ల మన రాష్ట్రంలో వైరస్ అదుపులో ఉందన్నారు. ప్రజలు స్వీయనియంత్రణ పాటించడంతో పాటు తప్పనిసరిగా మాస్కులు ధరించడం, సామాజిక దూరం పాటించాలన్నారు. కరోనా వచ్చిన వారు ఆందోళన చెందాల్సిన పనిలేదని, ప్రభుత్వం సాయంగా ఉందని, ఎంజిఎం సహా అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోనూ కరోనా పరీక్షలతో పాటు తగు వైద్య సదుపాయాలు అందుబాటులో ఉన్నాయని మంత్రి తెలిపపారు.

## చైనా సరిహద్దుల్లో మరింత అప్రమత్తం

### భద్రతా బలగాలకు హోంశాఖ ఆదేశాలు

న్యూఢిల్లీ,సెప్టెంబర్2(ఆర్ఎన్ఎ): ఎల్ఏసీ వద్ద టెన్షన్ వాతావరణం నెలకొన్న నేపథ్యంలో భద్రతా దళాలు అప్రమత్తంగా ఉండాలంటూ కేంద్ర హోంశాఖ తాజాగా ఆదేశాలు జారీ చేసింది. ఇండో-చైనా బోర్డర్‌తో పాటు, ఇండియా-నేపాల్, ఇండో-భూటాన్ సరిహద్దుల్లో బలగాలు అన్నీ అలర్ట్‌గా ఉండాలని హోంశాఖ ఆదేశాలు ఇచ్చింది. చైనాతో సరిహద్దు ఉన్న ప్రాంతాల్లో మరింత గస్తీని పెంచాలని ఇండో టిబెట్ బోర్డర్ పోలీస్(ఐటీబీపీ), సహస్త్రా సీమా బల్(ఎస్ఎస్‌బీ)కు ఆదేశాలు జారీ చేసింది. ఉత్తరాఖండ్, అరుణాచల్ ప్రదేశ్, హిమాచల్ ప్రదేశ్, లడఖ్, సిక్కిం సరిహద్దుల్లో జాగ్రత్తగా ఉండాలంటూ ఐటీబీపీ దళాలకు ఆదేశాలు ఇచ్చారు. ఉత్తరాఖండ్‌లోని కాలాపాని జంక్షన్ వద్ద గస్తీ ముమ్మరంగా నిర్వహించాలని ఎస్ఎస్‌బీ, ఐటీబీపీలకు ఆదేశించారు. ఇండో నేపాల్ సరిహద్దుకు ఎస్ఎస్బీ అదనపు బలగాలను పంపించారు. జమ్మూకశ్మీర్, ఢిల్లీలో ఉన్న వారిని సరిహద్దుకు తరలించారు. ఉన్నత స్థాయి సమావేశంలో కేంద్ర హోంశాఖ ఈ నిర్ణయం తీసుకున్నది. ఎల్ఏసీ వెంట పర్వత శ్రేణుల వద్ద ఉన్న దళాలు వెనక్కి రావద్దు అంటూ కూడా ఆదేశాలు ఇచ్చారు. పాన్‌గాంగ్ సో సరస్సు, రీజాంగ్ లా, రేక్విన్ లా, స్పాన్‌గుర్ గాప్ ప్రాంతాల్లో ఆక్రమణకు ప్రయత్నించిన చైనా దళాలను భారతీయ ఆర్మీ అడ్డుకున్నది. ఆగస్టు 29, 30 తేదీల్లో ఈ ఘటన జరిగింది. ఈస్టర్న్ లడఖ్‌లోని పాన్‌గాంగ్ వద్ద ఉన్న కీలక స్థావరాలకు భారత్ ఆయుధాలను తరలించింది.

## ప్రశాంతంగా గణెళిశ్ నిమజ్జనం: సిపి కృతజ్ఞతలు

హైదరాబాద్,సెప్టెంబర్2(ఆర్ఎన్ఎ): గణెళిష్ నిమజ్జనానికి సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు నగర పోలీసు కమిషనర్ అంజనీ కుమార్ పేర్కొన్నారు. గణెళిష్ నిమజ్జనం శాంతి యుతంగా నిర్వహించేందుకు మండపాల నిర్వాహకులు, సిటీ పోలీసులు ఎంతో కష్టపడ్డారు అని ప్రశంసించారు. సామరస్యంగా వేడుకలు జరుపుకోవడం ఎంతో సంతోషించదగ్గ విషయమని సీపీ అన్నారు. ప్రపంచానికి హైదరాబాద్ ఆదర్శంగా నిలిచిందన్నారు.

### చరిత్రలో నేటినిజం

కం॥ "కాంచనపల్లి" కులంబున
కాంచనమై నిలచినట్టి "కనకమ్మ"ను రా
మాంచక రచనలు జేయగ
గాంచిరి జనులెల్ల యుగుల గౌరవ మొప్పన్ !!

( సెప్టెంబర్ 3 కాంచనపల్లి కనకమ్మ జయంతి..)

-రాధశ్రీ

సెల్: 9494481210



## ఒడిశాలో పెరుగుతున్న కరోనా పాజిటివ్ కేసులు

భువనేశ్వర్,సెప్టెంబర్ 2: : ఒడిశాలో కరోనా మహమ్మారి ఉధృతి తగ్గడం లేదు. రోజు రోజుకు పాజిటివ్ కేసుల సంఖ్య పెరుగుతున్నది. రాష్ట్రంలో పాజిటివ్ కేసులు ఇప్పటికే 1.10లక్షలకు చేరువలో ఉన్నాయి. తాజాగా 3,219 కేసులు నిర్ధారణ అయ్యాయని ఒడిశా ఆరోగ్యశాఖ తెలిపింది. సెప్టెంబర్ 1న 3,484 మంది వైరస్ నుంచి కొలుకొని డిశ్చార్జి అయ్యారు. అలాగే వైరస్ ప్రభావంతో కొత్తగా 11 మంది మరణించారు. ప్రస్తుతం రాష్ట్రంలో కేసుల సంఖ్య 1,09,780 ఉండగా.. 80,770 మంది కోలుకున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో 28,443 క్రియాశీల కేసులు ఉండగా, 514 మంది మరణించారు. తాజాగా నమోదైన కేసుల్లో అత్యధికంగా కటక్‌లో 400, బాలంగీర్‌లో అత్యల్పంగా 10 పాజిటివ్ కేసులు నిర్ధారణ అయ్యాయి.

## గుర్తింపు పొందిన స్కూళ్లు టీచర్లకు జీతాలివ్వాలి

### వారు మాత్రమే ట్యూషన్ ఫీజులు వసూలు చేయాలి

### ట్రస్మా ప్రతినిధులతో వినోద్ కుమార్ చర్చలు

హైదరాబాద్,సెప్టెంబర్2(ఆర్ఎన్ఎ): కరోనా నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీ.ఓ 46ప్రకారం మాత్రమే ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రైవేట్ పాఠశాలలు ప్రతి నెల ట్యూషన్ ఫీజును వసూలు చేయాలని రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ బోయినపల్లి వినోద్ కుమార్ స్పష్టం చేశారు. తెలంగాణ రికగ్నైస్డ్ స్కూల్స్ మేనేజ్మెంట్ అసోసియేషన్ ట్రస్మా ప్రతినిధులు బుధవారం అధికారిక నివాసంలో భేటీ అయిన సందర్భంగా వినోద్ కుమార్ ఈ స్పష్టతనిచ్చారు. ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల యాజమాన్యాలు ప్రతి నెల ప్రైవేట్ టీచర్లకు జీతాలు ఇవ్వాలని, అలాగే విద్యార్థుల తల్లిదండ్రులు ప్రతి నెల స్కూళ్లకు ట్యూషన్ ఫీజు చెల్లించి ప్రైవేట్ టీచర్లను కాపాడుకోవాలని వినోద్ కుమార్ సూచించారు. గత ఏప్రిల్ 20న జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో తీసుకున్న నిర్ణయం మేరకు విద్యా శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి చిత్రా రామచంద్రన్ జారీ చేసిన ప్రభుత్వ ఉత్తర్వులు 46 ప్రకారం.. గుర్తింపు పొందిన ప్రైవేట్ స్కూల్స్ ప్రతి నెలా ట్యూషన్ ఫీజు వసూలు చేయొచ్చని ఆయన పేర్కొన్నారు. కొవిడ్ 19 నిబంధనలు పాటిస్తూ ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆన్ లైన్ విద్యాబోధన చేయాలని ఆయన సూచించారు. వినోద్ కుమార్ ను కలిసిన వారిలో ట్రస్మా అధ్యక్షుడు యాదగిరి శేఖర్ రావు, ప్రధాన కార్యదర్శి మధుసూదన్, కోశాధికారి నాగేశ్వరావు, కార్యనిర్వాహక అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, ముఖ్య సలహాదారు ఎన్. నారాయణరెడ్డి, ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు రంగినేని పవన్ రావు, తదితరులు ఉన్నారు.

## భారతీయ శాస్త్రవేత్తలకు 'నాసా' అభినందనలు..

న్యూ ఢిల్లీ, సెప్టెంబర్ 2: దేశ మొట్టమొదటి మల్టీ-వేవ్‌లెంగ్త్ స్పేస్ అబ్జర్వేటరీ 'ఆస్ట్రోసాట్' (యూవీఐటీ)ను ఉపయోగించి పుణెలోని ఇంటర్- యూనివర్సిటీ సెంటర్ ఫర్ ఆస్ట్రానమీ అండ్ ఆస్ట్రోఫిజిక్స్ (ఐయూసీఏఏ) కు చెందిన డాక్టర్ కనక్ సాహా నేతృత్వంలోని బృందం సుదూర గెలాక్సీని కనుగొన్న విషయం తెలిసిందే.

కాగా, భారత ఖగోళ శాస్త్రవేత్తల ఆవిష్కరణకు అమెరికా అంతరిక్ష పరిశోధన సంస్థ 'నాసా' ఫిదా అయ్యింది. ఇండియన్ సైంటిస్టులను అభినందించింది. 'సైన్స్ అనేది ప్రపంచవ్యాప్తంగా అందరి సమష్టి కృషి. ఇలాంటి ఆవిష్కరణలు మనం ఎక్కడినుంచి వచ్చాం. ఎక్కడికి వెళ్తున్నాం. మనం ఒంటరివాళ్లమా.. లేక మనతోపాటు విశ్వంలో ఇంకా ఏమైనా ఉన్నాయా? అనేవి తెలుసుకునేందుకు ఉపయోగపడతాయి.' అని నాసా పబ్లిక్ అఫైర్స్ ఆఫీసర్ ఫెలిసియా చౌ వ్యాఖ్యానించారు. భూమికి 9.3 బిలియన్ కాంతి సంవత్సరాల దూరంలో ఉన్న 'ఏయూడీఎఫ్ఎస్ 01' గెలాక్సీని భారతీయ శాస్త్రవేత్తలు కనుగొన్నారు. ఈ అధ్యయనాన్ని బ్రిటన్ నుంచి వెలువడుతున్న ప్రముఖ అంతర్జాతీయ పత్రిక 'నేచర్ ఆస్ట్రానమీ'లో ప్రచురించారు. భారతదేశం ఆస్ట్రోసాట్ / యూవీఐటీ ఈ ప్రత్యేకమైన ఘనతను సాధించగలిగింది. ఎందుకంటే యూవీఐటీ డిటెక్టర్‌లోని బ్యాక్‌గ్రౌండ్ నాయిస్ అనేది అమెరికా అంతరిక్ష పరిశోధనా సంస్థ నాసాకు చెందిన హబుల్ టెలిస్కోప్‌లో కంటే చాలా చిన్నది. ఈ ఆవిష్కరణ చేసిన భారతదేశపు మొట్టమొదటి అంతరిక్ష అబ్జర్వేటరీ ఆస్ట్రోసాట్‌ను మోడీ ప్రభుత్వ మొదటి పదవీకాలంలో 2015 సెప్టెంబర్ 28 న భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) ప్రారంభించింది. ఇస్రో పూర్తి సహకారంతో ఐయూసీఏఏ మాజీ ఎమెరిటస్ ప్రొఫెసర్ శ్యామ్ టాండన్ నేతృత్వంలోని బృందం దీనిని అభివృద్ధి చేసింది. కాగా, ఈ ఆవిష్కరణ విశ్వం గుట్టు విప్పేందుకు చాలా ఉపయోగపడుతుందని ఐయూసీఏఏ డైరెక్టర్ డాక్టర్ సోమక్ రే చౌదరి పేర్కొన్నారు.



# బాల వికాసం



ప్రసిద్ధ బాలల రచయిత డా॥ వి.ఆర్.శర్మ కలం నుండి జాలువారిన ఈతరం టీనేజ్ పిల్లల ఆధునిక కాల్పనిక నవల 'బాలవర్ధన్'. ప్రతివారం 'నేటినిజం' పాఠకుల కోసం ప్రత్యేకం...

–సంపాదకులు

# బాలవర్ధన్

ఈ తరం టీనేజ్ పిల్లల ఆధునిక కాల్పనిక నవల

(ప్రసిద్ధ జానపద కథ బాలనాగమ్మ కథ స్ఫూర్తితో ఆధునిక సృజన)

2

జానపద ప్రపంచంలో బుర్రకథగా ప్రారంభమై, కథగా మారి తరతరాలుగా మనకు అందివస్తున్న అపూర్వ సాహిత్య, సాంస్కృతిక వారసత్వ సంపద బాలనాగమ్మ కథ. ఇది సుమారు ఎనభై ఏళ్ళ కిందటే సినీమాగా వచ్చింది. ఊరూరా నాటకాలుగా ప్రదర్శింప బడింది. ఇప్పుడు ఆరవ తరగతిలో పాఠ్యాంశంగా ఉంది. ప్రపంచ వ్యాప్తంగా సంచలనం సృష్టించిన పిల్లల సినీమా 'హారిపోటర్'కూ బాలనాగమ్మ కథకూ ఎన్నో దగ్గరి పోలికలు నాకు కనబడ్డాయి.

మారిన కాలమాన పరిస్థితులలో, ఆనాటి ఆకథ ప్రేరణతో ఈనాటి టీనేజీ పిల్లలకోసం నేను కల్పించి రాసిన బాలవర్ధన్ కథ ఇది. అది తల్లి తరం కథ అయితే ఇది నేటి కొడుకు తరం కథ. ఈ కథను నేను మార్చిలో మొదలు పెట్టి, మేలో పూర్తి చేశాను. అందుకే ఈనాటి పరిస్థితులు దీనిలో కనిపిస్తాయి. ఈనాటి పిల్లలకూ, తరువాత పెద్దలకూ నచ్చేలా ఉండడానికీ, సహజత్వానికి దగ్గరగా అనిపించేలా రాయడానికీ ప్రయత్నం చేశాను. ఇది బాగుందనిపిస్తే ఆ గొప్పదనమంతా నా ఈరచనకు ప్రేరణనిచ్చిన మన బాలనాగమ్మ కథది. బాలనాగమ్మ కథను సృష్టించిన ఆ అజ్ఞాత జానపద రచయితలకూ, తరతరాలుగా నిలబెట్టిన జానపద కళాకారులకూ దీన్ని అంకితం చేస్తున్నాను. నా ఈ ప్రయత్నం మీద మీ అమూల్యమైన అభిప్రాయాలను కోరుతున్నాను.

–వి.ఆర్.శర్మ




(గత సంచిక తరువాయి)

"అది సుమారు పందొమ్మిది వందల డెబ్బై అయిదవ సంవత్సరం కావచ్చుననుకుంటా. అప్పటికి సమాజం ఇలాలేదు. ఇన్ని సౌకర్యాలు లేవు. ఈనాటి సెల్‌ఫోన్‌లు, టీవీలు, నెట్‌లు వంటివేవీ ఆరోజుల్లో లేవు.

రోడ్లు, ప్రయాణ సౌకర్యాలు కూడా ఇప్పటిలా లేవు. ఇప్పటి మండలాలు కూడా అప్పుడు లేవు. అప్పుడు సమితులు ఉండేవి. తాలూకాలు ఉండేవి. సమితి పెద్దదైతే అదే తాలూకాగానూ, చిన్న సమితులైతే రెండు కలిపి ఒక తాలూకా గానూ ఉండేవి. ఒక్కో సమితిలో కొన్ని గ్రామాలు ఉండేవి. వాటికి సర్పంచులు ఉండేవారు.

హైదరాబాదుకు సుమారు మూడు వందల కిలోమీటర్ల దూరంలో ఆదిలాబాద్ జిల్లా. ఆ జిల్లాలో దట్టమైన అడవులు ఉంటాయి. ఆ అడవుల మధ్యన చక్రపూర్ అనే ఓ ఊరు ఉంది. నవకమల్ ఆ ఊరికి ఎనిమిదేళ్ళుగా సర్పంచ్‌గా ఉన్నాడు. వరుసగా రెండవసారి కూడా ఆ ఊరికి ఏకగ్రీవంగా సర్పంచుగా ఎన్నుకున్నారు అతడిని అక్కడి జనం. ఆ ఊరి ప్రజలంతా అతడిని తమ పెద్ద దిక్కుగా గౌరవిస్తారు. అతడు అందరికీ తలలో నాలుకలా ఉండేవాడు. ఎవరికి ఏ కష్టం వచ్చినా వెంటనే వచ్చి ఆదుకునేవాడు. ఆకాలంలో ఇంతో అంతో చదువుకున్నవాడు ఆ ప్రాంతంలో అతనొక్కడే.

అతని పూర్వీకులు జాగీరు దారులుగా ఉండేవారు. నాలుగెకరాల భూమిని, తను ఉంటున్న పాతకాలపు భవంతిని మాత్రం ఉంచుకొని తక్కిన భూములను

> "మనుషులకు వచ్చే కలలకూ, వాళ్లకు ఉన్న నమ్మకాలకూ సంబంధం ఉండొచ్చునని కలల గురించి అధ్యయనం చేసిన వాళ్లు చెప్తారు"

ప్రభుత్వానికీ, ప్రజలకూ ఇచ్చేసాడు. జనం అతణ్ణి 'దొరా' అనే పిలిచే వాళ్ళు. అలా పిలవొద్దని అతను వారించేవాడు.

అతని భార్య భువనలక్ష్మి. అందం, అణుకువ ఉన్న అనుకూలవతి. ఆమెకూడా భర్త చేసే సమాజ అభివృద్ధి కార్యక్రమాలకు సహకరించేది. కానీ, పెళ్ళయి నాలుగు సంవత్సరాలు దాటుతున్నా వాళ్ళకు పిల్లలు కాలేదు. పూజలూ, వ్రతాలూ ఎన్నో చేసారు. తీర్థయాత్రలు తిరిగారు. ఆరోజుల్లో వాళ్ళకు అలాంటి విశ్వాసాలు చాలా ఉండేవి.

కానీ చివరికి హైదరాబాద్‌లో బొంబాయి నుంచి వచ్చిన డాక్టర్ జటాంగనాథ్ చేసిన చికిత్సలవల్ల వాళ్ళకు సంతానం కలిగింది. ఒకే కాన్పులో ఇద్దరు ఆడపిల్లలు కవలలు పుట్టారు. వాళ్ళను ఎంతో అపురూపంగా అల్లారు ముద్దుగా ఆ ఇంటి వాళ్ళందరూ పెంచుకోసాగారు .

తాను గర్భవతిగా ఉన్న కాలంలో భువనలక్ష్మికి తరచుగా ఓ కల వచ్చేది. ఆ కలలో తాను మామిడి పళ్ళు కోయడానికి ప్రయత్నిస్తూ ఓ చెట్టుకింద ఉన్న ఓ పుట్ట పైకి ఎక్కేది. దానిలోంచి ఓ పెద్ద నాగుపాము వచ్చి కాటువేయబోయేది. తను భయంతో చేతులు జోడించి క్షమించమని ప్రార్థించేది. "గర్భవతివి గనుక నిన్ను వదిలిపెడుతున్నాను. కానీ నీకు పిల్లలు పుట్టిన తరువాత నిన్ను తప్పక శిక్షిస్తానని" ఆపాము మనిషిలా మాట్లాడుతూ హెచ్చరించేది.

ఈ కల గురించి భువనలక్ష్మి తన భర్తకు చెప్పింది. అతడు 'అదంతా నీలో ఉన్న భయం వల్ల. ఆందోళన వల్ల పడుతున్న కల' అని, 'దాన్ని అంతగా పట్టించుకోవద్దని' చెప్పాడు. ఓ రోజు ఆ కల గురించి విన్న నవకమల్ మిత్రుడు, సైకాలజీ చదువుకున్న డాక్టర్ దయానంద్ 'ఇది సినీమాల ప్రభావం కావచ్చు'అన్నాడు. 'పాములు పగబట్టడాలు వంటివి ఉండవనీ, వాటికి జ్ఞాపకశక్తి చాలా తక్కువ అనీ' చెప్పాడు."చెల్లెమ్మా! నీవు పాముల మహత్యాల కథలు బాగా వింటావా?" అని అడిగాడు. "ఔను.అలాంటి కథలు చాలా ఇష్టం నాకు." అందామె అవును అన్నట్టుగా తల ఊపుతూ.

"అలాంటి మహత్యాలు జరుగుతాయని నమ్ముతావు కదా?"

"తప్పకుండా జరుగుతాయి" పూర్తి నమ్మకంతో చెప్పిందామె.

"మనుషులకు వచ్చే కలలకూ, వాళ్లకు ఉన్న నమ్మకాలకూ సంబంధం ఉండొచ్చునని కలల గురించి అధ్యయనం చేసిన వాళ్లు చెప్తారు" అన్నాడు డాక్టర్ దయానంద్. "పాముల మహత్యాల గురించి ప్రపంచ వ్యాప్తంగా అనేక కథలున్నాయి. ఈ ప్రాంతంలో కూడా బాగా ప్రచారంలో ఉన్న ఓ కథ ఉంది. అది ఇక్కడి వాళ్ళందరికీ చిన్నప్పట్నించే పెద్దవాళ్ళు వినిపించే కథ. ఆ కథ ప్రభావం కూడా ఈ కల రావడానికి కారణమై ఉండొచ్చని నేను ఊహిస్తున్నాను."

"ఏమిటా కథ?" కుతూహలంగా అడిగాడు నవకమల్.

"ఆదిలాబాద్‌కు సుమారు నలభై కిలోమీటర్ల దూరంలో ఈనాటి ఇంద్రవెల్లి మండలంలో ముత్నూర్ దగ్గర కెస్లాపూర్ గ్రామం ఉంది. సుమారు వెయ్యిలోపే జనాభా ఉన్న పల్లెటూరు అది."

"తెలుసు! అక్కడ జనవరి నెలలో పదిహేను రోజుల పాటు "నాగోబా"జాతర జరుగుతుందని తెలుసు. మధ్యప్రదేశ్, ఛత్తీస్‌ఘడ్, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక మొదలైన ఎన్నో ప్రాంతాల నుంచి గోండు గిరిజనులు అక్కడికి వచ్చి, ఆ జాతరలో పాల్గొంటారని తెలుసు" అన్నాడు నవకమల్.

"సర్పజాతిని పూజించే గిరిజనుల అతి పెద్ద జాతర అది. నాగోబా అంటే ఆదిశేషుడని అంటారు"అన్నాడు దయానంద్.

"కానీ... భువనలక్ష్మి కలకూ దానికీ సంబంధం ఏమిటి" అడిగాడు నవకమల్.

"ఉండొచ్చు...అది చిన్నప్పటి నుంచీ భువనలక్ష్మి గారు అనేకసార్లు వినే అవకాశం ఉన్న కథ.

దైవభక్తికి తోడు, అలాంటి మరెన్నో నమ్మకాలతో పెరిగింది తాను. తనకు ప్రెగ్నెంట్‌గా ఉన్న ఈ సమయంలో వస్తున్న ఆ కలకు పునాది ఆ కథ కావడానికి అవకాశం ఉంది."

"ఆ కథ నేను ఎప్పుడో విన్నాను. కానీ ఇప్పుడు సరిగ్గా జ్ఞాపకం లేదు..." చెప్పింది భువనలక్ష్మి.

"కావచ్చు. మనకు గుర్తులేని అనేక విషయాలు మన సబ్‌కాన్షస్‌లో ఉండి, ఇలా కలల రూపంలో రావచ్చు. సరే, ఆ కథ ఇప్పుడోసారి వింటే కలకూ, కథకూ ఉన్న పోలిక అర్థమౌతుంది" అని, "అమ్మా! ఆ కథ నీకు గుర్తున్న విధంగా ఇప్పుడు మాకు చెప్పు!" అంటూ ఆ కథ చెప్పుమన్నట్టు ఆమెవైపు చూశాడు. భువనలక్ష్మి తనకు గుర్తున్న మేరకు ఆ కథను చెప్పడం మొదలు పెట్టింది.

4

"గోండు గిరిజనుల్లో 'మేస్రం' వంశంలో 'నాగాయి మోతి' అనే రాణి ఉండేది. ఆమెకు ఒక రోజు కలలో నాగేంద్రుడు కనిపించి తాను ఆమె బిడ్డగా పుడతానని చెప్పాడు. కొంతకాలానికి ఆమెకు కొడుకు పుట్టాడు. కానీ అతడు పాము రూపంలోనే పుట్టాడు. ఆమె అతణ్ణి జాగ్రత్తగా, భక్తితో, ప్రేమతో పెంచింది. అతడు పెరిగి పెద్దవాడయిన తరువాత తన తమ్ముడి కూతురు గౌరితో పెళ్ళి జరిపించింది. ఒక రోజు గౌరి పాము రూపంలో ఉన్న తన భర్తను బుట్టలో పెట్టుకొని గోదావరి నదికి వెళ్ళింది. అలా వెళ్ళాలని అత్తగారు ఆమెను ఆజ్ఞాపించారు.

గోదావరి నదిలో స్నానం చేస్తున్న తన భార్యను చూసి అతడు నాగుపాము రూపం విడిచిపెట్టి మనిషి రూపంలోకి మారాడు. ఆ గౌరి తన భర్త మనిషి రూపంలోకి మారినందుకు ఎంతో సంతోషించింది. కానీ అతడు ఆమెకు ఓ పరీక్ష పెట్టాడు. "లోకంలో నీకు పేరు ప్రతిష్టలు కావాలా?, లేక సంస్కృతి సంప్రదాయాలు కావాలా?" అని అడిగాడు. ఆమె పేరు ప్రతిష్ఠలనే కోరుకున్నది. అది నచ్చని నాగేంద్రుడు మళ్ళీ పాముగా మారిపోయి కనిపించకుండా వెళ్ళిపోయాడు. అతని కోసం గౌరి ఎంతో వెతికింది. అతను కనిపించకపోవడం వల్ల ఆమె చివరకు దు:ఖంతో గోదావరిలో ప్రాణత్యాగం చేసింది. ఆ నదిలో కలిసి పోయింది.

ఆ నాగేంద్రుడు కేస్లాపూర్ గుట్టల్లోకి వెళ్ళిపోయాడు. అలా వెళ్ళేముందు 'ఇక నుంచి పెళ్ళి అయిన ప్రతి జంటను అక్కడికి తెచ్చి నాగేంద్రుడికి పరిచయం చేయాలని' చెప్పాడు. గిరిజనులు ఆ గుట్ట దగ్గర నాగోబా గుడిని కట్టారు. ఈనాటికీ అక్కడ ప్రతి సంవత్సరం జనవరి నెలలో జాతర జరుగుతుంది" ఆమె కథను చెప్పడం ముగించింది.

" సర్పజాతిని పూజించే గిరిజన ప్రజలు జరుపుకునే గొప్ప జాతర అది. ప్రపంచంలో అతి పెద్ద గిరిజన జాతర అది" అన్నాడు దయానంద్. మళ్ళీ వాళ్ళను సూటిగా చూస్తూ అడిగాడు "నాకు తెలిసి పెళ్ళయిన తరువాత మీరు ఆ ప్రాంతానికి వెళ్ళలేదు...నిజమేనా?"

"నిజమే!..మేమా దేవాలయానికి మా పెళ్ళయిన తరువాత వెళ్ళలేదు. అలాంటి పార్మాలిటీస్ జరిపించడానికి లక్ష్మివాళ్ళ అమ్మానాన్నలు లేరు. మా పెళ్ళి నాటికే ఆమె తల్లిదండ్రులు లేని అనాథగా ఆదిలాబాద్‌లో వాళ్ళ దూరపు బంధువుల ఇంట్లో ఉంది".

"బహుశా ఇలాంటి కథల ప్రభావం, ఆ నమ్మకాల మధ్య పెరిగిన మానసిక స్థితి, ఆ గుడికి వెళ్ళకపోవడం, అందువల్ల ఏమవుతుందో అనే భయం...ఈ కలకు కారణాలు కావచ్చు. వీలయినప్పుడు ఓసారి అక్కడికి వెళ్ళిరండి!" డాక్టర్ దయానంద్ చెప్తుంటే భువనలక్ష్మి మొహం ఆనందంతో వెలిగిపోయింది.

"సరే ఓసారి వెళ్ళొస్తాం!" అని భర్త అంగీకరించడంతో ఆమెకు పట్టరానంత సంతోషం కలిగింది.

కానీ, నాలుగేళ్ళు గడిచినా ఎందుకో నవకమల్ అక్కడికి వెళ్ళే విషయాన్ని పెద్దగా పట్టించు కోలేదు. ఎంత మరచిపోదామన్నా భువనలక్ష్మికి ఆ కల వారంలో రెండు మూడుసార్లు అయినా వచ్చేది. ఆమెకు పిల్లలు పుట్టిన తరువాత క్రమ క్రమంగా ఆ కల రావడం ఆగిపోయింది.

ఆ కవల పిల్లలకు నాగరత్న, నాగమణి అనే పేర్లు పెట్టారు. అత్తారు బత్తెంగా, అల్లారు ముద్దుగా పిల్లలు పెరుగుతున్నారు. వాళ్ళకు నాలుగేళ్ళు నిండాయి. మధ్యలో వాళ్ళ అక్షరాభ్యాసం కూడా బాసరలో జ్ఞాన సరస్వతి గుళ్ళో చేయించారు. ఇద్దరూ ఎంతో అందమైన బొమ్మల్లా కనిపించేవారు. వాళ్ళలో నాగమణి మరింత అందంగా పెద్దపెద్ద కళ్ళతో ఓ పుత్తడి బొమ్మలా ఉండేది.

అది కార్తీక మాసం. ఆడవాళ్ళు తమ పిల్లలూ, భర్తా క్షేమంగా ఉండాలని కార్తీక దీపాలు వెలిగించే మాసం. రేపే కార్తీక పౌర్ణిమ. ఆరోజు సాయంత్రం తన భార్యతో చెప్పాడు నవకమల్ "రేపు పొద్దున మనం కార్తీక వన భోజనాలకు వెళ్తున్నాం... కేస్లాపూర్ నాగోబా దేవాలయానికి."

"నిజామా...!" ఆ మాటలు వినగానే భువనలక్ష్మి ముఖంలో చిన్నపిల్లల్లో కనిపించే సంతోషం, ఆత్రుత కనిపించాయి.

"ఔను...నిజంగా వెళ్తున్నాం! పనివాళ్ళకు చెప్పి వంటకు అవసరమైన సామానులు సర్దమని చెప్పు..." అన్నాడు నవకమల్ ఉజ్వలంగా వెలిగిపోతున్న తన భార్య ముఖాన్ని ఆశ్చర్యంగా చూస్తూ.

"అబ్బా...ఎంత ఆనందంగా ఉందో చెప్పలేను!..."

"నిజమే!..చాలా సంవత్సరాలుగా అడుగుతున్నావు కదా. రేపు తప్పకుండా పోదాం. నువ్వూ, నేనూ, పిల్లలూ. మనతో బాటు దయానంద్, వాడి భార్య గీర్వాణీ, ఇంకా వంట చేయడం కోసం యశోదమ్మనూ, లలితను కూడా తీసుకోని వెళ్దాం...".

ఒకరోజు ముందే కార్తీక చంద్రబింబం ఉదయించినట్టుగా ఆమె ముఖం సంతోషంతో వెలిగిపోయింది. పట్టలేని ఆనందపు కెరటాలు ఉవ్వెత్తున ఎగిసివస్తూ ఆమె హృదయం ఉక్కిరి బిక్కిరి కావడం మొదలు పెట్టింది.

"మరో వారం తరువాత మనం గాంధారి కోటను కూడా చూడ్డానికి పోయొద్దాం. అక్కడ కూడా నీకిష్టమైన ఆదిశేషుడి గుడి ఒకటి ఉంది. ఓ ప్రాచీనమైన గిరిజనుల రాజ కోట కూడా అక్కడ ఉంది.

దాన్ని చూడాలని దయానంద్ అడిగాడు. అటుకూడా వెళ్దాం."

ఒకే నెలలో రెండు నాగేంద్రుల దేవాలయాల సందర్శనం! తన కోరిక తీరబోతున్నది. భువనలక్ష్మి మనస్సు ఓ కళ్ళెం విడిచిన గుర్రంలా మహా ప్రచండమైన వేగంతో పరిగెత్తుతున్నది. ఆ రోజు రాత్రి ఆమెకు నిద్రే పట్టలేదు. ఉదయం అయిదు గంటలకే నిద్రలేచి, తలస్నానం చేసింది. పూలబుట్ట పట్టుకొని పూలు తెంపుకొని రావడానికి పెరట్లోకి వెళ్ళింది. ఆ అలికిడికి నవకమల్ కళ్ళు తెరిచి చూసి, పక్కకు తిరిగి పడుకున్నాడు.

ఉదయం ఆరుగంటలు దాటింది. నవకమల్ పక్కమీంచి లేచాడు. భార్య కోసం చూసాడు. ఆ గదిలో కనిపించలేదు. వెళ్ళి మొహం కడుక్కుని భార్యను పిలిచాడు. కానీ ఆమె జవాబు రాలేదు. కాస్త గట్టిగా మరోసారి పిలిచాడు. అయినా జవాబు లేదు. వంటింట్లోనూ, పూజగదిలోనూ చూసాడు. లేదు. పెరటి దర్వాజ తెరిచే ఉంది. ఇంకా పెరట్లోంచి రాలేదేమో! ఎన్నిపూలు తెంపుతోందో ఏమో! అనుకుంటూ మరోసారి "లక్ష్మి" అని పిలుస్తూ పెరట్లోకి వెళ్ళాడు.

పెరట్లో రకరకాల చెట్లూ, తీగలూ, మొక్కలూ ఉన్నాయి. చాలా పెద్ద పెరడు. సుమారు ఓ ఎకరం ఉంటుందేమో. రకరకాల పళ్ళ చెట్లు మామిడి,

> "గోదావరి నదిలో స్నానం చేస్తున్న తన భార్యను చూసి అతడు నాగుపాము రూపం విడిచిపెట్టి మనిషి రూపంలోకి మారాడు. ఆ గౌరి తన భర్త మనిషి రూపంలోకి మారినందుకు ఎంతో సంతోషించింది"

దానిమ్మ, బాదాం, పనస, నిమ్మ వంటివి ఎన్నో ఉన్నాయి. వేపచెట్లు, ఓ పది కొబ్బరి చెట్లు కనిపిస్తున్నాయి. ఓపక్క కూరగాయల మొక్కలు ఉన్నాయి. మరోపక్క కనకాంబరాలు, మల్లెలు, గన్నేరులు, దాసన్న, సంపంగి, పారిజాతం, బంతి, చామంతి వంటి ఎన్నో పూల మొక్కలున్నాయి. ఎక్కడా భువనలక్ష్మి జాడ కనిపించడం లేదు.

'ఏమైపోయిందబ్బా!' అనుకుంటూ "లక్ష్మి" అని పిలుస్తూ, పారిజాతం చెట్లున్న వైపు నడిచాడు. అక్కడ కనిపించింది భువనలక్ష్మి...అచేతనంగా బోర్లాపడి ఉంది. పూలబుట్ట ఆమెకు కొంత దూరంలో పడి ఉంది. "లక్ష్మి" అని పిలుస్తూ పరిగెత్తుతూ వెళ్ళి, ఆమెను చేతుల్లోకి తీసుకుని తనవైపు తిప్పుకున్నాడు. ఆమె అతని చేతుల్లో అచేతనంగా వేలాడి పోయింది. అతని అరుపులకు ఇంట్లో వాళ్ళందరూ కంగారుపడుతూ అక్కడికి చేరుకున్నారు. ఆమెను అలాగే ఎత్తుకొని తెచ్చి మంచం మీద పడుకోబెట్టారు.

"హార్ట్ ఎటాక్ కావొచ్చు! ప్రాణం పోయి సుమారు గంట దాటి ఉంటుంది" చూసి చెప్పాడు దయానంద్. "పురుగేదో కరిచినట్టుంది." అనిచెప్పుకున్నారు ఆమె శవాన్ని చూసిన ఊరివాళ్ళు...'

"అలా హఠాత్తుగా వెళ్ళిపోయింది మీ అమ్మమ్మ..."చెప్పడం ఆపింది విచారంగా నాగరత్న.



–డా॥వి.ఆర్.శర్మ
సెల్:9177887749

(మిగతా వచ్చేవారం..)

## ప్రతిభకు పట్టం-గురువు

మన పాలిట ఆషాదీపం
భావితరాలకు మార్గం
శక్తిని ధారపోసే శ్రామికుడు
మట్టిమాణిక్యాల కార్మికుడు
బాలల హక్కుల దృక్పథం
విద్యకు స్వేచ్ఛా తోరణం
ప్రతిభకు పట్టాభిషేకం
విజయానికి పాలాభిషేకం
మానవ వనరులకు పదును
నవ్య సూచికలకు మెరుగు
సముద్రాల లోతులకు కొలువు
విశ్వానీతరాలకు అడుగు.
పాఠశాల దుక్కి దున్నే కర్షకుడు
శిష్య సైన్యాన్ని నడిపే భార్గవుడు
జీవిత రాజ్యాంగ ప్రధాత
యువతరపు చైతన్యమూర్తి
ఆవేశాన్ని అణిచే శాంతిపిత
ఆలోచనలను మలిచే భీష్మపిత.
కారుచీకట్లలో వెలుతురు నింపే సూర్యుడు
గల్లీని ఢిల్లీ వైపు నడిపించే నాయకుడు
అక్షర శిఖరం
అజ్ఞాత తిమిరంతో సంహారం
శిష్యులకు శిక్షకుడువిచక్షణకు దీక్షకుడు
మేధస్సుకు పెన్నిధితేజస్సుకు సన్నిధి.
విద్య నేర్పిన జ్యోతిరావు
వివేకం నేర్పిన సావిత్రీపుత్రుడు
నీతికి శాస్త్రంజాతిని నడిపిన సూత్రం
ఉదయమే తప్ప అస్తమయం లేని
సమస్తం గురువు!!



–పులుమద్ది సత్యనారాయణ
9441000537

## గుర్తుండే వాడు !

గురువంటేనే గుర్తుండి పోయే వాడు..
గురువంటే గతం నుండి భవిష్యత్ ఇచ్చే వాడు..
గురువు కొట్టే దెబ్బలన్నీ ఉలి చెక్కుల్లాంటివే..
ఎంత వారలయినా గురువు పెట్టిన భిక్షలే..
ఎంత ఎత్తెదిగినా గురువు పొదిగిన పక్షులే..
రాతి యుగం నుండి రాకెట్ యుగం వరకు..
చరమాంకం వరకు గుర్తుండేదే గురుబోధ..
మరందుకే గురువు సాక్షాత్తూ
పరబ్రహ్మ అయ్యాడు.. !!
చెప్పాలంటే..మంచి చెప్పే ప్రతి మనిషి గురువే !!

–భీమవరపు పురుషోత్తం
9949800253

# బాల సాహిత్య గురు – జక్కాపూర్ దుర్గయ్య సారు



సెప్టెంబర్ మాసం వచ్చిందంటే విద్యా బుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను విద్యార్థులు, గ్రామస్థులు, స్వచ్ఛంద సంస్థలు, ప్రభుత్వం ప్రతి సంవత్సరం సముచిత పద్ధతిలో గౌరవించడం మనం చూస్తూనే ఉన్నాము.నిజానికి ఉపాధ్యాయులకు ఈ పురస్కారములు పెద్దగా సంతోషాన్ని కలిగించవు.తమ విద్యార్థులు విద్యాపరంగా ఉన్నత స్థానం అధిరోహించినపుడు, సమాజంలో మంచి గౌరవ ప్రతిష్టలు పొందుతున్నపుడు మాత్రమే నిజమైన ఉపాధ్యాయులు ఆనందాన్ని వ్యక్తపరుస్తారు.

విద్యార్థుల ఉత్తమ అభ్యసనములో మరియు సత్ప్రవర్తన, నడవడి కలిగియుండడంలో బాల సాహిత్యం పోషిస్తున్న పాత్ర అసాధారణమైనది. విద్యార్థుల సమగ్ర వికాసానికి పాఠ్య అంశాల బోధనతో పాటు వారిలో ఉన్న సృజనాత్మక నైపుణ్యాలను వెలికితీయడానికి వారిలో బాల సాహిత్య అభిరుచిని కలిగిస్తున్న నేటి తరం ఉపాధ్యాయులలో సిద్దిపేట జిల్లా జక్కాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో హిందీ ఉపాధ్యాయులుగా విధులు నిర్వహిస్తున్న భైతి దుర్గయ్య గారు బాల సాహిత్య ప్రోత్సాహం ప్రశంసనీయమైనది.

భైతి దుర్గయ్య ఆ పాఠశాలకు 2015లో పదోన్నతిపై వచ్చారు. విద్యార్థులలో ఉన్న సాహిత్య అభిరుచిని గుర్తించారు. అంతకు ముందు పని చేసిన రాజగోపాల్ పేట ఉన్నత పాఠశాలలో విద్యార్థులను రచయితలుగా మార్చి "అక్షర "అనే బాలల పక్ష పత్రిక ను ఒక సంవత్సరం పాటు నిర్వహించారు. సంపాదకత్వ బాధ్యతలు మినహా మిగతా శీర్షికలు అన్ని విద్యార్థులే నిర్వహించగా, జిల్లాలో పలువురి ప్రశంసలు పొందినది. ఎల్లారెడ్డి పేట ఉన్నత పాఠశాలలో ప్రొజెక్టర్, కంప్యూటర్‌లను ఉపయోగించి " కౌన్ బనేగా కరోడ్ పతి " తరహాలో క్విజ్ కార్యక్రమం నిర్వహించి విద్యార్థులకు చదువు పట్ల ఆసక్తిని పెంచారు. నిత్యము పలు వినూత్నమైన కార్యక్రమాలు రూపొందించి విద్యార్థులలోని సృజనకు తగిన ప్రోత్సాహాన్నీ అందించారు.

ఇప్పుడు జక్కాపూర్ పాఠశాల విద్యార్థుల ప్రశస్తి ని రెండు తెలుగు రాష్ట్రాల హద్దుని దాటించారు. ఈ సంవత్సరం మార్చ్12న ఈ పాఠశాల విద్యార్థులు వ్రాసిన 74 కవితల సంకలనం "మధుర పద్మాలు" పుస్తకమును నేటినిజం సంపాదకులు బైస దేవదాస్ దంపతులతో ఆవిష్కరింప చేశారు. ఇందులోని 53 కవితలు గతంలోనే నేటి నిజం ప్రతివారం బాలవికాసం శీర్షికన ప్రచురించడం విశేషం. 2019 మార్చి లో ఇదే పాఠశాల విద్యార్థులు వ్రాసిన "జక్కాపూర్ బడి పిల్లల కథలు "అనే పుస్తకాన్ని దక్కన్ ల్యాండ్ సంపాదకులు వేదకుమార్ గారిచే ఆవిష్కరించబడింది. ఈ పుస్తకం రెండు తెలుగు రాష్ట్రాలే కాకుండా అమెరికా లో ని ప్రవాస భారతీయుల మెప్పు పొంది,నాలుగు నెలల్లోనే 1000 ప్రతులతో రెండవ ముద్రణ పూర్తి చేసుకుంది. పుస్తకాలు ఉచితంగా ఇచ్చినను చదవని ఈ రోజుల్లో ఈ కథల పుస్తకాల ప్రతులు 1300 కొనుగోలు జరగడం బాల సాహిత్య చరిత్రలో అరుదైన సందర్భంగా చెప్పవచ్చు. మూడవ ముద్రణ ప్రయత్నాలు కరోనా అడ్డంకితో నిలిచిపోయాయి. ఈ రెండు పుస్తకాలకు దుర్గయ్య గారు సంపాదకులై విద్యార్థులలోని సాహిత్యాన్ని తెలుగు లోకానికి పరిచయం చేసారు.

2018 సంవత్సరం మంచి పుస్తకం నిర్వహించిన రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన కథల పోటీలో ఇక్కడి 6గురు విద్యార్థులు 500 రూపాయలు చొప్పున నగదు బహుమతులు గెలుచుకున్నారు.వీరు వ్రాసిన కథలు తీయని పలకరింపు తెలంగాణ బడి పిల్లల కథలు పేరున ప్రచురితమైనది.బాలల దినోత్సవం 2019 సందర్భంగా ఈనాడు హాయ్ బుజ్జి, తెలుగు వెలుగు సంయుక్తంగా నిర్వహించిన వీడియో రికార్డింగ్ సాహిత్య పోటీలో ఈ పాఠశాల విద్యార్థిని శ్రావణి చెప్పిన కథకు రాష్ట్ర స్థాయిలో బహుమతి వచ్చింది.

తెలంగాణ భాషా సాంస్కృతిక సంస్థ పవనకుమార్‌కు సాహిత్యంలో, అభినవ్‌కు చిత్రలేఖనం విభాగాల్లో "బాల తేజ "పురస్కారాలను 2019 మే 16 న రవీంద్ర భారతి లో ప్రదానం చేసింది.ఇవే కాకుండా ఇక్కడి పిల్లలను కవి సమ్మేళనం, సాహిత్య సదస్సులలో పాల్గొనేలా చేశారు. వీరు వ్రాసిన కవితలు,గేయాలు,కథలు పత్రికలలో, వివిధ సంకలనాలలో ప్రచురితమైనవి.

ఇక్కడి విద్యార్థుల సాహిత్య అభిలాష ను గుర్తించిన బాల చెలిమి సంపాదకులు వేదకుమార్ గారు ప్రతినెలా నిర్వహించే " బాల చెలిమి ముచ్చట్లు "కార్యక్రమాన్ని సెప్టెంబర్2019 మాసంలో జక్కాపూర్ పాఠశాల లో నిర్వహించడం వెనుక దుర్గయ్య సర్ యొక్క కఠోర శ్రమ దాగి ఉన్నది.తన బాల సాహిత్య కృషి తన పాఠశాలకే పరిమితం కాకుండా అమెరికా ప్రవాస భారతీయులు డాక్టర్ మొసర్ల మాధవరెడ్డి గారి నేతృత్వంలో "సుగుణ సాహితి సమితి" అనే సంస్థను స్థాపించి బాలల కథల పోటీ, బాల కథకుల ప్రోత్సాహం లాంటి చర్యలతో తన వంతు ప్రయత్నం చేస్తున్నారు.

తన పూర్వ విద్యార్థులు వెల్పులరాజు, జి.అశోక్‌లతో కలిపి 5 సంవత్సరాల క్రితం "అక్షర సేద్యం ఫౌండేషన్ " సంస్థ స్థాపించి ప్రతిభ గల విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు, వివిధ రకాల సాహిత్య పోటీలు నిర్వహించి బహుమతులు ఇవ్వడం,నిరుద్యోగులకు చేయూత లాంటి చిరు కార్యక్రమాలు చేపట్టుతూ సామాజిక సేవలో పాలుపంచుకుంటున్నారు. జనవరి 2020లో పిల్లల కోసం ఫౌండేషన్ తరపున "అక్షర సేద్యం "బాలల సాహిత్య త్రైమాసిక పత్రిక ను ప్రారంభించి బాల సాహిత్యానికి పెద్దపీట వేస్తున్నారు. నిరంతరం బాల సాహిత్య వికాసము కోసం తపించే దుర్గయ్య సర్ గత 14 ఏళ్ళు గా తనదైన శైలిలో పిల్లలను ప్రోత్సహిస్తూనే ఉన్నారు.

భైతి దుర్గయ్య గారు బాల సాహిత్య ప్రోత్సాహకులే కాదు, కవి, కథా రచయిత కూడాను. ఇప్పటివరకు "అక్షర సేద్యం"–కవితా సంపుటి 2014లో, "అలుకు మొలకలు" కవితా సంపుటి 2017లో ప్రచురించబడినవి. వీరు 30 కథలు వ్రాసారు. 40కి పైగా సామాజిక, సాంస్కృతిక, సాహిత్య, సినిమా వ్యాసాలు కూడా వ్రాసారు. 10 బాల సాహిత్య కథలు వ్రాసారు. వీరి రచనలు ప్రముఖ పత్రికలలో మరియు అంతర్జాల పత్రికలలో ప్రచురించబడినవి. వీరు వ్రాసిన కథలు,కవితలు బహుమతులు గెలుచుకున్న సందర్భములు అనేకం ఉన్నాయి.పిలడేల్ఫియా తెలంగాణ అసోసియేషన్ అమెరికా వారి వార్షికోత్సవ పత్రిక "సింగిడి 2019"లో దుర్గయ్య సర్ చేసిన బాల సాహిత్య కృషి ని ప్రస్తావించి ప్రత్యేక కథనాన్ని ప్రచురించినారు.

ఎంత ఎదిగినా ఒదిగినట్లుండే దుర్గయ్య సర్ తను బోధించే హిందీ విషయంలో కూడా విద్యార్థులను హిందీ భాష వైపు ఆకర్షించడానికి ఎన్నో ప్రయత్నాలు చేస్తారు. ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 14న నిర్వహించే "హిందీ దివస్ " విద్యార్థులు మర్చిపోలేని విధంగా కార్యక్రమాన్ని రూపొందిస్తారు.ఒక్క మాటలో చెప్పాలంటే దుర్గయ్య సర్ లాంటి ఉపాధ్యాయులు చాలా అరుదుగా అక్కడక్కడ మాత్రమే ఉంటారు. అలాంటి వారి దగ్గర విద్యనభ్యసించినవారు అదృష్టవంతులు. ఆ అదృష్టవంతులలో నేను కూడా ఒకడిని.ఉపాధ్యాయ దినోత్సవ సందర్భంగా ...



– వేల్పుల రాజు
9701933704

## జ్ఞానతేడు - సర్వేపల్లి

తిరుత్తణి నగరాన జననమొందినవాడు
శ్రీ దేవి చూపునకు నోచుకోనివాడు
వాగ్దేవి వడిలోన ఓల లాడినవాడు
వీరస్వామి,సీతమ్మ ల సుతుడు అతడు
ఎవరు ఎవరయ్య ఇంకెవరు
సర్వేపల్లి రాధాకృష్ణన్...!

అతి బీదరికపు అవస్థలను పడ్డోడు
పస్తులతొ నేస్తాలు పెక్కు చేసినవాడు
నేల శుభ్రంచేసి జోజనం తిన్నోడు
మూర్తీ భూత సమగ్ర విజ్ఞాన
సందీప్త సుకృతి – ఎవరు ఎవరయ్య
ఇంకెవరు సర్వేపల్లి రాధాకృష్ణన్...!

అపార మేధస్సుకు అక్షర సాక్షితడు
ఆచార్య వృత్తికే వన్నె తెచ్చిన వాడు
భారతీయ తత్వశాస్త్ర విజ్ఞాన సాగరుడు
పండితులచే ప్రశంసలు పొందిన
అపర మేధావితడు
భారతావనికి తొలి ఉపరాష్ట్రపతితడు
ఎవరు ఎవరయ్య ఇంకెవరు
సర్వేపల్లి రాధాకృష్ణన్...!

'భారతరత్న" పురస్కార గ్రహితుడు
బ్రిటిష్ విశిష్ట "సర్" బిరుదాంకితుడు
తన జన్మదినాన్ని ఉపాధ్యాయ
దినోత్సవంగా మలిచినవాడు
ధరిత్రి పై చరిత్ర నెలకొల్పిన జ్ఞాన తేడు
ఎవరు ఎవరయ్య ఇంకెవరు
సర్వేపల్లి రాధాకృష్ణన్...!

–ఎ.వెంకటరమణ
సెల్:94417 17212

## అక్షర భాస్కరుడు

పల్లవి:అక్షరాలు దిద్దించే అమ్మేరా గురువంటే
నడకనేర్పి నడతదిద్దె నాన్నేరా గురువంటే
అమ్మ నాన్న తత్త్వము కలబోసిన దైవత్వము
అవనికి వెలుగును పంచే ఆచార్యుడు

చరణం: నీ లోని జ్ఞానికి నిలువెత్తు ఆనవాలు
నీ భవితను రాసేటిచెరిగిపోని చేవ్రాలు
నిన్నుమిన్నగా నిలిపే నిత్య కర్మశీలిరా
నీ రూపము మలిచేటి అపురూప శిల్పిరా

నీకు వెన్నుదన్నుగ నీ వెనకనే నిలుచు
నీతిబోధజేసి మునుముందుకే నడుపు
నిచ్చెనగా నిల్చి తాను నిను లక్ష్యం చేర్చురా
నీ గెలుపే తన గెలుపని నిండుగా తలుచురా

అక్షర వెలుగులు పంచే విద్యా భాస్కరుడు
సాందీపుని వారసుడు సామాజిక వైద్యుడు
జాతి జ్ఞానమూలమురా జగతికే తేజమురా
అందుకే చేయర నువు శిరసువంచి వందనం



–నర్ర అంజన్ రెడ్డి
9948848040

## గురుభ్యోనమః

జన్మ నిచ్చి మనలను లోకానికి
పరిచయం చేసింది అమ్మానాన్నలు
గుండెలో దాచుకుంటూ
వేలు పట్టుకుని తప్పటడుగులు
ముద్దు మాటల మూటల్ని
నేర్పించిన మొదటి గురువులు
బడిలో ఓనమాలు దిద్దించి
అక్షరాల అందమైన తొడుగులతో పరిమళాల అడవులను
దాటిస్తూ
పదాలను, పద్యాలను, పాఠాలతో
ప్రపంచాన్ని పరిచయం చేసి
మనకు మనో నేత్రాన్ని అందించిన
జ్ఞాన ప్రధాతలైన గురువులను
వరుసగా నిలిపి పాదాలకు మొక్కాలి
ఎదిగే మనలో భాషతో పాటు
పురాణాలు,నీతి కథలు,
శాస్త్ర విజ్ఞానాన్ని, పదార్థ రహస్యాలను
విప్పిచెప్పి మనల్ని ప్రయోజకులుగా
తీర్చిన ప్రతి అధ్యాపకుడికి
వినమ్ర ప్రణామాలు చెప్పాలి
మన చుట్టూ ఉండి మనల్ని
తమ అనుభవాలతో లోకాన
మనుషులుగా మలచిన ప్రతి
ఆత్మ బంధువుకు నమస్కరించాలి
నేటి వికృత, విష వ్యాపార సంస్కృతిలో
తమను తాము కాపాడుకుంటూ
నిస్సహాయతలోనూ విలువలను
మనకు చెరగని కవచాలుగా కప్పి
లోకం పద్మవ్యూహంలో
మనల్ని విజయుల్ని చేసి
విశ్వమంతా విస్తరించిన
ఆ గురువులే లేకుంటే మన
నేటి ఉనికిని ఊహించగలమా ?



–డా. కె. దివాకరా చారి
9391018972

## వాన - వరద- వాగు-చెరువు

కాల నియమంతో
కరువుల నివారించే నన్ను
కాలుష్యంతో అకాలం చేస్తిరి.

పల్లపు దారులలో
పరవళ్ళు తొక్కుతూ
సాగరంలో కలిసే
నన్ను అడ్డుకుంటిరి
ఆగమయి పోతిరి

గొలుసుకట్టు చెరువుల
అన్యోన్య బంధం నేను
ఒడ్డున ఉండే జీవుల
జీవామృతాన్ని నేను
చిన్నగచేసి చిదిమేస్తిరి

పెద్ద భవంతులకు
పెరుమాండ్లు కొంత
బతుకు దెరువుకు
పేదవారు కొంత

నా ఇంట్లకస్తిరి
నన్ను బదనాం చేస్తిరి

అందరు కలిసి
అణిచేస్తిరి
పుట్టెడు లోతులో
ఆగమయి పోతిరి
మా జోలికచ్చి
మమ్ముల గిచ్చి
మీరే ఏడ్వబడితిరి



- కొమ్మిడి గోవర్ధన్ రెడ్డి
9701841186

## స్వతంత్ర భారతం.. ఇదే మా శపథం..

వందల ఏళ్లుగా పర పాలనలో..
ఊపిరాడక మనం మగ్గినం..
పడరాని పాట్లెన్నో పడినం..
స్వాతంత్ర్య సముపార్జనకై..
ఇల్లూ వాకిలి వదిలినం..
భార్య బిడ్డల్ని మరచినం..
ఉద్యమాలెన్నో జరిపినం..
ఒకటే లక్ష్యం, ఒకటే గమ్యం..
అంటూ సమైక్యంగ నిలిచినం..
పోరుబాటనే మనం పట్టినం..
వీధులెంట చేయిపట్టి నడిచినం...
ఉప్పెనలా ఉరికురికి కదిలినం..
లాఠీ దెబ్బలెన్నో రుచి చూసినం..
జీవితమంతా జైళ్లలోనే గడిపినం..
తూటాలకు ఎదురొడ్డి నిలిచినం..
ప్రాణాలను తృణప్రాయంగా వదిలినం..
దాస్యశృంఖలాలను తెగ నరికినం..

స్వాతంత్ర్యానంతరం అందరం..
తెగ సంబరపడి పోతున్నం..

ఎవరికివారై విడిపోతున్నం..
ఆదమరచి నిద్రపోతున్నం..
అభివృద్ధిని మరచిపోతున్నం..
కులాల పేరిట, మతాల పేరిట..
కుయుక్తులెన్నో పన్నుతున్నం..
భాషల పేరిట, ప్రాంతం పేరిట..
మారణహోమం సృష్టిస్తున్నం..
శత్రువుతో చేతులు కలిపేస్తున్నం..
దేశాన్ని ముక్కలుజేయ చూస్తున్నం..

మన పెద్దల అమోఘ త్యాగఫలం..
మనకు సిద్ధించిన ఈ స్వాతంత్ర్యం..
పనికి రాదోయి నిర్లక్ష్యం ఏమాత్రం..
అందరిదోయి ఈ స్వతంత్ర భారతం.
మరచిపోయి మనం మన గతం..
కలతలెన్నున్నా మనం కలిసుందామని..
దేశాన్ని శత్రుదుర్భేద్యంగా తీర్చిదిద్దేద్దామని..
చేసేద్దామోయి అందరం కలిసి శపథం..

– వీపూరి శ్రీనివాస్
9849893426

## స్నేహితుడా.. నీకు ప్రణామం

స్నేహితుడా నీకు ప్రణామం!

రెండు దేహాల హృదయాల
పవిత్ర పావన భావన స్నేహం

నేను చదువు రాక బాధపడుతున్నప్పుడు
నేనున్నానంటూ చదువు నేర్పిన వాడవు

ఆరోగ్యం బాగాలేక రోదనే సాగినప్పుడు
నేర్పరితనంతో నన్ను లేపినావు

ఇల్లు కుటుంబ పరిస్థితి బాలేనప్పుడు
ఇంటి పెద్దలా భరోసా ఇచ్చిన వాడవు

ఆటలాడలేక నేనోడిపోయినప్పుడు
ఓటమిని పొంది గెలుపు ఇచ్చిన వాడవు

పాడలేక నాకు పాట ఆగినప్పుడు
పాటలా గొంతులో దూరినావు

జీవితాన ఓడి ఒంటరిగా ఉన్నప్పుడు
వెన్ను తట్టి చేయూతనిచ్చినావు

కులమంటూ మతమంటూ గాబరా పడుతుంటే
కుల మత భేదాలు చెరుపుతావు

పేద ధనిక అనే భేదభావం లేక
స్నేహానికే విలువ ఇచ్చుతావు

మనసులో బాధలు మరింత పెరగగా
సగం బాధను నీవు పంచుకుంటావు

పగటి వేళ సద్ది తెచ్చుకొనప్పుడు
నీ అన్నంలో సగం నాకు పెడతావు

అందుకే...
స్నేహితుడా నీకు ప్రణామం!

*(అంతర్జాతీయ స్నేహితుల దినోత్సవ శుభాకాంక్షలతో)*

–మత్స్యగిరి పారుపల్లి
9000137644

## గుర్తుంచుకోండి

వంశ అంకురం పుట్టిందని
ఆనందానికి అవధులు లేవు,
ముసి ముసి నవ్వుల సవ్వడిలో
ఆనందోత్సవాలు..!

బుడిబుడి అడుగులకు
నడకలు నేర్పి..
చిన్ని చిన్ని పలుకులకు
మాటలు తీర్చి
మా పిల్లలే మా ఆస్తిపాస్తులని,
మేము పడ్డ కష్టాలు
వీరు పడకూడదని ఆలోచిస్తారు..!

కార్పొరేట్ స్కూల్లో చేర్పించి
ఫీజుల భారాన్ని మోస్తూ
ఉన్నత చదువులు చదివించి
ప్రయోజకుల్ని చేస్తారు..!

విదేశాల మోజులో
సంపాదనే సర్వమనే భ్రమలో...

వృద్ధాప్యంలో తల్లిదండ్రులను
కంటికి రెప్పలాగా
చూడవలసిన వయసులో..
బాధ్యతలు మరిచి,
వృద్ధాశ్రమాల పాలు చేస్తున్నారు..!

కాలం మారొచ్చు,ఆస్తులు పెరగొచ్చు
కానీ.. మీరు కూడా మీ పిల్లలకు
తల్లిదండ్రులు అని గుర్తుంచుకోండి!

మీరు చేసిన నిర్వాకమే..
తిరిగి మీకే అంటగట్టుకు వస్తుందని మరువకండి..!!
*(వయో వృద్ధుల దినోత్సవం సందర్భంగా)*



–చాపలమహేందర్
9949864152

## కళ్లు

కనులు మురిపించు కళ్లు
కవిత చిలికించు కళ్లు
నవ్వు లొలికించు కళ్లు
పువ్వులై వికసించు కళ్లు

సిగ్గు లొలికించు కళ్లు
శృంగార మొలికించు కళ్లు
అందాలొలికించు కళ్లు
అల్లరి చేసే గడుసైన కళ్లు

నమిలి మింగేసే కళ్లు
నటియించే చిలిపి కళ్లు
ఒయ్యార మొలికించు కళ్లు
హొయలు కురిపించు కళ్లు

మాటలు నేర్చిన కళ్లు
మదిని నులిమేసే కళ్లు
మనసును దోచేసే కళ్లు
మధువు కురిపించే కళ్లు

ఆత్మీయత చూపించే కళ్లు
ఆనందం కురిపించే కళ్లు
అనురాగం ఒలికించే కళ్లు
అద్భుతం అనిపించే కళ్లు

చీకటిలో వెన్నెలకురిసే కళ్లు
సిగ్గుతో ముడుచుకునే కళ్లు
కళగా కళ కళ లాడే కళ్లు
కలువలా కలకల విరిసే కళ్లు

గుస గుసలు ఆడే కళ్లు
గుబులు పుట్టించే కళ్లు
మంత్రముగ్దుల్ని చేసే కళ్లు
మత్తుమందును జల్లే కళ్లు



–బూర దేవానందం
949499643.

## మానవీయపతాక...!

జన్మ భూమిని మరువద్దు
వినయ సంపద వీడొద్దు
అన్నదమ్ముల బంధనాలు
కలసి ఉండుటేను ముద్దు..!

దేశప్రేమయే ఉషస్సు
మంచిగుణమే యశస్సు
వారసత్వ విలువ పెంచె
క్రమ శిక్షణయే శ్రేయస్సు.. !

పరమత సహనమే వుంచు
తరతమ భేదమే త్రుంచు
"మనీషితనమే" పెంచియు
సమత మమతల మహిపంచు.. !

పెద్దల మాటలే జిలుగు
మంచిచెడ్డల మదిమెలగు
సవ్య మార్గమిలను మేలు
నవ్య జ్ఞానమె దేశ వెలుగు..!



– చింతోజు పద్మావతీ శ్రీనివాస్
8464954860

## కాలుష్య కుంపటి

అప్పనంగా ప్రాణవాయువునే భుజిస్తూ
అలవోకగా విషవాయువులను త్యజించే
పాడుపరిశ్రమల పొగగొట్టాలకు పునాదులు వేస్తున్నా...!

అత్యాశల వినాశనమేనలో విహరిస్తూ
అమృతఆయువునే అంతం చేసుకుంటున్న
వింతమానవ మేధస్సునై జనిస్తున్నా..!!

పురోగతి చీడపురుగు తల్లివేరును విచ్ఛిత్తి చేస్తుంటే
అధోగతి పాలవుతున్న
జనజీవన విధానాలను చూసితరిస్తున్నా..!

తరువుల కాండాలను తమకంతోఖండించి
చల్లని భూగోళాన్ని వెచ్చని భోగిమంటల్లో
వికృతంగా చలికాచుతున్నా..!!

కాలుష్యపు కుంపటిలో కుతకుత ఉడికించి
మసిపూతలు దిద్దుతున్నా..!!

ఎంతైనా నేను విజ్ఞానిని కదా!
అజ్ఞానఆవిష్కరణల అహంభావిని కదా!!

నా తెలివే నన్ను నట్టేటముంచుతుంటే
గొంతెమ్మకోరికే నా గొంతును నులిమేస్తుంటే
సిగ్గుతో తలదించుకుంటున్నా!

ఇకనైనా పచ్చదనపు స్వచ్ఛతను పుడమిమేనుకు
పుత్తడిగా అలంకరిద్దామనుకుంటున్నా..!!



–అయిత అనిత
8985348424

## నిర్లక్ష్యమా ...నీ విలువెంత?

**'నేటికీ సగానికి పైగా ప్రజలు దారిద్ర్య రేఖకు దిగువనే బ్రతుకుతున్నారు'**

అనాదిగా మానవుడు సంఘజీవి ఆశావాది. తన అవసరాలకనుగుణంగా అభివృద్ధి పేరుతో జీవన విధానంలోమార్పు చెందుతున్నాడు.

తన మెదడుకు పదును పెట్టి శాస్త్ర సాంకేతికాలను

జోడించి పుడమిపై గల అన్ని జీవులపై ఆధిపత్యమునుచలాయిస్తున్నాడు. గ్రహాంతరాలపై శోధన సాగిస్తున్నాడు. నిజముగ యిది హర్షించదగ్గ పరిణామమే. పెరుగుతున్న జనాభాకు

తగ్గట్లుగ ఉపాది ఉద్యోగ అవకాశాలు పెంచుకోవడం ఆయా ప్రభుత్వాల మరియు మనందరి సామాజిక బాధ్యత. తదనుగుణంగా

వ్యవసాయిక,పారిశ్రామిక ,ఆటోమొబైల్, శాస్త్ర

సాంకేతిక రంగాలను పరుగులు పెట్టించాల్సిన అవసరముంది. ఆధునిక ప్రపంచీకరణములో

దేశాలమధ్య పోటీ ఉంటూ వస్తు వినిమయమార్పిడి విధిగా జరిగితేనె అభివృద్ధి ఫలాలు నలుమూలలా అందరికి అందుతాయి. నేటికీ సగానికి పైగా ప్రజలు దారిద్ర్య రేఖకు దిగువనే బ్రతుకుతున్నారు.

ఉన్న ఊరిలో ఉద్యోగ ఉపాది కరువై చదివిన చదువుకు తగిన ఫలితం లేక పట్నాలు, యితర రాష్ట్రాలకు ,దేశాలకు వలస వెళ్ళాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నవి. చేసే పని ఏదైనా ఎక్కడైనా పని పట్ల అంకిత భావం పని మీద శ్రద్ధ ఉన్నవారికి ఎవరైనా ఎక్కడైనా నీరాజనాలు పలుకుతారు. అవి కొరవడిన చోటనే ప్రమాదం. చిన్నప్పటినుండి వారు పెరిగిన కుటుంబ వ్యవస్థ,విద్యాభ్యాసం, పరిసరాలు మనిషి జీవన శైలి పై తప్పనిసరిగ ప్రభావితం చూపుతాయి. కుటుంబాలలో తల్లిదండ్రులు తమ పిల్లలను క్రమశిక్షణతొ పెంచాలి. బడికి పంపితేనే బాధ్యత అయిపోయిందనుకోకూడదు. ఈ రోజులల్లో చాలా మందితల్లిదండ్రులు మా పిల్లలను స్కూలుకు పంపుతున్నాము కదా అంతా యాజమాన్యమే చూసుకుంటారు అనే భావనలో కొందరు,తీరిక లేని ఉద్యోగ వ్యాపారాల యాంత్రిక జీవనంతో మరి కొందరు తమ పిల్లలను ఏమాత్రం పట్టించుకోక నిర్లక్ష్యాన్నిచూపుతున్నారు.

పిల్లలకు ఆలన లాలనతో పాటు కనీసావసరాలు తీర్చే బాధ్యత తల్లిదండ్రులమీదున్నది. పిల్లలు చేసే తప్పొప్పులను సరిచేయాలి. మొక్కైవంగనిదే మానైవంగునా. సమాజములోవిద్యార్థి బాధ్యతను,

ధర్మాధర్మాలను ,పనిపట్ల అంకిత భావాన్ని ,కుటుంబములోనే సరిగ్గా నూరి పోయాలి. మహాభారతంలో కుంతీ దేవి పంచపాండవులను బాల్యమునుండే క్రమశిక్షణతో పెంచినతీరును, కళ్లున్న గాంధారి గంతలు కట్టుకొని ధృతరాష్ట్రునికి సైతోడై పుత్రోత్సాహంతో తన కుమారుల అకృత్యాలను ఆపలేక పెంచిన తీరు,అనంతరం ఎంతటి పరిణామాలకు దారి తీసిందో మనందరికి తెలుసు. కావున ఎప్పటికీ కుటుంబమే మనిషికి మొదటి విద్యాలయం. దీనికి సమాంతరముగా విద్యాలయాలల్లో చదువుతో పాటు విద్యార్థి అభిరుచిని బట్టి అతని నైపుణ్యాన్ని బట్టి సంపూర్ణ వికాసాన్ని పెంచే చదువులు కావాలి. ప్రభుత్వాలు విద్యావేత్తల సమన్వయముతో శాస్త్ర సాంకేతికాలను ఉపయోగిస్తూ ఎప్పటికప్పుడూ కాలానుగుణముగా కరిక్యులంలో మార్పులకు శ్రీకారంచుట్టాలి. ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం తెచ్చిన క్రొత్త విద్యావిధానము పెను మార్పులకు నాంది పలుకుందని ఆశిద్దాం. తల్లిదండ్రుల ఇష్టాయిష్టాలను పిల్లలపై బలవంతంగా రుద్దకూడదు. పిల్లల ఆశల ఆశయాలను చెరిపివేయరాదు. నైతిక మానవత,పర్యావరణ శాస్త్ర సాంకేతిక విలువలతో కూడిన విద్యాభ్యాసం పరిపూర్ణంగా జరగాలి .కాలానుగుణంగా విద్యావేత్తలు కరిక్యులంలో మార్పు తేవాలి. అధ్యాపకులు నిరంతర విద్యార్థులై రాజకీయాలకతీతంగా విద్యార్థులను తీర్చిదిద్దాలి .చదువుతో పాటు వినయ విధేయతలు క్రమశిక్షణ ,దేశ భక్తి , పెద్దల పట్ల గౌరవము సామాజిక బాధ్యతను నేర్పించాలి.

అధ్యాపకులు విద్యార్థులు చేసె చిన్న చిన్న తప్పులను వెంటనే సరిదిద్దాలి .లేనిచో అవి పెరిగి పెద్దవై ఎక్కువ నష్టానికి దారితీస్తాయి.

ఈ రెండు వ్యవస్థలు విద్యార్థి జీవిత గమ్యానికి రైలు పట్టాల్లాంటివి. ఏ ఒక్కటి కుంటుపడిన విద్యార్థి గమనానికి అంతరాయం ఏర్పడుతుంది. కుటుంబ వ్యవస్థలోగానీ ,

విద్యాలయాలలో కాని నిర్లక్ష్యపు నీలి నీడలను విద్యార్థులపై పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. తప్పుటడుగులు వేసే పిల్లలపై అడుగడుగున నిరంతరము నిఘావుంచుతూ వారిని సరియైన దిశవైపు నడిపించే బాధ్యత తల్లిదండ్రులపై మరియు ఉపాధ్యాయ వర్గముపై ప్రధానంగా వుంటుంది. ఇక్కడ నిర్లక్ష్యానికి తావిస్తే విద్యార్థి

జీవితం ప్రశ్నార్థకంగా మారి సమాజ శ్రేయస్సుపై గొడ్డలి పెట్టుగా మారి దేశ మనుగడపై పెనుప్రభావము చూపుతుంది. ఆ నిర్లక్ష్య దుష్ఫలిత విలువను వెలకట్టుట ఎవరికీ సాధ్యము కాదు. ఉదాహరణకు క్రమశిక్షణ ,నైతిక విలువలు కొరవడిన ఒక ఇంజనీరు కట్టిన ఒక ప్రాజెక్టు లోపభూయిష్టమైతే దానివలన సమాజానికి ఎంతనష్టమో ఎవరు లెక్కకట్టగలరు. అలాంటి వ్యక్తి ఒక సైనిక అధికారి అయితే దేశానికి కలుగు నష్టం ఎంత? చేతులు కాలిన తరువాత ఆకులు పట్టుకున్న చందంగా దేశీయ జీవనంసాగుతుంది. కనుక చిన్నప్పటినుండే విద్యార్థులకు దేశభక్తి ,నైతిక విలువలు,క్రమశిక్షణ సమాజముపట్ల తన బాధ్యత అలవడేటట్లు తగిన జాగ్రత్తలు తీసుకోవలసిన బాధ్యత మనందరిపై వుంది. అలా కాక నిర్లక్ష్యము చేస్తే దాని వెలకట్టుట ఎవరితరమూ కాదు..

తస్మాత్ :జాగ్రత్త



–నింగిరెడ్డి కాంతారెడ్డి
9440454221

## కాలం మహిమా!!

గతి తప్పిన కాలానికి
ఏమైందో? ఏమో తెలియదు గాని
వెళుతూ వెళుతూ ఒంటరిగ వెళ్ళకుండ
నలుగురిని వెంటేసుకొని వెళుతుంది!

అణ్యంపుణ్యం ఎరగని
సూర్యచంద్రులని కూడా వదలకుండ
కరోనాను అంటించి కనబడకుండా
క్వారన్ టైంకి పంపేసింది!

నిన్నటి వరకు మన మధ్య
నిక్షేపంగా తిరిగిన మనిషినేడు
ఊపిరిని నిలుపుకునేందుకు
ఐ.సి.యు. బెడ్ మీద పడుకొని వేళ్ళ మీద
నిముషాలు లెక్కబెడు తుండు!

దాని బారిన పడి చిక్కి శల్యమైన
సమస్త వాణిజ్యరంగాలు తిరిగి కోలుకోవాలంటే
ఇంకెంత కాలం పడుతుందో ఏమో?
ఇంతవరకు ఎవరికి తెలియడం లేదు?!
బతికున్న వాళ్ళను బట్ట కట్టనియ్యకుండా చేసి
బతుకు మీదనీళ్ళు చల్లుతానంటు
కుండపోత వర్షాన్ని కురిపించి
వరదలువానల్లో ఊర్లను ముంచెత్తుతుంది!
మనిషి బతికినా చచ్చిన అతని మంచి చెడులను
అంచనా వేసేది అంత కాలమే కదా?

అందుకే ఉన్నంత కాలం
కష్టసూఖాలను అనుభవించే
మనిషి కాలానుకనుగునంగా
నడుచుకోవడమే నిజమైన
విజ్ఞానం!!



– జవేరియా
9849931255

## కవిత్వం విశ్వభాష

విశ్వమంతా అక్షరాలు గా మలుచుకున్న కవికీ
పదాలు నక్షత్రాలుగా మెరుస్తాయి
భావాలు పండు వెన్నెలై విరుస్తాయి
పుష్పాలు వాడక పరిమళమై వ్యాప్తిస్తాయి.

అక్షరాలే కవికున్న ఆభరణాలు
పదాలే కవికున్న పదవులు
భావాలే కవికున్న బాంధవ్యాలు
కవితాపుష్పాలే కవికున్న కనకపుసంపద.

సూర్యుడి కాలిగుర్తులు కవికీ
వేలిముద్రలై కాగితం పై మెరుస్తాయి
సముద్రపు ప్రళయపు ఎదఘోష
కవుల భాషలలో తెలుస్తాయి.

ఎన్నెన్ని చావులు ఎన్నెన్ని పుట్టుకలు
ఎందరెందరు కవులు ఎంతెంత కవిత్వం
కవులు పడవలు నావికులు యాత్రికులు
కవిత్వం ఒక సముద్రం.

–ఐ.చిదానందం
8801444335

## లంకెలు

నైపుణ్యానికి పని
పనికి మని
మనికి గౌరవం
గౌరవానికి ప్రతి ష్ఠ
ప్రతష్ఠకు పురస్కారం

–రేడియమ్
9291527757

## సిగరెట్లు & మద్యం

రంగులు రంగులుగా
గాల్లో ఎగురుతుంది
ఒకరోజు నిన్నే గాల్లో ఎగరేస్తుంది.
మత్తు మత్తుగా
తిప్పేస్తుంది
ఒకరోజు లేవలేని మత్తులో పడేస్తుంది.



–కోటం చంద్రశేఖర్
సెల్: 8331043826

## నా కవిత సమాజ చైతన్య గీతిక

సమాజ లోపాలనుసరిచేసి సమాజాన్ని చైతన్యపరిచే చైతన్యగీతికై
మూఢనమ్మకాలను
ఆమడదూరం చేసే మంత్రదండమై సమసమాజ స్థాపనకై నినదించే
'ప్రజా గొంతుక నాకవిత'

అవినీతి అక్రమాలను అంతుచూసే అక్షరాస్త్రమై నీతి నిజాయితీకి
పట్టంకట్టే వజ్రసింహాసనమై అభ్యుదయభావాలను అవనికి అందించే
'విప్లవ జ్యోతి నా కవిత'

ఆత్మీయత అనురాగాలను ధాత్రికి ధారపోసే మరో జననిగా బరువు
బాధ్యతలను గుర్తుచేసి బ్రతుక్కి బంగారు దారి చూపే కన్నతండ్రిగా
సూదూరమవుతున్న బంధాలను కలిపే
'ఆత్మబంధువు నాకవిత'

తెలియని విషయాలను అణ్వేషించి తెలిపే నిత్యాన్వేషిగా
గమనం తెలిక అంధకారం అలిమినప్పుడు లక్ష్యానికి దారి చూపే మార్గదర్శిగా
లోకానికి విజ్ఞానాన్ని అందించే
'బహుముఖ విజ్ఞానబండాగారం నా కవిత'

మనఃకుహురంలో దాగిఉన్న ప్రతిభను వెలికితీసే ఉపాధ్యాయిగా
కులమత అంతరాలు లేని కలల ప్రపంచ
నిర్మాతగా దేశ భక్తిని ప్రజ్వలించి జాతిని ఐక్యం చేసే
'మరో జాతిపిత నా కవిత'



–డి.అమీర్
96424 80702

## దేవుడా..! ఓ దేవుడా...!!

దేవుడా..! ఓ ..దేవుడా..!!
రక్షించు నా దేశాన్ని
కపట వేషదారుల నుండి
కోట్లాది దేవతల సృష్టించి
కోటీశ్వరులైన స్వాములనుండి
రక్షించు దేవుడా రక్షించు..

మానవత్వం లేక మనిషిని
యంత్రంలా మార్చిన ఆధిపత్యం నుండి
పెద్ద మనుషులుగా చెలామణి అవుతున్న
పెద్ద పులులనుండి
మతం,కులం, వర్ణం చూపు
వివక్షతల నుండి
ఆధిపత్యంతో అణగదొక్కుతున్న
ఆదిమానవులనుండి
మానవజాతిని మాయజేయ
మాయోపాయం పన్నే గుంటనక్కల నుండి
సరదాలకై సకల జీవుల
ప్రాణాలు తీసే యమకింకరుల నుండి
ప్రజల సొమ్ముతో జల్సాలు చేసే
గజదొంగల నుండి
దేవుడికి మధ్యవర్తిగా మడికట్టుకొని
స్వేదం చిందక హక్కులు పొందే
పరాన్నబుక్కుల నుండి
యుద్ధంలో సైన్యాన్ని
బలియిచ్చే స్వార్థ పాలకుల నుండి
స్త్రీల చెరిపి శరణు కోరు ఉన్మాదులనుండి
అధికారం కోసం రంగులు మార్చు
ఊసరవెల్లుల నుండి
దేవుడవని ఉంటే నువ్వైనా రక్షించు.



–దుప్పటి.మొగిలి
8466827118

## మానవత్వం లేని మనుగడేల

మనిషిగ జన్మించినంత మాత్రముననె గర్వమేల
మానవత్వమసలు లేని మనుగడ మన జాతికేల ?

కన్నతల్లిదండ్రులన్న కనికరంబు జూపక
వృద్ధాశ్రమమందు జేర్చ హృదయమెలా వచ్చును ?

గురువులను గౌరవించు గుణం లేకపోతె ఎలా ?
గురూ గురూ యనుచు గురువు పదమునకవమానమేల ?

చెల్లిలాంటి ఆడపిల్ల చెంత చేరినంతనే
వక్రబుద్ధి చూపి తనను వంచించుట తగునా ?

తన బాధను చెప్పుటకై తన నేస్తం నీవనుకొని
నీ చెంతకు చేరునపుడు నీకు చిన్న చూపేలా ?

పదవీ విరమణ చేసి పడుతు లేస్తు నిన్ను చేర
పనులు చేసి పెట్టుటకై ప్రతిగ లంచమడుగనేల

కమ్మనైన గుమ్మపాలు కడవల కొలదిస్తున్నా
గోసంతతి మరుగుపడగ గోమాతను చంపనేల ?

నా కులమే గొప్పదని నా మతమే గొప్పదని
మతం, కులం పేర్లు చెప్పి మారణహోమమ్ము యేల?



–బండిరాజుల శంకర్
9948050608

## అర్థవంతం

ఏమీ పట్టదా నీకు
అసలేమీ పట్టించు కోవా!

సూర్యోదయం కు ముందే మేల్కొంటావు...
కెంపుల ఆకాశ సౌందర్యాన్ని చూసావా!
కడిగే గిన్నెలు.. ఉడ్చే కసువు ఇదేగా

తొలి మంచు కురుస్తుంటే ..
ఉల్లి పొర లాంటి ఓణీ కప్పుకున్న
ప్రకృతి కన్య నీ చూసావా..
ఉతికే బట్టలే కన బడతాయి నీకు

తొలి పొద్దులో పచ్చని చెట్లపై చేరిన
పక్షుల కీరవాణి రాగాలు విన్నావా!
కుక్కర్ కూత లే వినపడతాయి కదా!

పెరటి తోటలో విరబూసిన
పూల పరిమళాలు ఏనాడైనా ఆస్వాదించావా!
వంటింట్లో మసాలాలు ఘుమ ఘుమలే పీలుస్తావు

ఆరు బయట చక్కని సమీరాలు వీస్తుంటే
ఆ అనుభూతిని పొందావా ఏనాడైనా!
వంటింట్లో వేడి గాలే తెలుసు నీకు

జామ చెట్టు పై చిలకలు చేరి
తీయని పండ్ల రుచినీ చూస్తూ మైమరచి పోతుంటే....
ఒక కప్పు కాఫీ అయినా తీరికగా తాగావా!

ఎందుకు ఆలోచిస్తావు లే!
ఎంత సేపు అందరి అవసరాలే కావాలి
ఎవరికి ఏం తక్కువ అవుతుందొ అనే చింత..
నీ కోసం పది క్షణాలైనా బ్రతికి చూడు ....

దేవుడిచ్చిన నీ చక్కని మనసును..
అప్పుడప్పుడు సాంత్వన పరుచు..
అప్పుడే న్యాయం చేసినట్లు నీ జన్మకి..
–లక్ష్మి మదన్



–లక్ష్మి మదన్
9959186838

మణిపూసల ప్రక్రియలో..

# చెట్లు

చెట్లే జీవులకు తోడు
చెట్లే జీవులకు గూడు
చరాచర జగత్తులో
చెట్లే జీవులకు కూడు !

చెట్లే లోకుల పర్వము
చెట్లే లోకుల గర్వము
ప్రకృతిమాత చేతులైన
చెట్లే లోకుల సర్వము !

చెట్లే సంరక్షకులు
నిస్వార్థపు సేవకులు
కాలుష్యపు కోరలను
కత్తిరించు సైనికులు !

స్వచ్ఛమైన గాలిని
నవచేతన శక్తిని
చెట్లే ప్రాణులకిచ్చును
పదార్థాల రాశిని !

చీమకైన దోమకైన
విషపూరిత పాముకైన
ఆహారం, ఆధారం
చెట్లే యే నోముకైన !

తల్లి సమం చెట్లురా
ధాన్యం గల పుట్లురా
జీవరాశి బంధాలను
బంధించిన కట్లురా !

మానవులను దానవులను
మహిమాన్విత దేవుళ్ళను
చెట్లే బతికించగలవు
మహిలో సర్వజీవులను !

చిన్న, పెద్ద ఓకమైన
ఏవిధమగు లోకమైన
చెట్లు లేక శోభించదు
దేవతలది నాకమైన !

ఆహారానికి మూలం
ఆధారానికి మూలం
ఔషధాల నిచ్చు చెట్లు
ఆరోగ్యానికి మూలం !

మనిషిని బ్రతికించు చెట్లు
మమతను బ్రతికించు చెట్లు
భూగోళములో దాగిన
మహిమను బ్రతికించు చెట్లు !

మానవులకు అమృతాన్ని
దేవతలకు అమృతాన్ని
చెట్లేరా అందించును
పలురకాల అమృతాన్ని !

ఆకులన్ని చెట్లనుండె
మేకులన్ని చెట్లనుండె
అందమైన జన్మదినపు
కేకులన్ని చెట్లనుండె !

ఆనందము పంచుతాయి
ఆయుష్షును పెంచుతాయి
ప్రజలను, ప్రాణులను చెట్లు
ఆరోగ్యము గుంచుతాయి !

చెక్కలుగా మారుతాయి
పక్కలుగా మారుతాయి
చెట్లన్నీ పెరిగి తరిగి
మొక్కలుగా మారుతాయి !

చెట్ల మధ్య తిరిగినారు
చెట్ల నారగించినారు
యోగులు రుషిమునిగణాలు
చెట్లకింద గడిపినారు !





-వడిచర్ల సత్యం
సెల్ : 7989511543

రాముడికి ధైర్యంబిచ్చె
లక్ష్మణుడికి ప్రాణమిచ్చె
చెట్లే చెలికాంద్ర వలెను
సీతమ్మకు తోడునిచ్చె !

పాండవులను బతికించెను
కౌరవులను వెతికించెను
చెట్లేరా బాల్యములో
శ్రీకృష్ణుని ఆడించెను !

చెట్లే మన తెరువులు
చెట్లే మన చెరువులు
కరువును దూరం జేసే
చెట్లే మన గురువులు !

పంటలన్ని చెట్లవలన
వంటలన్ని చెట్లవలన
జగతిలోన జ్వలించెడి
మంటలన్ని చెట్ల వలన !

చెట్లు కూడ అలుగుతాయి
చెట్లు కూడ నలుగుతాయి
రుతువులమది ప్రేమ పొంది
చెట్లు కూడ పగులుతాయి !

మనం విడిచె పొగలకు
స్వార్థపరులు పగలకు
చెట్లు ఏడ్చి నశించును
విపరీతపు సెగలకు !

యాగమందు నెంచి చూడ
భోగమందు నెంచి చూడ
చెట్లను మించినవి లేవు
త్యాగమందు నెంచి చూడ !

చెట్లు లేకపోతె జగతి
చెందలేదు చూడు ప్రగతి
పచ్చదనం వలన మనకు
కలుగుతుంది సదా సుగతి !

చెట్లు లేక వానలేదు
చెట్లు లేక గాలిలేదు
ప్రాణికోటి కిలపైన
చెట్లు లేక ఏమిలేదు !

అందుకొరకు ప్రతిమనిషి
ముందుకొచ్చి ప్రతిమనిషి
తప్పకుండ మొక్కలను
నాటాలిర ప్రతిమనిషి !

ఈ పర్యావరణము
పాడైతే మరణము
మేలుకొని వేలచెట్లు
పెంచాలి ప్రతిదినము !

ఆకుపచ్చనైన చెట్లు
ప్రగతిశిఖరి కౌను మెట్లు
పెంచకుంటె కలుగుతాయి
మానవాళికి యిక్కట్లు !

మనం బాస చేయుదాం
మంచి కొరకు సాగుదాం
మనిషి కొక్క మొక్క నాటి
మరువకుండ పెంచుదాం !

చిన్ని చిన్ని మొక్కలు
భూమి మీద చుక్కలు
అందాల హరితవనం
తొలగించును చిక్కులు !





# గురుదేవోభవ శతకం

(సెప్టెంబర్ 5 ఉపాధ్యాయ దినోత్సవ సందర్భంగా)



-హెచ్.ఆర్. చంద్రం
సెల్ : 9493248053

అపరిమిత గౌరవ మ్ముపాధ్యాయులన్న
నాకు చిన నాటి నుండి, ఈనాడు గూడ;
కాన , నీశతకము వ్రాయ బూనుకొంటి!
వందనమ్ములు గురుదేవులందరికిని!

గతము నందు వ్రాసితి పెక్కు శతకములను,
ప్రస్తుతము "గురుదేవోభవ శతకము"ను
వెలువరింతును తేటగీతుల రచించి
వందనమ్ములు గురుదేవులందరికిని!

ఉపనిషత్తు వక్కాణించి యుండెనెపుడొ
తల్లిదండ్రులు గురువులు దైవములని;
ఉపనిషద్వాక్యమక్షర సూక్తి కాదె!
వందనమ్ములు గురుదేవులందరికిని!

తల్లిదండ్రుల తరువాతి స్థానమునకు
అర్హులగువారు గురువులే, అందువల్ల
అమ్మ నాన్నల స్మరియించి, అందజేతు
వందనమ్ములు గురుదేవులందరికిని!

చదువులమ్మ సరస్వతి, శారదాంబ,
భారతీదేవి కద తొలి పంతులమ్మ!
మొదట ఆ తల్లికే భక్తి మ్రొక్కు టొప్పు!
వందనమ్ములు గురు దేవులందరికిని!

తల్లి గురువగు, గురువగు తండ్రిగూడ,
పిల్లలకునెల్ల విషయాలు విశద పరచి
బాల్యమున నోర్పుగా నేర్పువారు వారె!
వందనమ్ములు గురుదేవులందరికిని!

గురువులను సంస్మరించుట కొత్త కాదు ,
గురువులకు మ్రొక్కులిడుటయు గొప్పకాదు,
తరతరాలు నేర్పిన సంప్రదాయ మద్ది !
వందనమ్ములు గురుదేవులందరికిని !

అక్షయమ్మగు సంపద అక్షరమ్ము,
దాని నర్థులందరికిని దానమిచ్చు
సద్గురువుల స్తుతించుట చాల లెస్స!
వందనమ్ములు గురుదేవులందరికిని!

నన్ను బడిలోన వేసిరి చిన్ననాట,
గురువుగారి పేరేమిటో గుర్తులేదు;
వారి ఆకారమైన జ్ఞాపకము లేదు!
వందనమ్ములు గురుదేవులందరికిని !

నేను రెండవ తరగతి లోన నున్న
సమయమున' రాజు గారు' మాస్టారు మాకు;
గుర్తు గలదు లీలగ వారి మూర్తి గూడ !
వందనమ్ములు గురుదేవులందరికిని !

తరగతులు మారు క్రమములో గురువరులను
మారిరెందరో, కొందరే వారిలోన
గురుతుగా నుండి రీనాటి వరకు నాకు!
వందనమ్ములు గురుదేవులందరికిని!

గురువు లుందు రెందరొ, అందు కొంతమందె
ఛాత్రులకు జ్ఞప్తి నుందురు శాశ్వతముగ;
తెలుపవచ్చు కారణములందులకు కొన్ని
వందనమ్ములు గురుదేవులందరికిని !

గురువులందు కొందరి పేర్లె గుర్తు గలవు,
మరిచిపోతి నెందరి పేర్లొ,గుర్తు రావు;
జ్ఞాపకము తగ్గె వృద్ధాప్య కారణమున!
వందనమ్ములు గురుదేవులందరికిని!

ఆది ఓనమాల్ దిద్దించినట్టి గురువు,
అవల పాఠాలు నేర్పించినట్టి గురువు,
శాస్త్ర బోధకు లందరు సములె కాన
వందనమ్ములు గురుదేవులందరికిని !

ఎన్ని వృత్తులు లోకాన నున్న గాని,
అతి పవిత్రమైనది ఉపాధ్యాయ వృత్తి;
కొందరికి సాధ్యపడు నట్టి గొప్పవృత్తి!
వందనమ్ములు గురుదేవులందరికిని !

నన్ను బడిలోన వేయకమున్నె, యింట
నాకు 'నేవేవొ' చెప్పె మా నాన్న,గాన
ఆదిగురువుగా మా నాన్ననభినుతింతు!
వందనమ్ములు గురుదేవులందరికిని!

పండితుడు కాకపోయిన పట్టుబట్టి
నాన్న వేసిన నాటి పునాది పైనె
నేను నిలబడగలిగితి నేటికిట్లు!
వందనమ్ములు గురుదేవులందరికిని !

ఈ ప్రపంచమ్మునందున నెవరికైన
తల్లియే తొలి గురువుగా తలచుటొప్పు;
తల్లి తరువాతనే తండ్రి స్థాన మౌను!
వందనమ్ములు గురుదేవులందరికిని !

అక్షరము నేర్పకున్న మా అమ్మ, చదువు
విలువ యెరిగిన ఇల్లాలు, విజ్ఞురాలు;
కాననే నేను చదువుకొన్నాను లెస్స!
వందనమ్ములు గురుదేవులందరికిని!

కడు సమర్థుడౌ ఆచార్యుకడ శ్రమించి
విద్యనభ్యసించిన వాడు వేత్తయగును ;
దొడ్డ చదువు సిద్ధించు సద్గురువు వలన!
వందనమ్ములు గురుదేవులందరికిని !

గురువు పేరు చెప్పిన చాలు కొన్ని యెడల
హెచ్చుగా శిష్యులను గౌరవించుటుండె ;
చెప్ప వలయునా గురువుల గొప్పతనము?
వందనమ్ములు గురుదేవులందరికిని!

చెళ్ళ పిళ్ళ వెంకట శాస్త్రి శిష్యులమని
చెప్పు కొనుటయే ఒకనాడు గొప్పయయ్యె;
గురుల యశము శిష్యులు పంచుకొందురిట్లు!
వందనమ్ములు గురుదేవులందరికిని !

గురువులను మించు శిష్యులు గూడనుందు,
రట్టివారివల్లనె ఉపాధ్యాయ వరుల
పేరు నలు దెసలను వ్యాపించగలదు!
వందనమ్ములు గురుదేవులందరికిని !

గురువు మెప్పు పొందిన శిష్యవరు దదృష్ట
వంతుడనుకొన సందేహ పడగనేల?
గురుకృపావృష్టి అతనిపై కురియు గాదె!
వందనమ్ములు గురుదేవులందరికిని!

గొప్ప గురువుల కడ నేర్చుకొనగ విద్య,
కులము దాచిన శిష్యులు గలరు, కర్ణ-
పరశురాముల కథలోన జరిగె నిదియె!
వందనమ్ములు గురుదేవులందరికిని!

గొప్ప గురువుల ఛాత్రులు కోరుకొనుట,
గురువరులును సచ్ఛాత్రుల కోరుకొనుట
సక్రమమ్ముగ చదువులు సాగు కొరకె !
వందనమ్ములు గురుదేవులందరికిని!
పుత్ర నిర్విశేషమ్ముగా ఛాత్రు నెంచి,
తాము నేర్చిన సర్వ విద్యలను ధార
వోసి, సంతృప్తులౌ గురువులును గలరు !
వందనమ్ములు గురుదేవులందరికిని!

మెచ్చుకొన్న శిష్యునికి తా మేలు గూర్చ
వెరవకుండ నిందకు ఒక గురువు, బొటన
వేలు దక్షిణ గొనె నొక వీరు నుండి !
వందనమ్ములు గురుదేవులందరికిని!

గురుల ఔన్నత్యమును దెల్పు గొప్ప కథలు
చాల కనవచ్చు మన పురాణాలలోన;
ఆదినుండియు గురుడు పూజార్హుడయ్యె!
వందనమ్ములు గురుదేవులందరికిని!

సొంత బిడ్డల మించి శిష్యులనె హెచ్చు
ప్రేమగా జూచి విద్య నేర్పిన గురువులు
కానవచ్చు చుందురు సర్వకాలములను!
వందనమ్ములు గురుదేవులందరికిని!

తనను మించిన వానిగా తనదు శిష్యు
డెదుగ వలెనని గురువు భావించు టుండె,
అట్టి గురుదేవులును నుందు రందునందు!
వందనమ్ములు గురుదేవులందరికిని!

ఉత్తమ గురుని మనసులో నూహ చేసి,
స్వయముగా విద్య నేర్చిన వారు గలరు;
ఏకలవ్యుని వృత్తాంత మిదియ కాదె?
వందనమ్ములు గురుదేవులందరికిని!

పూర్వ గాథల, అవతార పురుషులైన
గురుల సేవించి సద్విద్య గరచినారు;
గురుముఖమున నేర్చిన దౌను గొప్పవిద్య!
వందనమ్ములు గురుదేవులందరికిని!

గొప్పవారి సంతానమున్ గురుకులమున
చేరి శ్రద్ధగా విద్య నార్జించవలసె;
తరతమమ్ములు లేని వా గురుకులములు !
వందనమ్ములు గురుదేవులందరికిని!

ద్రోణుడును ద్రుపదుడు సతీర్థులు, కుచేలు
డాయె కృష్ణుని సహ ఛాత్రు;డంతరాలు
గురుకులమ్ముల మృగ్యమౌ తెరగు దోచు !
వందనమ్ములు గురుదేవులందరికిని!

తాను రాజ కుమారుడేయైన గాని,
గురుని భక్తి శ్రద్ధలతోడ కొలువ వలయు;
శిష్యు దెవ్వడైనను గురుసేవకుండె!
వందనమ్ములు గురుదేవులందరికిని!

వేల యేండ్లనాడే యిట వెలసి యుండె
గురుకులమ్ములు విద్యల 'కుదురు' లగుచు;
కాల గర్భాన నవియెల్ల కలసిపోయె!
వందనమ్ములు గురుదేవులందరికిని!

ఛాత్రులకు అన్నపాన వసతులొసంగి
చదువు చెప్పి రానాటి ఆచార్య వరులు;
నాటి విద్యా విధాన మాలాటి దౌర!
వందనమ్ములు గురుదేవులందరికిని!

కొంతమంది శిష్యులు మందకొడిగ నుందు,
రట్టివారిని గురువెంత నెట్టుచున్న
ఫలితముండ,దవ్వారల ప్రాప్తమదియ!
వందనమ్ములు గురుదేవులందరికిని!

గురువు లందున హెచ్చుతగ్గులు రహించు,
అందరును నొక్క లాగున నుందు రెట్లు ?
చిన్నపాటి లోపమ్ముల నెన్నరాదు !
వందనమ్ములు గురుదేవులందరికిని!

గొప్ప గురువులు లోకాన కొంతమందె,
మంచి గురువులు తరచు కన్పించ గలరు;
తారసిల్లుదు రందందు తగని వారు !
వందనమ్ములు గురుదేవులందరికిని!

మారిపోయె విద్యల పరమార్థమిపుడు,
బ్రతుకు తెరువుకే ఈనాడు చదువు 'కొనుట' ;
గురువు మంచిచెడ్డలు చెప్పు వెరవు లేదు!
వందనమ్ములు గురుదేవులందరికిని

గురువు దేవుడే అని చెప్పుకొనుట నేడు
మనము కొత్తగా కనుగొన్న మాట కాదు;
ఉపనిషద్వాక్యమే చెప్పియుండె నట్లు!
వందనమ్ములు గురుదేవులందరికిని!

ఆధునిక భారతీయుల యందు నెంతొ
ప్రథితుడాయె రాధాకృష్ణపండితుండు;
గురువుగా వారి కీర్తి సుస్థిరము జగతి!
వందనమ్ములు గురుదేవులందరికిని !

కాల వైపరీత్యమున తాత్కాలికముగ
వ్యత్యయములు కొన్నేవొ కన్పడును గాక,
గురువు శిష్యుల బంధ మక్షరము, నిజము !
వందనమ్ములు గురుదేవులందరికిని!

ఉన్నత స్థితి కెగబ్రాకి యున్నగాని,
ఆది నక్షరమ్ములు నేర్పినట్టి గురుని
మరవకుండిన శిష్యులు మహిని గలరు!
వందనమ్ములు గురుదేవులందరికిని

పైకి వచ్చితి తమ దయ వల్ల ననుచు
పూర్వ విద్యార్థి తన పాదములకు మ్రొక్క,
గురువుగారి ఆనంద మంబరము గాదె!
వందనమ్ములు గురుదేవులందరికిని!

తులసి వనములో గంజాయి 'కలుపు'వోలె
గురువు లందు శిష్యుల చెడగొట్టు వారు
కానవచ్చుట దురదృష్టకరము కాదె!
వందనమ్ములు గురుదేవులందరికిని !

బ్రతుకు తెరువుగా తప్పదు భృతిని గొనుట,
ఐన నతి పవిత్ర మ్ముపాధ్యాయ వృత్తి ;
కనము వేరు విద్యాదానమునకు సాటి !
వందనమ్ములు గురుదేవులందరికిని!

దానమిచ్చుకొలది తగ్గు ధనము, విద్య
వృద్ధి చెందుచుండును దానమిచ్చు కొలది;
ఎన్నగా విద్యయె ధనముకన్న మిన్న!
వందనమ్ములు గురుదేవులందరికిని!

అంగడి సరకుగా విద్య నమ్ముచున్న,
పాఠములు చెప్పవలసిన వారు గురులె;
గురులు లేకుండ చదువులు జరుగునెట్లు?
వందనమ్ములు గురుదేవులందరికిని!

తాము సర్కారు బడి ఉపాధ్యాయులయ్యు
బిడ్డల నితర బడులలో పెట్టనేల?
తప్పుగా దీని నన్యులు తలచరొక్కొ?
వందనమ్ములు గురుదేవులందరికిని!

తారసపడిన చురుకువిద్యార్థి తనకు,
తగిన రీతి గురువు వెన్నుతట్టు చుండు ;
గురుని మెప్పు పొందుట గొప్ప వరము కాద?
వందనమ్ములు గురుదేవులందరికిని!

గురువు లెంతటివారైన, కొంతమంది
పప్పుసుద్దలుందురు, వారు బాగుపడరు;
కడుగ పలుమారు బొగ్గు బంగారమౌనె ?
వందనమ్ములు గురుదేవులందరికిని!

మంచి మార్గము గురువు చూపించు గాని,
తోడుగా రాడు చేబట్టి తుదివరకును,
శిష్యుడే పూని గమ్యమ్ము చేరవలయు!
వందనమ్ములు గురుదేవులందరికిని!

గొప్ప గురువుకడ చదువుకొన్న మాత్ర
శిష్యులెల్లరు నభివృద్ధి చెందలేరు;
వ్యక్తిగత సమర్థత ప్రధానాంశ మౌను!
వందనమ్ములు గురుదేవులందరికిని!

చదువుకొన్నారు వందల సంఖ్యలోన
'చెళ్ళపిళ్ళ' పండితులకు శిష్యులగుచు;
అందు కొందరే కద పేరు పొందినారు!
వందనమ్ములు గురుదేవులందరికిని!

గురువు బోధించు తన శక్తి కొలది, శిష్యు
లందరు నొక్కలాగ స్పందించ లేరు;
కాన ఫలితాల తేడాలు కానవచ్చు!
వందనమ్ములు గురుదేవులందరికిని!

విత్తు చవిటి నేలన మొలకెత్త నటులె
మొద్దు విద్యార్థికి గురువుబోధ చేయ
పడిన తాపత్రయమ్ము నిష్ఫలమె యౌను?
వందనమ్ములు గురుదేవులందరికిని!

కొంతమంది విద్యార్థులు గురువుల యెడ
వెకిలిగా చరించుట కద్దు ప్రకట పడగ
వారి సంస్కార హీన ప్రవర్తనమ్ము!
వందనమ్ములు గురుదేవులందరికిని!జె

శిష్యులకు నుండవలయు దేశికుల పట్ల
చనవు గౌరవమ్మును లెస్స చదువు కొనగ;
వెకిలి వేషాలు శిష్యులు వేయరాదు!
వందనమ్ములు గురుదేవులందరికిని!

ఉన్నతమగు పదవులలో నున్నవారు
గురుల చెంత విద్యలు నేర్చుకొన్నవారె;
సద్గురువు శిక్షణమ్మిచ్చు సత్ఫలమ్ము!
వందనమ్ములు గురుదేవులందరికిని!

పాఠ్యములు మాత్రమే చెప్పవలయు నొజ్జ;
ఆంక్షలిడుచుండె యాజమాన్యాలు నేడు;
స్వేచ్ఛ కోల్పోయె గురువు బోధించు వేళ!
వందనమ్ములు గురుదేవులందరికిని!

గురువులకు ఆంక్షలిడి విద్య గరపు మనుట
కాళ్లు గట్టి పర్విడుమన్నకరణి గాదె?
యాజమాన్యాలు వాస్తవా లరయ వలయు!
వందనమ్ములు గురుదేవులందరికిని!

నిత్య విద్యార్థి యై యొజ్జ నేర్చుకొన్న
మంచి విషయాలు పాఠ్యాల మధ్య చేర్చి
తెలుపుచుండిన మేలు శిష్యులకు కలుగు!
వందనమ్ములు గురుదేవులందరికిని!

ఖర్చు పెట్టగలిగిన వారు కార్పొరేటు
బడులలో బిడ్డలను చేర్చవచ్చు, గాని
అచట నుండు వారును ఉపాధ్యాయులె కద!
వందనమ్ములు గురుదేవులందరికిని!

గొప్పవాడైన శిష్యుని గూర్చి గురువు
పదుగురకు చెప్పుకొని తృప్తి పడుట గలదు;
శిష్య వాత్సల్య మట్టిదౌ చెప్పనేల!
వందనమ్ములు గురుదేవులందరికిని!

ఈ ప్రపంచమందు మతము లెన్ని యున్న,
అన్నియు గురువు పూజార్హుడని వచించె ;
గురువు విషయాన ద్వంద్వ వైఖరులు లేవు !
వందనమ్ములు గురుదేవులందరికిని!

ఎప్పుడైనను గురుదేవు లెదురుపడిన
అవ్యవధిగా కరద్వయ మంజలించు;
తరతరాలుగా నిది సంప్రదాయమయ్యె!
వందనమ్ములు గురుదేవులందరికిని!

గురువు స్థానమందుండిన కుర్రవాడు,
చిన్నవాడనుచు నుపేక్ష చేయ తగదు;
గౌరవాదరమ్ముల లోటు కలుగ రాదు!
వందనమ్ములు గురుదేవులందరికిని!

వయసులో చిన్నవారైన, వందనీయు
లగుదు రధ్యాపనము వృత్తియైన వారు,
వయసునకు గాదు వృత్తి కా వందనమ్ము!
వందనమ్ములు గురుదేవులందరికిని!

చదువులీనాడు సంతలో సరకులాయె,
గొప్ప చదువులెల్లను ధనికులకు దక్కు,
బడుగులకు నేడు సర్కారు బడులె దిక్కు!
వందనమ్ములు గురుదేవులందరికిని!

ప్రతిభ గల పేద విద్యార్థులకు గురువులు
సాయపడిన సందర్భాలు చాల గలవు;
' గురు' గుణములున్న గురువు లుండరె జగాన?
వందనమ్ములు గురుదేవులందరికిని!

పాఠములు చెప్పవలసిన వారి చేత
ఇతర పనులేల చేయింతు? రిందువల్ల
ఫలితములు తగ్గు, యోచించ వలయు ప్రభుత!
వందనమ్ములు గురుదేవులందరికిని!

పిల్లలను పోగు చేయ నిల్లిల్లు తిరిగి
బడులు నడపి రుపాధ్యాయవరు లొకపుడు;
వారి వారసు లిపుడు నున్నారు! లేరె?
వందనమ్ములు గురుదేవులందరికిని!

బండ రాతిని చెక్కి శిల్పముగ తీర్చు
శిల్పితో పోల్చవచ్చు దేశికుని; నింక,
శిల్పికన్న హెచ్చనిగూడ చెప్పవచ్చు!
వందనమ్ములు గురుదేవులందరికిని!

మట్టి ముద్దను పాత్రగా మలచునేర్పు
కుమ్మరికినుండు,శిష్యుని గురువునట్లె
తీర్చిదిద్ది లోకమునకందించగలడు!
వందనమ్ములు గురుదేవులందరికిని!

వృత్తి గౌరవమ్మును విస్మరించి గురువు
హీన వర్తనమ్మును బూన హాని కలుగు;
తగదు హీనుడు గురువు బాధ్యత వహింప!
వందనమ్ములు గురుదేవులందరికిని

కలరు విజ్ఞాన సర్వస్వము లనదగిన
జ్ఞాన మూర్తులు గురువులలోన, సంఖ్య
స్వల్పమైన ప్రభావ మనల్ప మౌను!
వందనమ్ములు గురుదేవులందరికిని!

కళలలో, క్రీడలందు శిష్యులకు ప్రతిభ
యున్నచో,వారి తగురీతి ప్రోత్సహించి
పైకి తెచ్చుఉపాధ్యాయవరులు గలరు!
వందనమ్ములు గురుదేవులందరికిని!

గురువునకు నామమును పెట్టు కొంటెతనము
మెప్పుగన దప్పుడిప్పుడింకెప్పుడైన;
కొంటె కోణంగులను మెచ్చుకొనుట తప్పు!
వందనమ్ములు గురుదేవులందరికిని!

బతకలేనివాడే బడిపంతులనుట
పాతకాలపు మాటయౌ, ప్రస్తుతమ్ము
హాయిగా నుందరా ఉపాధ్యాయులెల్ల?
వందనమ్ములు గురుదేవులందరికిని!

ఆస్తిపాస్తులు లేని వారైన గాని,
వచ్చు జీతాలతో గౌరవముగ బ్రతుక
వచ్చు గురువు లీనా,డిది వాస్తవమ్ము!
వందనమ్ములు గురుదేవులందరికిని!

వేరు మార్గము లేక 'ప్రైవేటు' బడుల
జేరిన గురువు లరగొర జీతములను
గొనుచు పడుచుండి రిబ్బందులను, నిజమ్ము!
వందనమ్ములు గురుదేవులందరికిని!

కొడుకు, కూతుళ్ల కాతడు గురువు గాని,
తనకు గా, డైన నతడుపాధ్యాయుడగుట
నెదురుపడిన సమర్పించు నేటికోళ్ళు!
వందనమ్ములు గురుదేవులందరికిని!

ఏళ్లతరబడి విద్య బోధించియున్న,
ఒక్కనాడె పాఠము జెప్పి యూరకున్న,
వారు వీరు గురువులె, వివక్ష యేల?
వందనమ్ములు గురుదేవులందరికిని!

పలువు రుందురు సర్కారు బడుల యందు ,
కొంద రుందురు ప్రైవేటు స్కూళ్ల యందు ;
వందనీయులే గురువులెందెందు నున్న!
వందనమ్ములు గురుదేవులందరికిని!

అధిక సంఖ్యలో విద్యాలయాలలోన
సేవ లందించుచున్నారు స్త్రీలు నేడు ;
వారి ప్రతిభా విశేషాలు ప్రస్తుతములు!
వందనమ్ములు గురుదేవులందరికిని!

పంతులమ్మలు కనరాని పాఠశాల
లరుదుగానుండు నన్నచో నతిశయోక్తి
కాదు,విదుషీమణుల సంఖ్య కరముహెచ్చు!
వందనమ్ములు గురుదేవులందరికిని!

హెచ్చు శాత ముపాధ్యాయ వృత్తి పట్ల
మక్కువను చూపుచున్నారు మహిళ లిపుడు;
అమ్మ 'శారద' తొలి పంతులమ్మ గాద!
వందనమ్ములు గురుదేవులందరికిని!

దంపతుల నిరువురు నుపాధ్యాయ వృత్తి
నుండు టీనాడు కనవచ్చు చుండె తరచు;
ఎదుగుచున్నారు మహిళలు చదువులందు!
వందనమ్ములు గురుదేవులందరికిని!

ఆలుమగలు, పిల్లలు నుపాధ్యాయ వృత్తి
నున్నయట్టి కుటుంబాలు కొన్ని గలవు;
తరచు గాకున్న నిది అసాధ్యమ్ముగాదు!
వందనమ్ములు గురుదేవులందరికిని!

పురుషుడైనను, స్త్రీయైన గురువు గురువె,
గురువులందు లింగ వివక్ష కూడ దెపుడు;
వంద్యులె చదువు చెప్పిన వారెల్ల!
వందనమ్ములు గురుదేవులందరికిని!

చదువులమ్మ సరస్వతి, సకల విద్య
లకు నధిష్ఠాన దేవ,తారాధనీయ
అని తలంతురు సంప్రదాయకులు గాద!
వందనమ్ములు గురుదేవులందరికిని!

విష్ణువే హయగ్రీవుడై వెలసెనంట,
దక్షిణామూర్తి శివు నవతారమంట,
చదువుకై వారి కొలుచు ఆచార ముండె!
వందనమ్ములు గురుదేవులందరికిని!

ఓర్పు నేర్పు గురువులకు నుండవలయు,
తగదు పక్షపాత మ్ముపాధ్యాయులందు;
నిండుగా ప్రేమ వృత్తిపై నుండ దగును!
వందనమ్ములు గురుదేవులందరికిని!

భావి పౌరుల నందించు వారుగాన
బాధ్యతాయుతులై యుండవలయు గురులు;
ఛాత్రు లనుకరింతురు గురు జనుల నడత!
వందనమ్ములు గురుదేవులందరికిని!

చదువుతోపాటు సద్గుణ సంపదయును
శిష్యులకు గురువులె అందజేయవలయు;
దేశికులె ప్రబోధించనౌ దేశభక్తి!
వందనమ్ములు గురుదేవులందరికిని!

శిష్యులకు పాఠ్య విషయాలె చెప్పుచున్న,
దేశికుల బాధ్యతంతతో తీరిపోదు,
ఇంగిత జ్ఞానమును ప్రబోధించ వలయు!
వందనమ్ములు గురుదేవులందరికిని!

దేవుని యునికి నేటికి తేలకుండె,
కలడొ,లేడొ?యెవ్వరు తేల్చగలరు?కాని,
గురువు ప్రత్యక్ష దైవ మెల్లరికి గూడ!
వందనమ్ములు గురుదేవులందరికిని!

గురువులను గౌరవించుట కొత్తకాదు,
స్థానికము కాదు, సత్ సంప్రదాయ మగుచు,
సర్వదా సార్వజనికమై సాగుచుండె!
వందనమ్ములు గురుదేవులందరికిని!

హెచ్చుతగ్గు లుండిన నుండవచ్చు గాక,
ఉత్త మాధమాది వివక్ష యుండరాదు,
శిష్యులు గురువులను విమర్శించ దగదు!
వందనమ్ములు గురుదేవులందరికిని!

బడులు చదువుల తల్లికి గుడులు కావె?
చదువుకొను వార లట భక్త జనులు గారె ?
పాఠ్యబోధకు దర్శక స్వామి గాదె?
వందనమ్ములు గురుదేవులందరికిని!

దీక్షబూని విద్యార్థుల తీర్చిదిద్ది,
దేశపౌరుల గావించు దేశికులను
ప్రోత్సహించి యెల్లరు లబ్ధిపొంద వలయు!
వందనమ్ములు గురుదేవులందరికిని!

జ్ఞాన విజ్ఞాన నిలయాలు, సర్వ కళల
కాకరమ్ములు కావె విద్యాలయాలు?
అందు వర్తించు గురు జన్మ సార్థకమ్ము!
వందనమ్ములు గురుదేవులందరికిని!

కలుగు సందేహములను తక్షణమె గురువు
తీర్చగల్గును,కొన్ని సందేహములను
గురువులే తీర్చజాలుదు, రొరులు తగరు!
వందనమ్ములు గురుదేవులందరికిని!

దారి తప్పిన శిష్యుని తగిన రీతి
మాన్యుడౌ ఉపాధ్యాయుడు మందలించు;
గురువు సన్మార్గ దర్శక వరుడు గాదె!
వందనమ్ములు గురుదేవులందరికిని!

సులభ శైలిలో బోధించగలుగు నేర్పు
పట్టువడ దందరికి, దానివలన హెచ్చు
తగ్గు లగుపించు మరి ఉపాధ్యాయులందు!

మాటకారితనము కొంతమంది సొత్తు,
ఇంపుగా పాఠములను బోధించగలరు;
తగిన గుర్తింపు వారికి దాన దక్కు!
వందనమ్ములు గురుదేవులందరికిని!

కథలవలె పాఠములు చెప్పగలుగు నేర్పు
గల ఉపాధ్యాయులుందు, రాకట్టు కొనుచు
శిష్యులను మంత్రముగ్ధుల జేయగలరు;
వందనమ్ములు గురుదేవులందరికిని!

స్పష్టముగ అక్షరమ్ములు పలుకలేని
వ్యక్తికి తగనిదౌ ఉపాధ్యాయ పదవి
కట్టబెట్ట నేలా? కష్టపెట్ట నేల?
వందనమ్ములు గురుదేవులందరికిని!

మానవ సహజమౌ బలహీనత లెవొ
కానవచ్చును గురువుల లోను, నైన
సబబుగా దల్పలోపాల సరకు గొనుట!
వందనమ్ములు గురుదేవులందరికిని!

గొప్ప గొప్ప సంగతులిందు చెప్పకున్న,
కొన్ని విషయాలు గురువుల గూర్చి గుర్తు
చేసుకొన్నాము శతక విశేషరీతి!
వందనమ్ములు గురుదేవులందరికిని!

అందరికి తెలిసిన విషయములె యైన,
శిష్యులను తీర్చిదిద్దు దేశికుల గూర్చి
చెప్పుకొనవచ్చు పలుమారు, తప్పులేదు!
వందనమ్ములు గురుదేవులందరికిని!

అక్షరజ్ఞాన దాత లైనట్టి పూజ్య
గురువులను జ్ఞాపకము చేసుకొనుట యన్న
పుణ్య కార్య నిర్వహణమై పొల్చుగాదె!
వందనమ్ములు గురుదేవులందరికిని!

గురువులను గూర్చి కొంత వాక్రుచ్చి నాడ,
నూరు పద్యాలు దాటిన కారణమున
తప్పదు ముగించక యిది శతకము గాన!
వందనమ్ములు గురుదేవులందరికిని!

చదువు చెప్పు గురువులపై శతక మొకటి
వ్రాయవలెనన్న కోర్కిఇప్పటిది కాదు,
ఏండ్లు గడచె, నయ్యది తీరె నిప్పుడిట్లు!
వందనమ్ములు గురుదేవులందరికిని!

గతము నందున నెవరైన కవులు 'గురువు'
పేర శతకము వ్రాసియున్నారొ? లేదొ?
నాకు తెలియదు,నే వ్రాసినాడ నిపుడు!
వందనమ్ములు గురుదేవులందరికిని!

శతకమున విస్తరించుట సాధ్యపడదు
గాన, కొంత మాత్రమె చెప్పగల్గితి నిట;
సెలవు గైకొందు నిక, పాఠకులకు స్వస్తి!
వందనమ్ములు గురుదేవులందరికిని!







## వలస

ఆకలి చెట్టుకు పూసిన అడవి మల్లె
ఆఘ్రాణించడానికి తప్ప పనికి రాని పువ్వు
రాలి గాలికి అటు నిటు ఎగిరి పట్నం సందున వాలింది.

అంబరాన్ని తాకే భవన పునాదిని తడిపే చెమట చుక్క
గాలిలో లేచే ఉయ్యాలలో పదుల అంతస్తుకు చేరే ఇటుక.

మారాజుల గిన్నెల, బట్టల, నేల తళతళలని అద్దమని మురిసే
సబ్బు నురగల అరిగి తెల్లబడ్డ గాజుల చేతులు.

సందేళ పిడికెడు బువ్వరాల్చి ఆశల మెట్లెక్కించిన నగరం
దారం తెగి లోయలో పడ్డట్టు
కరోనా కట్టడితో కట్టి పడేసింది.

ఆకలి సుడిగుండంలోచిక్కిన యువజంటలు .....
కడుపునో చంకనో చేరిన రక్త
అనుబంధాలను భుజాన మోస్తూ
ఆధార్ కార్డు అడ్రసువైపు అడుగులేసాయి.

అరిగి తెగిన చెప్పులను
ఆత్మీయులను వీడినట్టు
తనేసిన రహదారులను చమటతో తడుపుతూ సాగిన పయనం.

ఓ బాటసారి!!!!
అలుపెరుగక సూర్యచంద్రుల నీడన........
కొండ చిలువలా మృత్యువు వెంటరాగా.......
తీరంతో పోరాడి ఓడి అలసిన అలలా అడుగెయ్ ......
పల్లెతల్లి పాల రొమ్ములతో ఎదురు చూస్తుంది.



– అద్దంకి తిరుమల వాణిశ్రీ
9949125250

# మనసే మార్గం (కథ)

ఆరోజు సత్యం ఎంతో దిగాలుగా కూర్చున్నాడు. ఏమైంది సత్తన్న చెప్పండి గట్ల ఉన్నావ్..... అంటూ పలకరించాడు శంకర్..... ఏం చెప్పమంటావు శంకరన్న నా జిందగీ మొత్తం లో ఇలా జరుగుతుందని ఎన్నడూ ఊహించలేదు తెలుసా నీకు అన్నాడు సత్యం. అరే ఏమైంది అన్న చెప్పరాదు. గట్ల అంటున్నావ్ అన్నాడు శంకరన్న..

ఇక విను అన్న... జర మంచిగా...

ఎంతో కట్టబడి మా నాయన నాకు ఈ దుకాణం పెట్టించాడు 20 ఏళ్ల క్రితం మా నాయన ఉన్నప్పుడు ఎట్లా గిరాకీ ఉండేదో.. నిన్నటిదాకా అట్లాగే ఉండేది ఈ మధ్యలో కొద్దికొద్దిగా గిరాకీ తగ్గుతుంది నేను మంచి మంచి మోడల్ కొనుక్కో వస్తున్నా.. అయినా గాని నా దుకాణం లోకి రావటం లేదు కస్టమర్లు... కిడ్స్, జెంట్స్ వేర్, లేడీస్ వేర్... అంటూ కొద్దికొద్దిగా స్టాక్ తీసుకొచ్చి పెట్టినా గాని మేము పాటించేది ఖచ్చితమైన నాణ్యత. అతి తక్కువ స్టాకు ఉన్నప్పటికీ నాణ్యమైన ఉత్పత్తులు వినియోగదారులకు అందించాలనే దృఢసంకల్పంతో ఆనాటి నుంచి ఈనాటి వరకూ పని చేయడం జరుగుతుంది. ఆ నమ్మకం మా వినియోగదారుల అందరికీ తెలుసు. కానీ కొత్తదనంతో మా ముందు ఏర్పడిన ఆ దుకాణం చూస్తున్నావుగా ఎంత పెద్దగా ఉందో మరి అంత పెద్ద దుకాణం పడ్డాక నాలాంటి చిన్న షాపు వాళ్ళకి ఎలా గిరాకీ అవుతుంది.. అన్నాడు సత్యం దీనంగా... ఎంతో ఆవేశంగా ఆ ఎదురుగా పడిన షాపింగ్ మాల్ ఓనర్ ని తిడుతూ ప్రతిరోజు అతడిపై ఎన్నో శకునాలు పెడుతున్నారు.. అది విన్న శంకరన్న అరే సత్తన్న ఎందుకు అంత బాధ పడతారు. నీ నిజాయితీ నీ నమ్మకం నిన్ను తప్పక ముందుకు తీసుకు పోతుంది. కస్టమర్లు కొత్తకొత్తలో ఆ మాల్ ఎలా ఉందో చూద్దామని పోతారు లే కొన్ని రోజులు అయితే అన్ని సర్దుకుంటాయి లే అని చెప్పి శంకరన్న అక్కడినుంచి వెళ్లిపోయిండు.

అయినా గాని రోజు సత్యం ఎదురుగా షాపు వాడిని రోజు తిడుతూ ఉంటాడు....మనసులో...

ఓ రోజు సత్యం కు పరిచయం ఉన్న ఒక మంచి గురువు కలుస్తాడు.. అతనికి ఈ విషయం అంతా పూర్తిగా చెప్పారు. ఆ గురువు కూడా చెప్తారు ఎప్పుడు గాని ఎదురు ఉన్న వ్యక్తిని కీడు కోరుకోకూడదు. నీకు మనుగడ ఉండాలంటే మంచి జరగాలన్నా అతని మనసుతో ప్రేమించు అన్నీ ముందుకు వస్తాయి.. మంచి జరుగుతుందని సర్దుకు పోతాయి. నీ నమ్మకం మీ నిజాయితీకి నిన్ను నిలబడుతుంది. అని చెప్తాడు గురూజీ... దానికి ఓపికగా విని బుద్ధి గా తన పని తాను చేసుకుంటూ దుకాణం కు వెళ్లి ఉంటాడు.

కొన్ని రోజులు గడిచాయి.. ఓ నాలుగైదు నెలలు గడిచిపోతాయి.. ఓ రోజు ఆ ఎదురుగా ఉన్న షాపింగ్ మాల్ అతను దేవేందర్ సత్యాన్ని పిలిపించుకొని ఎంతో ప్రేమగా ఆప్యాయతగా మాట్లాడుతారు.

చూడు సత్తన్న నీవు నిజంగా చాలా గొప్ప మనిషివి మంచి హస్తవాసి ఉన్న మనిషివి ఎందుకంటే నేను ఇలాంటివి షాపింగ్ మాల్లు వేరే ఊళ్ళలో ఐదు ఉన్నాయి ఎక్కడ గాని నేను షాపింగ్ మాల్ పెట్టగానే రెండు నెలల్లో ఎదురు గా ఉన్న దుకాణాలు మూత పడిపోతాయి. నా ఎదురుగా ఉన్న చిన్న చిన్న దుకాణాలు కానీ మీ ఊర్లో ఇక్కడ నాకు ఒక విచిత్రం ఎదురైంది. ఆరు నెలలు గడిచినా గాని నీ దుకాణం నా షాపింగ్ మాల్ ముందు ఇంకా స్థిరంగా ఉందంటే దానికి కారణం నీ యొక్క నైపుణ్యత అని నాకు తెలిసింది... నీకు నా అభివందనం సత్తన్న.... నీవు ఈ షాపింగ్ మాల్ లో నాతో పాటుగా భాగస్వామ్యం ఉండు... అందుకు సరే అన్నాడు సత్యం. ఎంతో సంతోషంగా షాపింగ్ మాల్ యజమాని దేవేందర్ సత్యం లు కలిసి పెద్ద ఎత్తున వ్యాపారం చేస్తూ షాపింగ్ మాల్ ని విజయ పథంలో ముందుకు తీసుకు పోతారు. అత్యధిక లాభాలు గడించి సంవత్సరం తిరిగే లోపే అదే ఊరిలో 3 మరో కొత్త షాపింగ్ మాల్ లను ఏర్పాటు చేస్తారు.. ఇంకా చుట్టుపక్కల ఉన్న పట్టణాల్లో మరికొన్ని షాపింగ్మాల్ లను ఏర్పాటు చేసి ఒక పెద్ద సంస్థగా రూపుదిద్దుకుంటాయి.. ఇట్టి విజయానికి కారణం ఆ ఇద్దరి శ్రమ ఫలితమే.. విజయ రహస్యం.. ఆ ఇద్దరు అన్నదమ్ములు వలే.. .. అందర్నీ ఆకర్షించి ఆదర్శం గా పనిచేస్తారు..

కొద్ది రోజులు గడిచిన తర్వాత ఇద్దరికీ దూరపు బాధ్యతలు ఎక్కువై ప్రేమగా దుకాణాలను పంచుకుంటారు.. అప్పుడు ఆ ఊర్లో ఉన్న సత్యం భాగస్వామ్యం గా ఉన్న ఆ ఒక్క షాపింగ్ మాల్ తో పాటు మిగతా మూడు షాపింగ్ మాల్లు అన్నీ కూడా సత్యం కు అప్పజెప్పి మిగతా వేరే ఊర్లో ఉన్న షాపింగ్ మాల్ లు అన్ని దేవేందర్ తీసుకుంటాడు.. ఇద్దరూ ఎంతో ఆనందంగా విడిపోయి అందరికీ ఆదర్శంగా నిలిచిపోతారు.

మళ్లీ శంకర్ షాపింగ్ మాల్ లోకి వస్తారు.. ఏం సత్తన్న నేను చెప్తే విన్నావా... మంచి వారికి ఎప్పుడూ మంచే జరుగుతుంది.. అన్నాడు.. శంకరన్న ఒకసారి మల్లోసారి ఆ మాట చెప్పు..అన్నాడు సత్తెన్న... అరే విను సత్తన్న...

మంచి మనుషులకు దేవుడు ఎప్పుడూ మంచే చేస్తాడు... అన్నాడు శంకరన్న



–చిటికెన కిరణ్ కుమార్,
9490 84 1284

## యోగా- మొగ్గలు

వేల ఏళ్లనాడే మన పూర్వీకులు
అద్భుత ఆరోగ్య రహస్యాలనందించారు
శోధించి సాధించిన ఆరోగ్యప్రదాయిని యోగ.

కాలాలకతీతంగా రోజుకో అరగంటైన
ఆసనాలు చేసేవారికి ప్రాణవాయువునిస్తుంది
మనసుకు ఉల్లాసమిచ్చే సంజీవని యోగ.

పైసాఖర్చు లేకుండా ఆయువును పెంచి
ఆరోగ్యానందానికి పరమౌషధమవుతుంది
సర్వేంద్రియాలకు తేజంబునిచ్చేది యోగ.

రోగనిరోధకశక్తి పెంచే దివ్యౌషధమవుతూ
రోగాలు నిలువరించే సంజీవినవుతుంది
మానసికవికాసానికి జీవితభీమా యోగా.

కరోనా విషమకాలంలో భయభీతులణచి
నిత్యసంతోషాలను చిగురింపజేస్తుంది
అనారోగ్యాన్ని తరిమేసి మనోబలాన్నిచ్చేది యోగ.



– నింగిరెడ్డి కాంతారెడ్డి
9440454221

## ఈ నర ఆవాసాలకు ఏమైంది !

ఇంతకు ఈ మహానగరాలకు ఏమైంది ?
పచ్చటి పల్లెలకు ఏ దయ్యం పట్టింది ?
కరోనా భూతం కోరల్లో విశ్వం విలవిలలా !
నర ఆవాసాలపై వైరస్ వైరి దండయాత్రలా !

భాగ్యనగరమంతా బోరున విలపిస్తోంది
ఓరుగల్లు వెన్ను గజగజ వణుకుతోంది
కంటేన్‌మెంట్లో కరీంనగర్ బంధీ అయ్యింది
అమాయక పల్లెలు అదిరి బెదురుతున్నాయి !

దవాఖానాల నిండా రోగులు, రోధనలే
శ్మశానంలో ఆరడుగులైనా దొరక్క తిప్పలు
రోడ్ల వెంట అనాధలైన మృతదేహాలు
కుక్కచావు కన్న కడుధీన కోవిడ్ మరణాలు !

నగరపల్లెల ముక్కుమూతులకు మాస్కులే
నర చేతులు ఆల్కహాల్ తాకి తూలుతుండే
కరోనా కమ్మిన సుడిగాలిలో మానవ దీపాలు
ఎప్పుడు ఆరునో తెలియని పంచప్రాణాలు !

మనిషిని మనిషే నమ్మని కరోనా కమ్మిన రోజులు
విముక్తికి మార్గం దొరకని నిస్సహాయ మనుషులు
కరోనా అకాలమే కురిపించాలి కరుణాకటాక్షాలు
కళ్లు తెరవాలి నరుని నడవంత్రపు పోకడలు !

భయాన్ని వీడి ధైర్యాన్ని ఒల్లంతా పూసుకొని..
ఆలోచన రంగరించి ఆచరణకు సానబెట్టి..
కనిపించని కరోనాపై కళ్లు తెరిచి కత్తి దూసి..
కోవిడ్‌ను ఏకాకిని చేసి కోరలు పీకి పిప్పిచేద్దాం !



– డా: బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

## భయమేది

కరోనా ఊర్లకు రాకముందు
కంచలేసి కావలి గాసినమ్
కాలు కూడ బయట పెట్టద్దని
రాతలు రాసి గీత గీసినమ్
పయణం బందుజేసి లగ్గాలను
మూర్తాలను సైతం ఆపేసినమ్
ఓల్లకు ఏమ్ నొచ్చినా పట్టనట్లు
దవఖనా మొకం సూడలేమ్
కడుపుకు కలోగంజో తాగి
ఎటెల్లక ఇంటికాడనే ఉన్నామ్
పాణం మీద పట్టితో మనమంతా
పక్కింటోల్ల కడప తొక్కలేమ్
గా రోగం ఒకరిద్దరికి అచ్చినా
భయపడుకుంటనే బతికినమ్
అది గిప్పుడు సావు చిందులేసిన
ఎరుత్తలేమ్ గింతన్నా జంకుతలేమ్
మూతికి బట్టలేదు దూరంగా ఉంటలేమ్
భయమే లేకుంట బజార్ల పొంటి
యాడంటాడ ఎగవడి తిరుగుతున్నమ్.



–పోలీస్ భీమేశ్
9505255218

## నగ్న సత్యం

ఎడతెగని కథల్ని, ఎదలోని వెతల్ని రాసేదెన్నాళ్లని
కలం కదలనంటుంది....గళం మూగదౌతుంది.

అడుగుల గాయాలకు , అలసిన పాదాలకు
అక్షరాలే లేపనంగా ఆవేదన తీర్చాలని,
అమ్మ ప్రేమై పటుశక్తినివ్వాలని,
పదాలతో పాదాలకు పాదుకలల్లి
పారే నెత్తుటి ధారను కలంలో నింపుకున్న.

అందుకే నా కలం రుధిర ధారనే పారిస్తుంది.
ప్రవాహంలో వేగంగా వలసలు సాగాలని,
వాక్యాల వారధి కట్టి, సొంతూర్లకు చేర్చాలని,
తహ తహలాడిన మనసు తలో ముద్ద పెట్టినా
తాపం తీరేనా , తల్లి తండ్లాట తలపుల్లో పోయెనా

ఓ.. తొలిచూలు తల్లికి తోడుగా
తెరచాటైన నలుగురు ప్రసవవేదనల్ని
పక్కకు తప్పిస్తున్నా..నడిరోడ్డు నగ్నసత్యంగా
బారసాల చేసింది బజారు. భవిష్యత్తుకిదే ఖరారు.

రగిలిన జఠరాగ్నినార్ప రాలే మెతుకులు
దొరకని దైన్యం, దీనుల పయనానికి హేతువులు
ఎంగిలి కూడా అంటకుండా పొమ్మంది పట్నం
కష్టాల కడలి ఈదినా, కన్నీళ్ల సంద్రమే తోడైంది.

భరోసా లేని జీవితాల్ని, నెత్తిన మూటలా...
చంకన పిల్లల్ని, తల్లుల్ని మోస్తూ, ఆశల తీరం కోసం
చిరిగిన పాదాలు చీలిన దేహాలు కార్చిన నెత్తురు
తూర్పున సింధూరమై కాల్చుతున్నా.. ఏగుతున్నరు.
ఊరు ఉత్సాహం నింపేనో, ఊపిరి ఉయ్యాలలుపేనో.!



–వి. పద్మ
9951445867

## కరోనా నీకు వందనం

ఓ కరోనా విశ్వంలోకి నువు
ఏ సమయంలో విచ్చేసావొ కాని
విచ్ఛిన్నమైన మానవ సంబంధాల
విలువలను విపులీకరించిన
ఓ కరోనా నీకు వందనం..!

ధరణిలొ ధనమే ముఖ్యమని
విర్రవీగుతున్న మనవజాతికి
అది అన్ని అవసారాలకు పనికొచ్చే
ఆయుధం కాదని గుర్తుజేసిన
ఓ కరోనా నీకు వందనం..!

ప్రపంచ ఆర్థిక వ్యవస్థను కుదేలుచేసి
మున్ముందు ఆర్థిక సముపార్జన,
ఆర్థిక వినిమయం యొక్క
విలువలను తెలియ
జేయబోతున్నందుకు
ఓ కరోనా నీకు వందనం...!

ప్రతి ఇంట స్త్రీ యొక్క ప్రాముఖ్యత
నిత్యం తానుచేయు కష్టాన్ని
వీక్షించే అవకాశం ఇంటిల్లిపాదికి
చూపించి గృహ లక్ష్మి పై
గౌరవాన్ని పెంచేలా చేసిన
ఓ కరోనా నీకు వందనం..!

నానా రకాల ఆహారపు అలవాట్లకులోనై
ఇంటజేసిన ఇంతి వంటలు నచ్చక
ఇబ్బందిపెట్టే వారు సైతం
ఇంటివంటే మేలని ఒప్పుకునేలా జేసిన
ఓ కరోనా నీకు వందనం..!

జంకు ఫుడ్లను సేవించి రకరకాల
జబ్బులను ఆహ్వానించి
ఆసుపత్రులలో ఆవాసముండే వారికి
ఇంపుగా ఇంటిభోజనము తినిపించి
శారీరక బుగ్మతల మెడలు వంచిన
ఓ కరోనా నీకు వందనం..!

ఆహారపదార్థాల ఆవశ్యకతలో
విచ్చల విడితనాన్ని తూలనాడి
వినియోగించు విధానాన్ని
దాని ప్రాముఖ్యతను తెలియజేసిన
ఓ కరోనా నీకు వందనం..!

చేతులు శుభ్రపరచకుండా
అన్యదేశపు అలవాట్లనేర్పరుచుకొని
ఫోర్కులతో పనికానిచ్చే పద్ధతిని
గతింపజేసి, చేతులను శుభ్రపరచే
విధానానికి పునఃస్వాగతం పలికిన
ఓ కరోనా నీకు వందనం..!

మధ్యం మత్తుకు బానిసలై
కుటుంబ బాధ్యతలు విడిచి
సంసారాన్ని సరిదిద్దుకోలేక
ఆగమైన ఎన్నో కుటుంబాలు
నీ రాకతో కోలుకున్నాయి
మద్యపుకుంపటి పై నీళ్ళు జల్లిన
ఓ కరోనా నీకు వందనం..!

ప్రతి రోజూ ఎవరికివారే
యమునాతీరే అని బ్రతుకుబండినెక్కి
బయలుదేరే పరుగు జీవులకు
స్వీయ గృహ నిర్బంధ రూపేనా
అందరిలో అనురాగం
ఆప్యాయతలు వెల్లివిరిసేలా చేసిన
ఓ కరోనా నీకు వందనం..!

భారతీయ సత్ సంప్రదాయంలో
భాగమైన సంస్కారపు నమస్కారాన్ని
మరలా అందరికీ గుర్తుజేసినందుకు
ఓ కరోనా నీకు వందనం..!

నేడు అందరికీ అన్ని విధాల
ఉపయోగకారిగా మారి
తా – లేనిదే ఎవరూ ఏమిచేయలేరనే
దీమాతొఉండి,పర్యావరణాన్ని
తమ కాలుష్యంతో కోరలతోపట్టిపీడిస్తున్న
మహమ్మారి వాహనభూతాల
రాకపోకలను సైతం ఆపేసి
కాలుష్యనిర్మూలన గావించిన
ఓ కరోనా నీకు వందనం..!

నిత్యం కిటకిటలాడు
భక్తులతో దేవాలయాలు
రోగులతో వైద్యాలయాలు
పిల్లలతో విద్యాలయాలు
పెద్దలతో కార్యాలయాలు
కళావిహీనమైనవి....కాని
ఇంటిలోనేఉంటూ మకిలిపట్టిన
మనోహృదయాలను శుభ్రపరుచుకునేలా
చేసిన కరోనా నీకు వందనం...!

కూర్పట్ల పడుతున్న కళామతల్లిని
కుదిపి లేపి నీ గురించి
వారిమనోభావాలను కళారూపేన
తెలియజెప్పించుకుంటున్న
ఓ కరోన నీకు వందనం...!

రాజులైనా,రైతులైనా
ధనికులైనా,బీదలైనా
కులాలైనా,మతాలైన
జాతి,నీతి భిన్నాలైనా
ప్రాంతీయ బేధాలున్నా
అందరం అమ్మకన్న బిడ్డలమే
అందరవీ ప్రాణాలేనని
రోగం ఎవరికీ అతీతంకాదని
మానవ సమాజనిర్మాణంలో
అందరూ పావులమని
చమురు ఉంటేనే ప్రమిదకు విలువని
సధి ఉంటేనే సమిదకు విలువని
పంచభూతాల కలయికే మానవ శరీరమని
సంప్రదాయాలు పాటిస్తేనే
సమాజానికి విలువని
ఆస్తులెన్నిఉన్నా అంతిమయాత్ర తప్పదని
తెలివెంతవున్నా బ్రతుకు తెల్లారక తప్పదని
సముపార్జనంతా
వచ్చిననాడు తెచ్చింది కాదని
పోయెనాడు తీసుకెల్లేదీ లేదని
మానవత్వ ఉంటేనే
మనిషికి విలువని
అందరికీ కనువిప్పు కలుగజేసిన
ఓ కరోనా నీకు వందనం.....!

నేడు ఆసియాఖండపు
అమూల్యవిలువలనూ
ఆచార సాంప్రదాయాలను
వైజ్ఞానిక పద్ధతులను
ఆరోగ్య సూత్రాలను
మాకు ఇన్నిచేసినా
నువ్వంటే మాకుకోపం..!?
ఎందుకో తెలుసా...!

మానవ సంబంధాలను మెరుగుపరిచి
కుటుంబంలో అన్యోన్యతను పెంచి
అందరినీ పట్టిపీడిస్తూ ప్రాణాలను
హరించివేస్తున్న ఆకారంలేని
మహమ్మారివి ...!
అందుకే నువ్వంటే కోపం..
we hate you..!



–ఆకుల.వెంకటరమణ
94417 17212

## నిలువు దోపిడీ

బతికున్న మనుష్యులనే కాదు చచ్చిన
శవాల మీద కూడా ఏరుకుతింటున్నరు
కరోనా పేరుతో ఘరానా మోసం
కార్పొరేట్ కాదు
దోచే రేసులో ప్రథములు
రక్షణ కవచాలు కాదు
రక్తాన్ని పీల్చే రాక్షసులు
భయాన్ని సొమ్ము చేసుకుంటూ
ధనాన్ని పెంచుకునే దొంగలు!

దొరికింది సందు
దొరికింది సాకు
పీక్కుతినుడే వారి విధి
నిండుతున్న బోషాణం నిధి
ఉన్నోళ్ల దగ్గర తింటే పర్లేదు
పేదోళ్ల కష్టాన్ని కాటేస్తున్నారు
ఏరేసి వలేసి పట్టేస్తున్నరు!!

పెద్దాసుపత్రులు కాదు
పేదోడి స్మశాన వాటికలు
దోచినంతా దోచేసి
ప్రాణాలను తీసేసి
తమాషా చూస్తున్న
వైద్య బేహారులు
నిలువుదోపిడీ చేసే బందిపోటు దొంగలు
లక్షలు లాగేసే లత్కోరోళ్ళు
బతికొస్తమనుకొని పోతే
తిరిగి బట్టకట్టకుండా
చిది మేసి చితిని పేరుస్తున్నరు!!

ఉన్నోడికో నీతి లేనోడికో నీతి
నీటి మీది రాతలే
కోట్లకెగబడి
మానవత్వాన్ని మరచిపోయింద్రు
బిల్లులు లక్షల్లో
ప్రాణాలు గాలిలో
ఇది మన స్వేచ్ఛా రాజ్యం!!



–డా.చీదెళ్ళ సీతాలక్ష్మి
9490367383

## జడపదార్థం

కబంధహస్తాల కరోనా వదలనంటోంది
దినసరి కూలీల
దినం గడవనంటోంది
బడుగు బతుకుల
బండి నడవనంటోంది
చిరు వ్యాపారుల
సిరి చెదిరిపోయింది
సూదిమందు ఎండమావిలా
అందనంటోంది...
నేటి భారతంలో ఇదో
దారుణ మారణ పర్వం !
మరణించినా మర్యాద లేని
మానవత్వ హననం
వయోభేదాల కతీతమైన
వరస తప్పిన వేట
ఇంతై వటుడింతై అన్నట్టు
భూమండలాన్ని కబళించిన
సూక్ష్మరాక్షసి విలయత్వమిది !
మన చావు మన్ని చావనివ్వదు
మన బతుకు మన్ని బతకనివ్వదు
అంతా దానిష్టం...
గొప్ప నియంతలైనా వణకాల్సిందే
ఎంత వైద్యుడైనా చిక్కితే పీనుగవ్వాల్సిందే
మనుషుల్నే కాదు వ్యవస్థల్నీ
చంపేసింది
నిస్తేజాన్ని నిర్వేదాన్ని స్తబ్దతని
కొత్తగా పరిచయం చేసింది
మనుషుల్లో రోగంగా మనసుల్లో
భయంగా తిష్టేసింది
భౌతికదూరం పేరుతో బంధాల్ని తెంపి..
గతితార్కిక భౌతికవాదానికి కూడా చిక్కని
బ్రహ్మపదార్థమై కూర్చుందీ జడపదార్థం !!



– భీమవరపు పురుషోత్తం
సెల్ 9949800253

## మధురవాణి

కుంకుడుకాయను వదలి షాంపూను చేరి
కుంకుడుకాయకు దూరం అగుట తగదన్న
కుంకుడుకాయయే వెంట్రుకల సంరక్షణ చేయునని
పెద్దలు చెప్పిన మాట నిజమన్న.

పొలమును చెరిపి ఇల్లు కట్టి
పొలమునకు దూరం అగుట తగదన్న
పొలాలే తిండి గింజలు అందించునని
పెద్దలు చెప్పిన మాట నిజమన్న.

పారాణి వదలి క్రీములు పెట్టి
పారాణికి దూరం చేయుట తగదన్న
పారాణియే దేహ సౌందర్యమును పెంచునని
పెద్దలు చెప్పిన మాట నిజమన్న



–జాధవ్ పుండలిక్ రావు పాటిల్
9441333315

## ఏం జరగనట్లే!?

అన్ని మామూలు గానే
జరిగి పోతున్నాయి
షాపింగులు,షికార్లు!
పెళ్లిళ్ళు, పేరంటాళ్ళు
ఏం జరగనట్లే, ఏం ఎరగనట్లే!

మాస్కులు లేకుండా
శానిటైజర్లు పూయకుండా తిర్గడం.

అంబులెన్సులు చక చక
రోగులతో ఆసుపత్రులు కిట కిట
తరలుతున్నాయి నిశ్శబ్దంగా
శవాలు శ్మశానానికి... అకటా!
అయినా,
జనాలు తిరుగుతున్నారు
ఏం జరగట్టే, ఏం ఎరగనట్టే!

వాట్సప్ లో,ఫేస్ బుక్ లో
కవితా స్రవంతులు!
జూమ్ లో సభలూ,సమ్మేళనాలు!

శత జయంతి ఉత్సవాలు!
హరితహార మహోత్సవాలు!

మంత్రుల పర్యటనలు,
కార్యకర్తల హడావుడి,
శంకుస్థాపనలు, ప్రారంభాలు,
కండువాల మార్పిడీ
అంతా మామూలుగానే జరుగుతున్నాయి!

ఏం జరగనట్లే!
ఏం ఎరగనట్లే!!



–కమలేకర్ శ్యామ్ ప్రసాద్ రావు
9398507940

## వెలుగు వెలగండి

ముడతల చర్మమే కానీ..
గడుసరి చురుకైన
నూట అయిదేళ్ల వయస్సే..!

కరోనా వచ్చినా
కోరలున్న దాని తాతొచ్చినా
కోలుకునేంత ధైర్యముండీ
కొడుకులకూ కూతుర్లకు
కొండంత అభయమిచ్చి
పండు వెన్నెల వెలుగుతో
నిండుధనంతో ఇంటికి
తిరిగొచ్చిన అవ్వ..కాదు అమ్మ..

ప్రాణాయామంతో
ధ్యాన యోగాసనాలతో
చక్కటి ఆరోగ్యంతో ఆమె
చిక్కటి నవ్వును చూసైనా
కరోనా బారిన పడ్డోళ్లు
ధైర్యంగా ఉండీ
ధీరులుగా వెలుగు వెలగండి..



–కొక్కె రాములు
9985341992

## మాతృభాష నినాదాలు

పలుకు "తేనె"మాతృభాష
పలకకుంటె మృత్యుఘోష

మాతృభాష కలకండ
అన్యభాష కల్లుకుండ

మాతృభాష సుధకుంభం
అన్యభాష ఉరికంబం

గారాల పలుకురా మనభాష తెలుగు
జవరాలి కులుకురా మన భాష తెలుగు

వెలుగెందుకు తెలుగుండగ
పలికెందుకు తెలుగండగ

అమ్మపలుకు మధు రసం
అన్యభాష అది విషం

వేలయేండ్ల తెలుగు
తళుకులీను వెలుగు

కలకాలం వర్ధిల్లు తెలుగు వాడిగా
గళగళమున వర్ధల్లుతెలుగు వాణిగా

శిలలోన మనతెలుగు శిల్పమ్మురా
తెలుగుండు తీరునదికల్పమ్మురా

సంజీవినీ మనకు మాతృభాష
సంధాయిని మనకు మాతృభాష



–కిలపర్తి దాలినాయుడు
7780589336

## కరోనా మరణాలు...

ఓ మనిషీ ! నీవిలా
అకస్మాత్తుగా అనూహ్యంగా
అతి దారుణంగా అతి భయంకరంగా
కలలో సైతం వుహించని రీతిలో
మాయదారి మహమ్మారి కరోనా బారినపడి
కన్నుమూస్తే,వీధిలో ఒక అనాధలా ...

కాసేపు కన్నీరు కార్చడానికి
నిన్ను చివరిచూపు చూడడానికి
నీవు చేసిన మహత్కార్యాలను,
నీ త్యాగాలను, నీ నిస్వార్థమైన సేవల్ని
నీ స్వచ్ఛమైన ప్రేమను,నీ మంచితనాన్ని
గుర్తుచేసుకొని,గుండెలు బాదుకునేందుకు
నీ కన్నవారుగాని, కట్టుకున్నవారుగాని రాకపోగా
అట్టహాసంగా జరగవలసిన నీ అంత్యక్రియలు
అతి సహజంగా, అతి రహస్యంగా జరిగితే...

మొన్నకొన్న ఆ ఖరీదైన కార్లు
బ్యాంకు లాకర్లలో దాచిన లక్షలు
నిన్న కట్టిన ఆ విశాలమైన, విలాసవంతమైన
ఆ బంగారు భవనాలు, ఏడంతస్తుల మేడలు
ఆర్జించిన కోట్లకొలది ఆస్తులన్నీ ఏమైపోవాలి ?
అసలు ఏమిటీ ఈ దిక్కులేని కుక్కచావు ?

బ్రతుకంటే ఇంతేనా ? బ్రతుకంటే ఒక వింతేనా?
నేడు గుబాళించి రేపు రాలిపోయే ఒక గులాబిపువ్వేనా?
అప్పుడే పుట్టి అప్పుడే పేలిపోయే ఒక నీటిబుడగేనా?
నేడు వెలిగి రేపు ఆరిపోయే ఒక చిరుదీపమేనా?
కరోనా వైరస్ పుట్టడమేంటి ?ప్రపంచాన్ని చుట్టడమేంటి?
ప్రతితలుపును తట్టడమేంటి ? ముద్దు పెట్టడమేంటి
షేక్ హ్యాండ్ ఇచ్చినవారంతా శవాలుగా మారడమేంటి?



–పోలయ్య కవి కూకట్లపల్లి
9110784502

## నిత్యస్మరణీయులు

### వేదవ్యాసుడు



–దోరవేటి
సెల్:9866251679

కం॥ గురుపౌర్ణమి నీ పేరున
ధరలో నుత్సవముగాను తప్పక ప్రతి వ
త్సరమును భారతధరణిన్
జరుపబడున్ వేదవ్యాస! సత్యవి భూషా!

ఉ॥ వేదసమస్త సంపద సవిస్తరమై దరిశింపజేయగా
వేదవిధానమౌ గతిని నాలుగు జేసియు తృప్తినొందకన్
వేదయినట్టి శైలిని వినిర్మితి జేసితివయ్య భారతం
బాదరణంబు నొందె పరమార్థము జూపెడి ఇతిహాసమై!

ఆ॥ భారతమును వ్రాసి, భవ్యమ్ముగా నందు
పాత్రమైతివే విచిత్రగతిని
దిక్కు జూపునట్టి దివ్యౌషధమ్మది
లోకమునకు సర్వ శోకములకు

శా॥ కాశీపట్టణమందు శిష్యయుతుడై, గంగానదీ తీరమం
దోశావాసముగాను ఛాత్రయయుతా ధీరుండవై ఉగ్రహా
వేశం బందున జిక్కి భంగపడియున్ పెల్గొందవే! జ్ఞానవా
రాశీ! దోషహరాశ్రితా! నిరత వైరాగ్య ప్రభా భాసితా!

# పరమశివుడు మా మాస్టారు

ఆకాశంలోవెలిగే ధృవనక్షత్రాన్ని నేనైతే
ఆ వెలుగు వెనకనున్న తెర ఆకాశం మా మాస్టారు

బ్రహ్మాస్త్రాన్ని సంధించే మహావీరుడ్ని నేనైతే
అస్త్రాన్ని సంధించడానికి ఉపకరించే మంత్రం మా మాస్టారు

ఆరు అంతస్థుల అందమైన భవంతిని నేనైతే
ఆభవంతికి పునాది రాళ్ళను పేర్చిన మేస్త్రీ మా మాస్టారు

అంతరిక్షంలోకి దూసుకెళ్లే రాకెట్టును
నేనైతే
ఆ రాకెట్టునిండా దట్టించిన ఇంధనం మా మాస్టారు

అద్భుతాల సూపర్ కంప్యూటర్ ని నేనైతే
ఆ కంప్యూటర్ ని సాఫ్ట్ గా నడిపించే సాఫ్ట్వేర్ మా మాస్టారు

శివతాండవానికి సహకరించే మృదంగ ధ్వనులు నేనైతే
ఆ ధ్వనుల్ని సృష్టించే మృదంగమే మా మాస్టారు

అన్యాయాన్ని ఎదిరించే సాహస లావాన్ని నేనైతే
అందుకోసం బ్రద్ధలయ్యే అగ్నిపర్వతం మా మాస్టారు

ఎర్రగాపండిన పరిమళాల తాంబూలాన్ని నేనైతే
అందులో ఉన్న ఆకు;వక్క సమస్తం మా మాస్టారు

పదితలల జ్ఞానవంతుడ్ని నేనైతే
ఆ తలలు వంచి నేను పూజించే పరమశివుడే మా మాస్టారు

బోసి నవ్వుల పసిపాపను నేనైతే
ఆ పాపను లాలించే తల్లి ఒడి మా మాస్టారు



–డాక్టర్ కె.జి. వేణు
98480 70084

## బాల గేయం

# ప్రశ్నించగ ప్రయత్నించు!

ప్రశ్నించగ ప్రయత్నించు!
ప్రతిదానిలో ప్రగతి గాంచు! ॥ప్ర॥

బడిలో ప్రతి పాఠానికి
ప్రశ్నించుట నేర్చుకో!
ప్రశ్నలోంచి పాఠాల
సారం గ్రహించుకో! ॥ప్ర॥

ఏది ఎలా జరుగుతోంది?
ఎందుకలా జరుగుతోంది?
అన్న జిజ్ఞాసలనే
అధికంగా పెంచుకో!
భౌగోళిక గమనాలను
బాగా గమనించుకో!
భౌతిక శాస్త్రాలందలి
విజ్ఞానం గ్రహించుకో! ॥ప్ర॥

రసాయనికి చర్యల్లో
రహస్యాలు తెలుసుకో
గణితంలో గుణితాలను
జ్ఞాపకంగ ఉంచుకో!
ప్రతి పనికీ లెక్కలే
పనికొచ్చును తెలుసుకో!
మాతృభాషనే మరువక
మన సంస్కృతి నేర్చుకో! ॥ప్ర॥



– డా॥ వడ్డేపల్లి కృష్ణ
9246541699

# కాళోజీ మార్గం ఆదర్శప్రాయం





– డాక్టర్ రాయారావు సూర్యప్రకాశ్ రావు
9441046839

ఆలోచనలో మానవత, ఆచరణలో ధీరత్వం నింపుకున్న కవి చెమ్మగిల్లిన కనులలోని భావధార ఎలా ఉంటుంది? ఆవేశపు అగ్ని కణం, కరుణ రసాన్ని నింపుకున్న వానాకాలపు మబ్బు ఒకే మనిషిలో కనబడితే ఎలా ఉంటుంది? ఎంతటివారినైనా నిలదీసే నిజాయితీ, పాఠకుడిని కట్టిపడేసే వ్యంగ్యం, తడి మనసు కన్నీటి జల్లు – ఇవన్నీ కలగలిసి ఏకరూపం దాలిస్తే ఎలా ఉంటుంది? ఈ ప్రశ్నలన్నిటికీ సమాధానంగా నిలిచేది ప్రజాకవి కాళోజీ కవిత్వం. కాళోజీ కలం నుండి ప్రసరించిన రవి కిరణ కాంతులు హృదయ వీణా తంత్రులను మీటి, ఉద్యమరాగాలను పలికిస్తాయి. మనిషిలోని మనసును పలకరిస్తాయి. భావోద్వేగాలను ఉవ్వెత్తున ఉరికిస్తాయి. ప్రజల మదిలోని భావాలు అక్షర రూపం దాల్చి ఆయన గొంతులో పలుకుతాయి. తెలుగు ప్రజల జీవన చలన శీలతకు నిదర్శనంగా ఆయన కవిత్వం నిలుస్తుంది.

కాళోజీ నారాయణరావు పూర్వీకులు మహారాష్ట్రకు చెందినవారు. మహారాష్ట్ర పీష్వాలకు నిజాం నవాబు బకాయి పడ్డ సుంకాన్ని వసూలు చేయడానికి పీష్వాల సైనికుల్లో కొందరు నిజాం సంస్థానానికి వచ్చారు. కాళోజీ పూర్వీకులు కూడా అలా వచ్చినవారే. అలా వచ్చిన కుటుంబాల్లో కొన్ని వరంగల్, బీదర్ ప్రాంతాల్లో స్థిరపడ్డాయి. ఆ విధంగా స్థిర నివాసం ఏర్పర్చుకున్నవారిలో కాళోజీ రంగారావు కూడా ఉన్నారు. గుల్బర్గా సుబేదారుగా పనిచేసిన రఫత్ యార్ జంగ్ బహద్దూర్ వద్ద బెంచి క్లర్కుగా ఆయన పనిచేశారు. కర్ణాటకకు చెందిన రమాబాయమ్మను ఆయన పెళ్ళి చేసుకున్నారు. ఆ దంపతుల మొదటి సంతానం రామేశ్వర నరహరి రాధాకిషన్‌రావు ఝర్ణీ శ్యాంరాజా కాళోజీ. ఆయనే ఉర్దూ కవిగా చక్కటి పేరు పొందిన కాళోజీ రామేశ్వర రావు.



> "కాళోజీ కలం నుండి ప్రసరించిన రవి కిరణ కాంతులు హృదయ వీణా తంత్రులను మీటి, ఉద్యమ రాగాలను పలికిస్తాయి".

ఆ దంపతుల రెండవ సంతానంగా కర్నాటక రాష్ట్రంలోని బీజాపూర్ ప్రాంతంలో ఉన్న రట్టిహళ్లి అనే గ్రామంలో 1914 సెప్టెంబరు తొమ్మిదో తేదీన రఘువీర్ నారాయణ్ లక్ష్మీకాంత్ శ్రీనివాసరావు రాంరాజా కాళోజీ జన్మించారు. ఆయనే కాళోజీగా విఖ్యాతులైన కాళోజీ నారాయణరావు. తల్లి రమాబాయి కన్నడ కుటుంబానికి, తండ్రి రంగారావు మహారాష్ట్రకు చెందిన వారు కావడంతో కాళోజీ ఇంట్లో బహుభాషా వాతావరణం నెలకొని ఉండేది. దాంతో చిన్ననాటనే తెలుగు, ఉర్దూ, మరాఠీ, కన్నడ, హిందీ భాషల్లో ప్రావీణ్యత పొందారు కాళోజీ. కొంత కాలం మహారాష్ట్రలోని సాయరాం అనే గ్రామంలోనూ ఆ తర్వాత ఇల్లెందు ప్రాంతంలోని కారేపల్లి గ్రామంలోనూ ఆయన బాల్యం గడిచింది. ఆ తర్వాత ఆ కుటుంబం 1917 వరకు హనుమకొండలో నివసించింది. అనంతరం మడికొండకు మారింది.

తొలి దశలో కాళోజీ నారాయణరావుపై మేనమామ నర్దేవ్ శాస్త్రి వేద తీర్థ ప్రభావం చాలా ఉంది. ఆయన ప్రముఖ గాంధేయవాది. ఆర్యసమాజాన్ని అనుసరించే నర్దేవ్ శాస్త్రి దక్షిణాది రాష్ట్రాల్లో జరిగే కాంగ్రెస్ సభల్లో, ఆర్యసమాజ కార్యక్రమాల్లో పాల్గొనేందుకు వచ్చేవారు. ఆయా విషయాలను కాళోజీ కుటుంబ సభ్యులతో శాస్త్రి చర్చించేవారు. తనతో పాటు మేనల్లుడు నారాయణరావును కూడా కాంగ్రెస్ సమావేశాలకు, ఆర్య సమాజ కార్యక్రమాలకు తీసుకెళ్ళేవారు శాస్త్రి. ఆ విధంగా మేనమామ సాహచర్యం వల్ల అనేక విషయాలను కాళోజీ నేర్చుకున్నారు.

కాళోజీ ప్రాథమిక విద్యాభ్యాసం మడికొండలోనే ప్రారంభమైంది. ఇంట్లోనే మరాఠీ పత్రికల్లోని సమాచారాన్ని పిల్లలకు చెప్పేవారు ఆయన తల్లి రమాబాయమ్మ. శ్రీరామచంద్రం, సాంబసిద్ధయ్య అనే గురువుల వద్ద ప్రాథమిక విద్యను అభ్యసించారు కాళోజీ. అలా కొద్దికాలం గడిచిన తర్వాత న్యాయశాస్త్ర అభ్యసనకు రామేశ్వరరావు హైదరాబాదు పాతబస్తీకి మకాం మార్చడంతో ఆ కుటుంబం కూడా హైదరాబాదుకు వలస వెళ్ళింది. అలా పాతబస్తీ ఛౌమహల్లా కాన్గీ బడిలో చేరారు కాళోజీ. అనంతరం సుల్తాన్ బజార్‌లోని రెసిడెన్సీ మిడిల్ స్కూల్‌లో చేరారు. తొలిసారిగా అప్పుడే పాఠశాలలో నాటకాలు వేశారు ఆయన. అదే సందర్భంలో 1926లో బొంబాయిలో అఖిల భారత స్కౌట్ జంబోరీ జరిగింది. ఆ జంబోరీలో పాల్గొన్నారు కాళోజీ. హైదరాబాదు మహానగరంలో విద్యాభ్యాసం వల్ల ఆర్య సమాజానికి చెందిన నల్గొండ వాస్తవ్యుడు భద్రదేవ్ మొదలైనవారితో పరిచయం ఏర్పడింది. పౌరహక్కుల సభలు కూడా ఆయనను ఆకర్షించాయి.

అదే తరుణంలో సోదరుడు రామేశ్వరరావు చదువు పూర్తయి, న్యాయవాద వృత్తి చేపట్టేందుకు హనుమకొండకు తిరిగి వెళ్ళడంతో నారాయణరావు కూడా అక్కడికి వెళ్ళవలసి వచ్చింది. వరంగల్ కాలేజియేట్ ఉన్నత పాఠశాలలో 1934లో ఇంటర్మీడియట్‌లో ప్రవేశించారు. ఆ ఏడాది జరిగిన విద్యార్థి సంఘ ఎన్నికల్లో ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారు. అయితే వైద్య కారణాల వల్ల దాదాపు ఏడాదిన్నర పాటు ఆయన చదువు ఆగిపోయింది. ఆ రోజుల్లో న్యాయ విద్య చదివేందుకు మిడిల్ స్కూల్ ఉత్తీర్ణులై, హిందీ భాషా పరిజ్ఞానం ఉంటే సరిపోయేది. దాంతో కాళోజీ న్యాయ విద్యను అభ్యసించేందుకు హైదరాబాదు వెళ్లారు. అక్కడ 1939లో న్యాయ విద్యాభ్యాసం పూర్తి చేసుకున్నారు. ఒద్దిరాజు రాజేశ్వరరావు దగ్గర జూనియర్ లాయర్‌గా ప్రాక్టీస్ మొదలుపెట్టారు.

ఏ చట్రంలోనూ ఇమడని మహోన్నతుడు కాళోజీ. బహువ్యాపకాలు, విభిన్న ఆలోచనాధోరణుల సమాహారంగా కనబడతారు. ఒకవైపు గణపతి ఉత్సవాల్లో చురుకుగా పాల్గొన్నారు. మరోవైపు అభ్యుదయ భావజాలాన్ని పుణికిపుచ్చుకున్నారు. సాహిత్యం, ఉద్యమాలు, రాజకీయాలు – ఈ విధంగా పలు మార్గాల్లో విస్తరించిన చైతన్యం ఆయన సొంతం. సమకాలీన ఉద్యమాలన్నింట్లోనూ ముందు వరుసలో నిలిచిన ధీరుడు కాళోజీ. గ్రంథాలయోద్యమం, ఆర్యసమాజం, రజాకార్లపై పోరాటం, హైదరాబాదు సిటీ కాంగ్రెస్ ఉద్యమాలు, ఆంధ్ర మహాసభలు, తెలంగాణ రైతాంగ పోరాటం, తొలి దశ తెలంగాణ ఉద్యమం, పౌర హక్కుల ఉద్యమం, అత్యవసర పరిస్థితి వ్యతిరేక ఉద్యమం మొదలైన వివిధ పోరాటాల్లో పాల్గొన్న నిత్య చైతన్యశీలి కాళోజీ. విద్యాభ్యాస దశలోనే నిజాం ప్రభుత్వ ఆంక్షల నడుమ గణపతి ఉత్సవాలను వరంగల్‌లో ఘనంగా నిర్వహించారు కాళోజీ.

పలు అంశాలను బాల్యంలోనే కాళోజీ నేర్చుకున్నారు. ఆయనలోని అధ్యయన తృష్ణను తీర్చేందుకు ప్రతాపరుద్ర ఆంధ్ర భాషా నిలయం తోడ్పడింది. ఆ గ్రంథాలయాన్ని మడికొండ గ్రామంలో వానమామలై వేంకటాచార్యులు, పెద్ద శివరాజంలతో కలిసి కాళోజీ తండ్రి రంగారావు నెలకొల్పారు. ఆ గ్రంథాలయం వల్లే కాళోజీ విస్తృత అధ్యయనం చేయగలిగారు. గ్రంథాలయం వేసిన పునాది ఆయన స్వీయానుభవంలోనిది కాబట్టే తెలంగాణలోని ప్రతి గ్రామంలో ఒక గ్రంథాలయం ఉండాలని కాళోజీ ఆకాంక్షించారు. హనుమకొండలో 1931లో జరిగిన రాజరాజనరేంద్ర ఆంధ్ర భాషానిలయం రజతోత్సవాల్లో కాళోజీ పాల్గొన్నారు. ఆ విధంగా గ్రంథాలయోద్యమంతో పరిచయం ఏర్పడింది. ఆ స్ఫూర్తితో వరంగల్‌లోని పబ్లిక్ పార్కులో నెహ్రూ గ్రంథాలయాన్ని కాళోజీ నెలకొల్పారు. అనంతరం పల్లగుట్ట, ఘనపురం మొదలైన పలు ప్రాంతాల్లో గ్రంథాలయాల స్థాపనకు విశేషంగా కృషి చేశారు.

గ్రంథాలయోద్యమం ఎల్లెడలా ఉన్న తరుణంలో కాళోజీ తెలంగాణలో విస్తృతంగా పర్యటించారు. తాను వెళ్ళిన ప్రతి గ్రామంలోనూ కవిసమ్మేళనాలను నిర్వహించారు. అందువల్లే గ్రంథాలయోద్యమ ఆస్థానకవిగా కాళోజీని గాడిచర్ల హరిసర్వోత్తమ రావు పేర్కొన్నారు. 1942లో వరంగల్‌లోని శబ్దానుశాసన గ్రంథాలయ రజతోత్సవాల్లో కాళోజీ చురుకుగా పాల్గొన్నారు. ఆ తర్వాత రెండేళ్లకు 1944లో ఇల్లెందులో జరిగిన ఇరవై ఐదవ ఆంధ్ర దేశ గ్రంథాలయ మహాసభల నిర్వహణలో ముఖ్య భూమిక పోషించారు. శ్రీకృష్ణదేవరాయాంధ్ర భాషా నిలయ కార్యదర్శిగా, రాజరాజనరేంద్ర ఆంధ్ర భాషానిలయ కార్యదర్శిగా ప్రశంసనీయంగా పనిచేశారు.

నిజాం పరిపాలన కాలంలో తెలుగుకు ప్రోత్సాహం కరువు కావడంతో 1943లో ఆంధ్ర సారస్వత పరిషత్తు వ్యవస్థాపనలో కాళోజీ నారాయణరావు కీలక పాత్ర పోషించారు. సారస్వత పరిషత్తు కార్యనిర్వాహక వర్గ సభ్యుడిగా కూడా ఆయన ఎన్నికయ్యారు. కాళోజీ కార్యదర్శిగా 1944లో ఆంధ్ర సారస్వత పరిషత్తు మొదటి వార్షికోత్సవ సభలు వరంగల్లులో ఘనంగా జరిగాయి. సారస్వత పరిషత్తు వ్యవస్థాపనలోనే కాకుండా ఆంధ్ర జనసంఘం, తెలంగాణ రచయితల సంఘం స్థాపనలోనూ కీలక పాత్ర పోషించారు కాళోజీ.

స్వాతంత్ర్యోద్యమంలో, నిజాం వ్యతిరేక పోరాటంలో చురుకుగా పాల్గొన్నారు కాళోజీ. పలువురు ప్రముఖ నాయకులతో కలిసి, వివిధ ఉద్యమాల్లో భాగస్వామి అయ్యారు. ఆ ఉద్యమాల్లో 1939లో తొలిసారిగా అరెస్టయి, మూడు రోజులపాటు వరంగల్‌లో జైలు జీవితం గడిపారు. కేసు నిలవకపోవడంతో విడుదలయ్యారు. క్విట్ ఇండియా ఉద్యమంలో చురుకైన పాత్ర పోషించి, 1942లో రెండవ దఫా అరెస్టయ్యారు. తొలుత వరంగల్ జైలులో, అనంతరం చంచల్‌గూడ జైలులో ఆయనను ఉంచారు. జైలు జీవితం గడుపుతుండగానే క్షయవ్యాధి సోకి, ఉస్మానియా దవాఖానాలో ట్రీట్‌మెంట్ పొందారు. హనుమకొండలో ఏనుగుల గడ్డ దగ్గర జరిగిన పతాకావిష్కరణకు కాళోజీ హాజరైన సందర్భంలో దొంగ సాక్ష్యాలు సృష్టించి, మూడోదఫా ఆయనను అరెస్టు చేసి, వరంగల్ జైలులో నిర్బంధించారు. నాటి నిజాం ప్రభుత్వం ఆయనను జైలుపాలు చేసినా ఆయన వెరవలేదు. ఆరోగ్యం బాగాలేకపోయినా లక్ష్యపెట్టలేదు. ఒక పర్యాయం 'నిజాం ప్రభుత్వానికి వ్యతిరేకంగా పనిచేయనని రాసి ఇస్తే విడుదల చేస్తామ'ని ప్రభుత్వం దిగివచ్చినా, ససేమిరా అన్నారు. ఆరోగ్య పరంగా ఇబ్బందులు ఎదుర్కొన్నా ప్రభుత్వానికి లొంగని పోరాట యోధులు కాళోజీ.

> " కేవలం మాటలకే పరిమితం కాకుండా చేతలే ముఖ్యమని భావించిన మహామనీషి కాళోజీ. బతికినంత కాలం ప్రజల గొడవనే తన గొడవగా భావించిన కాళోజీ"

ఆంధ్ర మహాసభల్లో చురుకైన భూమిక పోషించారు కాళోజీ. మహాసభ స్టాండింగ్ కమిటీ సభ్యుడిగా పనిచేశారు. సురవరంప్రతాపరెడ్డి అధ్యక్షతన 1930లో జోగిపేటలో జరిగిన ప్రథమాంధ్ర మహాసభ మొదలుకొని పలు పర్యాయాలు ఆంధ్ర మహాసభల్లో పాల్గొన్నారు.

రెండు దఫాలుగా జరిగిన తెలంగాణ ఉద్యమాల్లో రెండు దశల్లోనూ చురుకుగా పాల్గొన్న కొద్ది మంది నాయకుల్లో అగ్రగణ్యులు కాళోజీ. 1969లో జరిగిన తొలి దశ తెలంగాణ ఉద్యమానికి, 2000 సంవత్సరం నుండి జరిగిన మలి దశ తెలంగాణ ఉద్యమానికి వెన్నుదన్నుగా ఉన్నారు. పెద్ద మనుషుల ఒప్పందాన్ని పాలకులు అమలు చేయకపోవడం పట్ల తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రజల పురోగతికి ప్రత్యేక తెలంగాణ మాత్రమే మార్గమని నొక్కి చెప్పారు.

"తొమ్మిది జిల్లాల ప్రజలు
ఆబాల గోపాలము
ప్రత్యేక తెలంగాణ
పరమావధి అంటున్నారు"

అని ప్రత్యేక తెలంగాణయే తెలంగాణ వాసుల లక్ష్యమని తేల్చిచెప్పారు.

సాహిత్యం ద్వారా, ఉపన్యాసాల ద్వారా కాళోజీ తెలంగాణ ఉద్యమానికి దన్నుగా నిలిచారు. పాలకులు నిర్లక్ష్య ధోరణి ప్రదర్శించడంతో 1969 ఆగస్టు 14వ తేదీన తెలంగాణ ఏర్పాటైనట్టు ప్రకటించి, అరెస్టయ్యారు.

"తెలంగాణ వేరైతే
దేశానికి ఆపత్తా
తెలంగాణ వేరైతే
తెలుగు బాస మరుస్తారా?
ప్రాజెక్టులు కట్టుకున్నా
నీరు ఆగనంటుందా?
పోచంపాడు వెలసి కూడ
పొలములెండిపోతాయా?"

అని ప్రశ్నించారు.

మానవ హక్కుల ఉద్యమానికి, పౌర హక్కుల ఉద్యమానికి కాళోజీ పెద్ద దిక్కుగా నిలిచారు.

సమాజం ఎదుర్కొంటున్న అనేక రుగ్మతలను 'నా గొడవ' పేరుతో అక్షర బద్ధం చేశారు కాళోజీ. ఎనిమిది సంపుటాలుగా ఆ కవితలను వెలువరించారు. కవిత్వంతో పాటు కథలను కూడా రాశారు. అనువాదాలు చేశారు. పరాభవ వసంతం, తుది విజయం మనది నిజం, ఆత్మ కథ, నా భారత దేశ యాత్ర, భారతీయ సంస్కృతి, అంజలి, జీవనగీత తదితర రచనలు చేశారు. రాజకీయాలతో, ప్రజా ఉద్యమాలతో మమేకమైన కాళోజీ కవిత్వం జనం నాలుకలపై నాట్యం చేసింది. 'నా గొడవ' కావ్యాన్ని మొదటి సారిగా 1953లో వట్టికోట ఆళ్వారు స్వామి దేశోద్ధారక గ్రంథమాల పక్షాన ప్రచురించారు. అదే ఏట ఆలంపూరులో జరిగిన ఆంధ్ర సారస్వత పరిషత్తు వార్షికోత్సవాల్లో 'నా గొడవ' కవితాసంపుటిని మహాకవి శ్రీశ్రీ ఆవిష్కరించారు. ఫ్రెంచి కవి లూయీ ఆర్గాన్‌తో కాళోజీని పోల్చుతూ ఆ సభలో ప్రశంసించారు శ్రీశ్రీ. ఆయన రాసిన కథలు 'కాళోజీ కథలు' అనే పేరుతో 1943లో ప్రచురితమయ్యాయి.

భాష విషయంలో కాళోజీవి ఖచ్చితమైన అభిప్రాయాలు. 'బడి పలుకుల భాష కాదు, పలుకుబడుల భాష కావాల'ని మనసారా వాంఛించారు. జీవ భాషకే జై కొట్టారు. పరభాష పట్ల మోజు పెంచుకొని, స్వభాష మాట్లాడేందుకు సంకోచించే స్వభావాన్ని కాళోజీ ఖండించారు.

"అన్యభాషలు నేర్చి ఆంధ్రంబు రాదంచు
సకిలించు ఆంధ్రుడా! చావవెందుకురా?"

అని సూటిగా ప్రశ్నించారు కాళోజీ.

"కమ్మని చకిలాలొకచోట
గట్టి దౌడలింకొకచోట
అన్నపురాసులు ఒక చోట
ఆకలి మంటలు ఒక చోట"

అనే పాదాలతో అవసరాలకు, అవకాశాలకు మధ్య ఉన్న అగాధాన్ని చక్కగా తన కవిత్వంలో చిత్రించారు.

'అన్యాయాన్నెదిరిస్తే
నా గొడవకు సంతృప్తి
అన్యాయం అంతరిస్తే
నా గొడవకు ముక్తి ప్రాప్తి
అన్యాయాన్నెదిరించినోడు
నాకు ఆరాధ్యుడు"

అంటూ తన లక్ష్యాన్ని సుస్పష్టంగా పేర్కొన్నారు కాళోజీ.

తెలంగాణ తెలుగుకూ కోస్తాంధ్ర తెలుగుకూ మధ్య భేదాలను తన కవిత్వం ద్వారా స్పష్టపరిచారు కాళోజీ.

"ఎటు చూసినా
తెలంగాణ అంతట ఆంధ్రత్వం అట
పసుపుకుంకాలు పేరంటాలైనవట
అదాలత్ కోర్టాయెను
ముల్జీం ముద్దాయాయెను
చా 'టీ'యై మరుగుతాంది
సడకు రోడ్డై సాగుతున్నది
షక్కర సుగరై పోయెనె
ఉప్పు సాల్టుగ మారెను
ఆంధ్రుల సంస్కృతి సభ్యత
తెలంగాణ కబ్బుతాంది"

అంటూ ఘాటుగా ప్రతిస్పందించారు.

ఎంతటివారినైనా లక్ష్యపెట్టకపోవడం కాళోజీ తత్త్వం. తప్పెవరిదైనా తూర్పారబట్టడమే ఆయన నైజం. జలగం వెంగళరావు, ఇందిరాగాంధీ, లాల్ బహదూర్ శాస్త్రి.. ఎవరైతేనేం తప్పుని నిలదీయడమే ఆయన ప్రథమ కర్తవ్యం. 'పొదుపు చేయండి' అనే లాల్ బహదూర్ శాస్త్రి పిలుపు నాటి దినపత్రికల్లో ప్రచురితమైంది. ఆ రోజుల్లో సామాన్య ప్రజల్లో విశేష ఆదరణ ఉన్న నేత శాస్త్రి. అయినప్పటికీ ఈ ప్రకటనపై ఆయన స్పందించారు.

"ఓయీ! భారత ప్రధానీ
కొవ్వు బలిసినోరికి చెప్పు
నెయ్యి మానెయ్యమని
ధనం దాచినోరికి చెప్పు
పాతర్లు తియ్యమని
చీకటి బజార్లకు చెప్పు
'నందా'దీపం వెలిగించమని
ముప్పూటా మెక్కే బొర్రలకు చెప్పు
పస్తుండమని..."

అంటూ ఆ ప్రకటనను తీవ్రంగా విమర్శించారు. అత్యవసర పరిస్థితిలో అణచివేతను తీవ్రంగా ఖండించారు.

"పట్టెయ్యి కాళోజీని
మెడ కొట్టెయ్యి కాళోజీది
నా గొడవ సాగకుండా
చేసెయ్యి వెంగళ్రావ్"

అంటూ సవాల్ విసిరారు.

1952లో మొదటి సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెసు పార్టీ అభ్యర్థిగా వరంగల్ లోక్‌సభ నియోజకవర్గం నుండి పోటీ చేశారు కాళోజీ. ఆ ఎన్నికల్లో కేవలం 3613 ఓట్ల స్వల్ప తేడాతో ఓటమిపాలయ్యారు. 1958లో ఉపాధ్యాయ నియోజకవర్గం నుండి శాసనమండలికి పోటీ చేసి గెలిచారు కాళోజీ. పెద్దల సభలో తన ప్రత్యేకత చాటుకున్నారు. అనేక విలువైన ప్రతిపాదనలు చేశారు. అయితే ఆ తర్వాత 1960,1962 సంవత్సరాల్లో అసెంబ్లీ నియోజకవర్గం నుండి శాసనమండలికి పోటీ చేసి, ఓటమిపాలయ్యారు. అనంతరం 1977లో జలగం వెంగళరావుకు వ్యతిరేకంగా ఖమ్మం జిల్లా సత్తుపల్లి నుండి స్వతంత్ర అభ్యర్థిగా అసెంబ్లీకి పోటీ చేశారు. ఆ పోటీలోనూ ఆయన ఓడిపోయారు.

1953లో తెలంగాణ రచయితల సంఘం ఉపాధ్యక్షుడిగా కాళోజీ ఎన్నికయ్యారు. ఆంధ్ర ప్రదేశ్ సాహిత్య అకాడమీ సభ్యునిగా కూడా ఆయన పనిచేశారు. కాకతీయ విశ్వవిద్యాలయం ఆయనకు గౌరవ డాక్టరేటును అందజేసింది. స్వాతంత్ర్య సమరయోధుడిగా కేంద్ర ప్రభుత్వ తామ్ర పత్రం పొందారు. రామినేని ఫౌండేషన్, గాడిచర్ల ఫౌండేషన్ తదితర సంస్థలు కాళోజీకి వివిధ పురస్కారాలను అందజేశాయి. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మక పద్మ విభూషణ్ పురస్కారాన్ని అందజేసి గౌరవించింది.

తెలంగాణ ఆవిర్భావం అనంతరం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కాళోజీ జయంతి అయిన సెప్టెంబరు 9న ప్రతి ఏటా తెలంగాణ భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తోంది. ఈ సందర్భంగా ప్రతి ఏటా తెలుగు సాహిత్యంలో విశేష కృషి చేసిన విశిష్ట సాహితీవేత్తలకు పురస్కారాలు ఇచ్చి గౌరవిస్తోంది.

కేవలం మాటలకే పరిమితం కాకుండా చేతలే ముఖ్యమని భావించిన మహామనీషి కాళోజీ. బతికినంత కాలం ప్రజల గొడవనే తన గొడవగా భావించిన కాళోజీ మరణానంతరం కూడా ప్రజలకు తన శరీరం ఉపయోగపడాలని తలచారు. అందువల్లే చనిపోయిన తర్వాత తన మృత దేహాన్ని కాకతీయ మెడికల్ కళాశాలకు అప్పగించాలని కోరుకున్నారు. ఆ విధంగా మరణానంతరం విద్యార్థుల జ్ఞాన సముపార్జనకు తన శరీరాన్ని అంకితం చేశారు.

కాళోజీ నిష్కల్మష హృదయం, త్యాగ నిరతి, పరోపకార స్వభావం, దృఢ చిత్తం, స్వార్థ రహిత సేవ, చిత్త శుద్ధి, గుండె దిటవు, తెగువ భావితరాలకు ఆదర్శంగా నిలుస్తాయి.

# కణిక



సాహిత్యం, సామాజిక సేవ, విద్యారంగ వేదిక నిర్వహిస్తున్న

## 'బుధవారం బాద్షా' పోటీ ఫలితాలు

నిర్వహణ: డా॥ప్రతికంఠం మాలతీలత

ఈ సమూహంలో చేరదలచినవారు 8985613123కి మెసేజ్ చేయవచ్చు.



అడ్మిన్: రమాదేవి కులకర్ణి
8985613123

### శీర్షిక: కన్నవారి వాత్సల్యం

#### ప్రథమ బహుమతి విజేత

పల్లవి: అమ్మానాన్న పంచినట్టి
ప్రేమే ఆనందం
మనసులోన నిలిచినట్టి
మమతే సంతోషం

చరణం: పెరుగన్నం కలిపి నాన్న
ప్రేమతోని పెట్టినట్టి
ముద్దలెన్నో మదిన నిలిచె
మరువలేని ఆనందం. ॥అమ్మానాన్న॥

చరణం: తరగతిలో మొదటనిలిచి
బహుమతితో పరుగుపెట్టి
అమ్మ ఒడిని చేరినట్టి
మమ్ము చూసి అమ్మ పడిన
ఆనందమే ఆనందమూ. ॥అమ్మానాన్న॥

మొదటి జీతము తోని
నేను అమ్మకొరకు
చీర కొన్నప్పుడు అమ్మ
నన్ను చూసి పడిన ఆనందమే
ఆనందబాష్పాలే ఆనందమూ.

కన్నవారి కంట కన్నీరు రాకుండా.....
కాచి పెంచినట్టి తల్లిదండ్రుల ప్రేమ కడ వరకు
వుండుటే.... ఆనందమూ
మనిషికానందమూ. ॥అమ్మానాన్న॥

వృద్ధాప్య సమయాన
ఇంటిల్లిపాదంతసంతోషమందిస్తు
తల్లిదండ్రులయందు చూపేటి ప్రేమయే ఆనందమూ..
మనసుకానందమూ.॥అమ్మానాన్న॥



–అన్నాడి జ్యోతి

### శీర్షిక: శాంతికపోతాలు

#### ద్వితీయ బహుమతి విజేత

పల్లవి : ఆనందం ఆనందం
శలన్నీ తీరితే ఆనందం! ॥ఆనందం ॥

చరణం: కళ్ళాకపటమెరుగని పాపనైతే ఆనందం
అమ్మ చేతి గోరుముద్దలు తింటుంటే పరవశం !
నాన్న చేయందుకుని నడతలు నేర్చుటానందం!
తోబుట్టువులతో గిల్లికజ్జాలో వినోదం! ॥ఆనందం ॥

చరణం: వానలో తడవడమెంతో ఆనందం!
పడవలు వేసి కేరింతలు కొట్టడమే మధురం!
బురద గుంటలో ఎగురుటే ఆనందం!
హరివిల్లును అందుకోవాలనేదో ఆరాటం!! ॥ఆనందం॥

చరణం: అభివృద్ధి పథమందు నడయాడుటే ఆనందం!
అందరి ఆకలి తీరితే పరమానందం!
మానవులంతా కలిసుంటే ఆనందం!
నింగిలోని శాంతి కపోతాలను కనుటో సంబరం! ॥ఆనందం ॥



–వెగ్గలం ఉషశ్రీ
9440370066

## గురుభ్యో నమః

భారత రాష్ట్రపతిగా
ఎదుగుదలకు కారణం...
దేశభక్తి
పేదరికం నేర్పిన
భారతీయత పాఠం!

విశ్వవిఖ్యాతకు కారణం...
జ్ఞానం,
సంప్రదాయ ఉపన్యాసాలు
పత్ర సమర్పణ!

భారత రత్న
బిరుదుకు
కారణం...
స్వాతంత్ర్య
పోరాట కలం యోధుడు!

సరస్వతి పుత్రుడు
సర్వేపల్లికి
నివాళులు...



– యెల్ది సుదర్శన్ పద్మశాలి
సెల్: 9892411067

జీవితం ఎల్లప్పుడూ వ్యాకోచిస్తుంది
తలుపులు మూసిన మనసు
నిత్యం సంకోచిస్తుంది
వ్యాపనం అనేకం సృష్టించి అందిస్తుంది
ఆశాజీవి ఆ ఫలాలు అందుకోడానికి
అడుగులు వేస్తూనే ఉంటుంది

-మునిమడుగుల రాజారావు

నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం

